www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 17-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 153 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 11.44 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: శతభిషం మ. 1.53 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.7.30-8.55; దుర్ముహూర్తం: ఉ.8.31-9.20, రా.10.06-10.52; అమృతఘడియలు: ఉ.7.29-8.54, తె.3.57-5.22; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.11 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హాకీ ఫైనల్లో ఇండియా

సెమీఫైనల్లో కొరియాపై గెలుపు

చైనాతో నేడు తుదిపోరు

11

గాంధీల గొప్పతనం

గాడిదలకేం తెలుసు?

మీ ఫాంహౌజుల్లో జిల్లేళ్లు మొలిపిస్తాం.. పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలే?

ఆ సన్నాసి విగ్రహం కోసం ఈ స్థలాన్ని రిజర్వ్ చేసుకున్నడు

కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే చివరిచూపునకూ వెళ్లలే

ఇంతకంటే దుర్మార్గుడు, నీచుడు భూమ్మీద ఉంటాడా?

కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

రాజీవ్ విగ్రహాన్ని కూల్చడానికి ఎవడొస్తాడో రమ్మంటూ సవాల్


కంప్యూటర్‌ను పరిచయం చేసింది రాజీవ్ అని తెలుసా?

అదే లేకపోతే గుంటూరులో ఇడ్లీ వడ అమ్ముకునేటోడివి

కేటీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఎద్దేవా

సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం

నిమజ్జనంలో ఇబ్బందులు ఉండొద్దని అధికారులకు ఆదేశం



సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్, మంత్రులు

రాజీవ్ విగ్రహం పెట్టి తెలంగాణ

అస్తిత్వం తాకట్టు

సీఎం చర్యకు నిరసనగా నేడు తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం

మేం వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తాం: కేటీఆర్

13

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గాంధీల గురించి ఈ గాడిదలకు ఏం తెలుసు? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాణ త్యాగం, పదవుల త్యాగమంటే గాంధీ కుటుంబానిదేనని చెప్పారు. అలాంటి కుటుంబ వారసుడైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడతామంటే.. కూలగొడతామంటున్నారని కేటీఆర్, తదితర నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "బిడ్డా.. వెయ్యి ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నావ్. అందులో జిల్లేళ్లు మొలిపిస్తా" అంటూ కేసీఆర్‌ను హెచ్చరించారు. 'బీఆర్ఎస్ విడతల దండు మళ్లీ రాష్ట్రంపైకి వస్తోంది. ఆ దండును మీరు, నేను కలిసి

మిగతా 13వ పేజీలో...

విఘ్ననాయకుడికి

వీడ్కోలు నేడు

గ్రేటర్‌లో 73 ప్రాంతాల్లో నిమజ్జనం

విధుల్లో 15 వేల మంది జీహెచ్ఎంసీ సిబ్బంది

35 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

14



జలసౌధలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్త రేషన్ కార్డులు

వచ్చే నెలలో ప్రజల నుంచి దరఖాస్తులు.. స్మార్ట్‌కార్డుల జారీ

ఈ నెలాఖరులోగా మార్గదర్శకాలకు తుదిరూపు.. స్కాన్ చేసి బియ్యం పొందేలా కొత్త కార్డులు

జనవరి నుంచి సన్న బియ్యం.. వచ్చే నెల నుంచే సన్నవడ్లకు 500 బోనస్: మంత్రి ఉత్తమ్

అక్టోబరులో ఆరోగ్య కార్డులూ జారీ చేస్తాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అక్టోబరులో కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ నెలాఖరులోగా కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలకు తుదిరూపు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. అక్టోబరు 2న గాంధీ జయంతి లేదా మరో రోజు నుంచి కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించి, అదే నెలలో స్మార్ట్ కార్డులను ఇవ్వాలని భావిస్తోంది. ఇవి జేబులో పట్టేంత పరిమాణంలో ఉండనున్నాయి. రేషన్‌షాపులో కార్డును స్కాన్ చేయగానే బియ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. సోమవారం రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన జలసౌధలో జరిగింది. దీనికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశం వివరాలను మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రేషన్‌కార్డుల కోసం అక్టోబరులో దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రకటించారు. రేషన్, హెల్త్‌కార్డులను వేర్వేరుగా ఇస్తామని చెప్పారు. కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలకు నెలాఖరులోగా తుదిరూపు ఇస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 3,38,07,794 జనాభాకుగాను 91,68,231 కార్డులు ఉండేవని, వివిధ కారణాలతో 2,46,324 కార్డులను రద్దు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.81 కోట్ల మందికి 89.96 లక్షల కార్డులున్నాయని తెలిపారు. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం కేంద్రం ఖాతాలో 54.45 లక్షల కార్డులు(1.91 కోట్ల మంది)కి ఉండగా.. కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రతి మనిషికీ ఐదు కిలోల బియ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కిలో బియ్యం అందుతున్నాయని స్పష్టం చేశారు. మరో 35.51 లక్షల కార్డులు (90.01 లక్షల మందికి) రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో ఉన్నాయని.. ఇందులో ఒకొక్కరికి 6 కిలోల



మిగతా 3వ పేజీలో...



జానీ మాస్టర్‌పై.. లైంగిక దాడి కేసు

పెళ్లి పేరుతో మతం మారాలన్నాడు

సినిమాల్లో చాన్సుల్లేకుండా చేస్తున్నాడు

అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

జనసేన సీరియస్ యాక్షన్

పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనొద్దని జానీకి ఆదేశాలు.. ఫిల్మ్‌చాంబర్ విచారణ షురూ

నార్సింగ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్(షేక్ జిలానీ బాషా)పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించడంతో పాటు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ.. ఆయన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్న 21 ఏళ్ల వయసున్న యువతి తొలుత మహిళా భద్రత విభాగం డీజీ శిఖా గోయెల్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె సూచనల మేరకు రాయదుర్గం ఠాణాకు చేరుకుని, లిఖితపూర్వకంగా

మిగతా 12వ పేజీలో...

ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్నీ..

ఫ్రీజ్ చేయొద్దు!



'దొంగ సొమ్ము'ను మాత్రమే నిలిపివేయాలి

సైబర్ మోసాల్లో నగదు బదిలీలకు సంబంధించి మద్రాసు హైకోర్టు తీర్పు

అనేక మంది బాధితులకు ఊరట

ఖాతాలు ఫ్రీజ్ అవుతున్న వారిలో వందలాది మంది చిరువ్యాపారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు సంబంధించి.. నేరగాళ్లు ఎవరి బ్యాంకు ఖాతాకైనా చిన్న మొత్తంలో నగదు పంపినా.. దర్యాప్తు అధికారులు అలాంటి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. అయితే.. అలా బ్యాంకు ఖాతాను మొత్తం ఫ్రీజ్ చేయడం సరికాదని మద్రాసు హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. ఎంత నగదు బదిలీ అయిందో.. అంతే మొత్తాన్ని ఫ్రీజ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు.. హైదరాబాద్‌కు లింకు ఉండడం గమనార్హం.! క్రిప్టో ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు విసిరిన వలకు.. హైదరాబాద్‌కు చెందిన బాధితుడు చిక్కి.. సర్వం కోల్పోయాడు. అయితే.. సైబర్ నేరగాళ్లు తమిళనాడులోని తిరువల్లూర్‌కు చెందిన షఫియుల్లా అనే వ్యక్తి ఖాతాకు రూ.2.48 లక్షలను బదిలీ చేశారు. అతని బ్యాంకు ఖాతాలో అప్పటికే రూ.9.69 లక్షలుండగా.. పోలీసులు మొత్తం ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఏడాది పాటు పోలీసులు, బ్యాంకర్ల చుట్టూ తిరిగినా

మిగతా 14వ పేజీలో...



అహ్మదాబాద్‌లో నమో భారత్ ర్యాపిడ్ రైలును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

ద్వేషిస్తున్నా.. మౌనంగానే ఉన్నా!

ఈ 100 రోజుల్లో విపక్షాలు నన్ను హేళన చేశాయి

పటేల్ గడ్డపై పుట్టిన బిడ్డగా అన్నీ భరించా: మోదీ

దేశంలో తొలి వందే మెట్రో రైలు ప్రారంభం

మోదీ స్ఫురించేలా 'నమో భారత్'గా పేరు మార్పు

ప్రారంభానికి కొన్ని గంటల ముందు మార్చిన రైల్వే

నాగ్‌పూర్-సికింద్రాబాద్, దుర్గ్-విశాఖ రూట్లలో

2 వందే భారత్ సహా 5 రైళ్లు ప్రారంభం

గాంధీనగర్, అహ్మదాబాద్, సెప్టెంబరు 16: మనసునిండా ద్వేషం నింపుకొన్న కొందరు భారత్, గుజరాత్ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టడం లేదని ప్రధాని మోదీ విమర్శించారు. ఇలాంటి వ్యక్తులు దేశాన్ని చీల్చే ఎజెండాతో భారత సమగ్రత, ఐక్యతను లక్ష్యంగా చేసుకుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అమెరికా పర్యటనలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో మళ్లీ 370 ఆర్టికల్‌ను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఆ రాష్ట్రంపై రెండు రాజ్యాంగాలు, రెండు చట్టాలు రుద్దాలని అనుకుంటున్నారని మోదీ తీవ్ర

మిగతా 2వ పేజీలో...

ఎన్‌పీఎస్-వాత్సల్య పథకం

రేపు ప్రారంభం

బాల్యం నుంచే పిల్లల పేరిట తల్లిదండ్రులు పెన్షన్ ఫండ్‌లో జమ చేసే చాన్స్

ఏడాదికి కనీసం రూ.1,000

2

ఫైలుపై బరువుంటేనే వేగంగా కదులుతుంది..

ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతిపై నితిన్ గడ్కరీ

రెడ్‌స్టోన్ హోటల్‌లో.. నర్సింగ్ విద్యార్థిని

ఆత్మహత్య!

హత్యాచారంగా కుటుంబీకుల సందేహం

పోస్టుమార్టం నివేదిక వస్తేగానీ.. నిర్ధారించలేమంటున్న పోలీసులు

ఆత్మహత్యగా కేసు నమోదు.. దర్యాప్తు

3

ఎట్టకేలకు మమతతో

వైద్యుల చర్చలు

ముఖ్యమంత్రి మమత నివాసంలో భేటీ

ముందుగానే లిఖితపూర్వకంగా షరతులు అందజేసిన ప్రతినిధులు

మినిట్స్ నమోదుకు సొంత స్టెనోగ్రాఫర్లు

వీడియో తీయించిన ప్రభుత్వం

2



పారిశ్రామిక ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రూ.3 వేల కోట్లు..

10 వేల ఉద్యోగాలు

మూడు కంపెనీల కేంద్రాలు.. లారస్‌లాబ్స్, బయోపోలిస్, 3జీవీ ప్రారంభం

ఆసియాలోనే అత్యున్నత లైఫ్ సైన్సెస్ గమ్యస్థానంగా తెలంగాణ: శ్రీధర్‌బాబు

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 16: లైఫ్ సైన్సెస్ ఏకోసిస్టమ్‌లో కొత్త శకానికి జీనోమ్ వ్యాలీ నాంది పలికిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆసియాలోనే అత్యున్నత లైఫ్ సైన్సెస్ గమ్యస్థానంగా తెలంగాణ అవతరించిందన్నారు. దేశంలోనే తొలి వ్యవస్థీకృత లైఫ్ సైన్సెస్ క్లస్టర్, పరిశోధన, అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా జీనోమ్ వ్యాలీ ఎదుగుతోందన్నారు. అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలతో లైఫ్‌సైన్సెస్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా జీనోమ్ వ్యాలీ తన ఖ్యాతిని పెంచుకుంటోందని

మిగతా 13వ పేజీలో...

2035కల్లా తెలంగాణలో

40 గిగావాట్ల గ్రీన్ పవర్!

గుజరాత్‌లో అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

సోలార్ రంగంలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలతో భేటీ

3

రూ.2075 కోట్లతో

ఉస్మానియా ఆస్పత్రి

30 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో

2 వేల పడకల సామర్థ్యంతో నిర్మాణం

ఉన్న 21 విభాగాలకు తోడు మరో 6

ప్రతి విభాగానికీ ఓ ఆపరేషన్ థియేటర్

2027 నాటికి పూర్తిచేయడమే లక్ష్యం

వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో పెద్దాస్పత్రిగా పేరుగాంచిన ఉస్మానియాకు మహర్దశ పట్టనుంది. ఆ ఆస్పత్రికి కొత్త భవనాలను రూ.2075 కోట్లతో.. 2 వేల పడకల సామర్థ్యంతో నిర్మించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అత్యాధునిక వసతులతో దీన్ని నిర్మించనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రెండు మూడు నెలల్లో దీని నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసే విధంగా వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. 2026-27 నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత పాత భవనం కూలిపోయే దశలో ఉండటంతో గోషామహల్‌లో 31.39 ఎకరాల్లో కొత్త భవనం

మిగతా 12వ పేజీలో...

గల్ఫ్ కార్మిక మృతుల కుటుంబాలకు

రూ.5 లక్షలు

2023 డిసెంబరు 7 తర్వాత మరణించినవారికి..

వారి పిల్లలకు గురుకులాల సీట్లలో ప్రాధాన్యం

ఎస్సీ వర్గీకరణ అమలైతున్న రాష్ట్రాల్లో అధ్యయనం

మంత్రివర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయం

13



పొద్దుగాల ఈ తాగుడేంది?

పూట గడిచేదెలా? కుటుంబం ఏంకావాలి?

మందుబాబులకు రాజగోపాల్‌రెడ్డి క్లాస్

14

మూత్రం పోశాడని 30 వేల జరిమానా

ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ వద్ద మూత్ర విసర్జన చేసిన వ్యక్తిపై కఠిన చర్య

సంగారెడ్డిలో ఘటన.. ఇకపై కేసులూ

పట్టణ వాసులకు శిక్షణ కలెక్టర్ హెచ్చరిక

ఫైలుపై బరువుంటేనే వేగంగా కదులుతుంది..

» మన వ్యవస్థలో కొందరు 'న్యూటన్ ఫాదర్స్' ఉన్నారు..

» ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతిపై కేంద్రమంత్రి గడ్కరీ విమర్శ



పుణే, సెప్టెంబరు 16: ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిపై కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైలు కదలాలంటే దానిపై బరువు (డబ్బు) ఉండాల్సిందేనని.. అప్పుడే అది వేగంగా కదులుతుందని వ్యాఖ్యానించారు. పుణేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పుణే టెక్నలాజికల్ యూనివర్సిటీ (సీఓఈపీటీయూ)లో పూర్వ విద్యార్థులు నిర్వహించిన 'ఇంజనీర్స్ డే' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విభాగాల్లో పారదర్శకత, సమయానుకూల నిర్ణయాధికారం, పనుల అవశ్యకతపై మాట్లాడారు. హైవే ప్రాజెక్టులు, రోడ్డు ప్రమాదాలు, వాటిలో మరణాలను ఉదహరిస్తూ.. సమస్యలన్నింటికీ మూలకారణం తప్పుడు వివరాలతో కూడిన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లేనని అభిప్రాయపడ్డారు. రోడ్లపై గుంతలనూ పూడ్చాల్సిన అవసరముందని చెప్పారు. ఆదేశాలిస్తే తప్పా ఏ పని చేయని అధికారులున్నారన్నారు. అయితే జ్ఞానమున్న వారు కూడా చట్టం వెనకాల స్ఫూర్తిని అర్థం చేసుకోకుంటే ఏం లాభమని ప్రశ్నించారు. 'నేను ఈరోజు ఇలా మాట్లాడకూడదు. ఇతర పనుల్లో డబ్బు వచ్చే చోట మీరు (అధికారులు) వేగంగా పని చేస్తారు. లేకపోతే చేయరు.. మన వ్యవస్థలో కొందరు 'న్యూటన్ ఫాదర్స్' ఉన్నారు. ఫైలుపై బరువు (డబ్బు) ఉంటే తప్ప కదలనీయరు' అని అన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థుల్లో టెస్లా, జేపీ మోర్గాన్ వంటి బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్న వారితో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులున్నారు. వారిలో పలువురికి సీఓఈపీ అభిమాన్ అవార్డు అందజేశారు.

పోలీస్‌స్టేషన్‌లో మందు పార్టీ... ఎస్‌ఐ సహా ముగ్గురు పోలీసుల అరెస్టు

మద్యనిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో ఘటన

సాసారామ్, సెప్టెంబరు 16 : మద్యనిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో పోలీసులు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే మందు పార్టీ చేసుకున్నారు. కైమూర్ జిల్లా సోన్‌హాన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ రంజన్ మరో ఇద్దరు చౌకీదార్లు, ఓ స్థానికుడితో కలిసి మందు పార్టీ చేసుకుంటుండగా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దర్యాప్తు బృందానికి పీకలదాకా మద్యం తాగిన స్థితిలో పోలీసులు కనిపించారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి జిల్లా ఎస్పీ లలిత్ మోహన్ శర్మకు సమాచారమిచ్చారు. ఆ వెంటనే ఆయన మద్యం తాగుతూ దొరికిపోయిన పోలీసులను సస్పెండ్ చేశారు. బిహార్‌లో 2016 ఏప్రిల్ నుంచి మద్య నిషేధం అమల్లో ఉంది.

లోకం తీరు



ఎట్టకేలకు మమతతో జూనియర్ డాక్టర్ల చర్చలు

» సీఎం నివాసంలో భేటీ..వీడియో తీయించిన ప్రభుత్వం

కోల్‌కతా, సెప్టెంబరు 16: సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు సోమవారం సాయంత్రం పశ్చిమ బెంగాల్ సీఎం మమతతో చర్చలు జరిపారు. రెండుసార్లు సచివాలయానికి వెళ్లి ఆమెతో భేటీ కాకుండా వెనక్కి వచ్చిన వైద్యులు మూడో సారి మాత్రం చర్చల్లో పాల్గొన్నారు. ఈ సారి కాళీఘాట్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిగాయి. పోలీసు పైలట్ వాహనం ఎస్కార్టుగా రాగా 35 మంది జూనియర్ డాక్టర్లు సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. నిజానికి సాయంత్రం 5 గంటలకు చర్చలు ప్రారంభించాల్సి ఉన్నా 7 గంటలకు మొదలయ్యాయి. రెండు గంటల పాటు అంటే రాత్రి 9గంటల వరకు సాగాయి. తొలిసారి గురువారం రాష్ట్ర సచివాలయంలోని మీటింగ్ హాలులో ముఖ్యమంత్రి గంటల తరబడి వేచి చూసినా జూనియర్ డాక్టర్లు వెళ్లలేదు. రెండోసారి శనివారం వెళ్లినా చర్చల ప్రత్యక్ష ప్రసారంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జరగలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ మొత్తంగా నాలుగుసార్లు చర్చలకు ఆహ్వానించినా జూనియర్ డాక్టర్లు సానుకూలంగా వ్యవహరించడం లేదని అభిప్రాయపడింది. ఇది అయిదోది, చివరిది అని తాజా చర్చలపై వ్యాఖ్యానించింది. చర్చలకు కాకపోయినా కనీసం టీ తాగడానికైనా తన ఇంటికి రావాలని కోరుతూ శనివారం మమతా బెనర్జీ సెల్‌ఫోన్ వీడియో విడుదల చేశారు. ఈ సారి మాత్రం జూనియర్ డాక్టర్లు తమ షరతులను లిఖితపూర్వకంగా ముందుగానే పంపించారు. మినిట్స్ రాయడానికి తమ సొంత స్టెనోగ్రాఫర్లను తీసుకెళ్లారు. మొత్తం చర్చలను ప్రభుత్వం వీడియో తీయించింది. దీక్షా శిబిరానికి వెళ్లి సహచరులతో మాట్లాడిన తరువాత చర్చలపై తమ అభిప్రాయాలను చెబుతామని జూనియర్ డాక్టర్లు తెలిపారు. మినిట్స్‌ను ఖరారు చేయడంపై ఇరు పక్షాలు సంప్రదింపులు జరుపుతున్నాయి. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్న డిమాండుపై ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలిసింది. రోగులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సమ్మె విరమించాలని మమతా బెనర్జీ వారిని కోరారు. మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య కేసుపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుందని తెలిపారు. జూనియర్ డాక్టర్లు మాత్రం చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని పట్టుబట్టారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో పాటు కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను తొలగించాలని మరోసారి డిమాండు చేశారు.

జమిలి సాధ్యం కాదు: చిదంబరం

చండీగఢ్, సెప్టెంబరు 16: జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగం ప్రకారం జమిలి ఎన్నికలు సాధ్యంకావని తెలిపారు. జమిలి జరగాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలైనా చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒకే దేశం-ఒకే ఎన్నికలు(జమిలి) ఈ టర్మ్‌లోనే నిర్వహించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు భావిస్తున్నదంటూ వస్తున్న వార్తలపై సోమవారం ఆయన స్పందించారు. "జమిలి నిర్వహణకు రాజ్యాంగపరమైన అనేక అడ్డంకులు ఉన్నాయి. ప్రధాని మోదీకి రాజ్యాంగాన్ని సవరించేంత సంఖ్యా బలం పార్లమెంటు ఉభయ సభల్లోనూ లేదు. ఇక, మా విషయానికి(ఇండియా కూటమి) జమిలి ఎన్నికలకు మేం వ్యతిరేకం" అని చిదంబరం వ్యాఖ్యానించారు. అక్టోబరు 5న జరగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎందుకు ప్రకటించలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.

రాహుల్‌గాంధీ నాలుక కోస్తే రూ.11 లక్షలు ఇస్తా

» శివసేన షిండే వర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వ్యాఖ్యలు



ముంబై, సెప్టెంబరు 16: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ నాలుక కోసిన వారికి రూ. 11 లక్షలు ఇస్తానని బహిరంగంగా ప్రకటించారు. "ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ఓ సమావేశంలో రిజర్వేషన్లను పూర్తిగా అంతం చేయాలని రాహుల్ వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి ఆ వ్యాఖ్యలే నిదర్శనం. కాబట్టే ఆయన నాలుక కోసిన వారికి నజరానా ప్రకటిస్తున్నాన"ని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని ప్రచారం చేసిన రాహుల్... బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అసత్యాలు ప్రచారం చేశాడని, కానీ ఇప్పుడు ఆయన నిజస్వరూపం బయటపడిందన్నారు. అయితే ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. సంజయ్‌పై బూల్డానా ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్ణాటకలో మసీదుపై రాళ్లదాడి.. ఆరుగురి అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరు తాలూకా కాటిపళ్లపేటలో ఆదివారం రాత్రి మసీదుపై రాళ్లు రువ్విన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మండ్య జిల్లా నాగమంగలలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా గొడవలు తలెత్తి దుకాణాలకు నిప్పు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసిన వైనం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిందువులపై దాడి జరిగిందని ఆరోపిస్తూ దక్షిణ కన్నడ జిల్లా బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ముఖ్యులు సోమవారం 'చలో బీసీ రోడ్డు' ఆందోళనకు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి సుమారు 10.30గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు మసీదుపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం మంగళూరు వ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా చలో బీసీ రోడ్డు ర్యాలీ శాంతియుతంగా సాగిందని దక్షిణకన్నడ జిల్లా ఎస్పీ చెప్పారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 16 మంది మృతి

జెరూసలేం, సెప్టెంబరు 16: గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. సోమవారం ఉదయం గాజాలోని న్యూసెరాట్ శరణార్థుల శిబిరం సమీపంలోని ఓ ఇంటిపై బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురితో పాటు మొత్తం 10 మంది మృత్యువాత పడ్డారు. మరణించిన వారిలో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో 13 మంది గాయపడ్డారు. మరో ఘటనలో గాజా సిటీలోని ఓ ఇంటిపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు 41 వేల మంది చనిపోయినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

భారత్‌లో ఇబ్బందుల్లో ముస్లింలు: ఖమేనీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: భారత్‌లో ముస్లింల పరిస్థితులపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఖమేనీ భారత్‌లో ముస్లింల పరిస్థితుల గురించి ప్రస్తావించారు. మయన్మార్, గాజాతో పాటు భారత్‌లో కూడా ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇక్కట్లు ఎదుర్కొంటోన్న ముస్లింలను మిగతా ముస్లింలు పట్టించుకోవాలన్నారు. ఖమేనీ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తిప్పికొట్టింది. తప్పుడు సమాచారంతో కూడిన ఆరోపణలు చేశారంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే దేశాలు సొంత రికార్డులు పరిశీలించుకోవాలని భారత్ హితవు పలికింది.

ద్వేషిస్తున్నా..మౌనంగానే ఉన్నా!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సోమవారం దేశంలో మొట్టమొదటిసారిగా 'వందే మెట్రో రైలు' ను మోదీ ప్రారంభించారు. అందుకు కొన్ని గంటల ముందు ఈ రైలు పేరును 'నమో భారత్ ర్యాపిడ్ రైలు'గా రైల్వేశాఖ అధికారులు మార్చారు. ఈ రైల్‌తో పాటు ఐదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సహా రూ.8వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో దుర్గ్-విశాఖపట్నం, నాగపూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైళ్లు ఉన్నాయి. అనంతరం మెట్రో రైల్లో మోదీ ప్రయాణించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో.. ఆ తర్వాత గాంధీనగర్‌లో ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సులోనూ మోదీ ప్రసంగించారు. మూడోసారి ప్రధాని అయ్యాక తనను రకరకాల మాటలతో విపక్షాలు అవమానించాయని.. ద్వేషాన్ని వెళ్లగక్కాయని, ఎగతాళి చేశాయని, అయినా సర్దార్ పటేల్ గడ్డ మీద జన్మించిన బిడ్డగా ఆ అవమానాలన్నీ తాను భరించి మౌనంగా ఉన్నానని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ వందరోజుల్లో అభివృద్ధి పనుల పరంగా నిర్దేశించుకున్న ఎజెండాను వేగంగా పూర్తిచేశానని చెప్పారు. తన జీవితం ప్రజల కోసమేనన్నారు. "నేను కష్టపడితే ఆ కష్టం మీ కోసం.. నేను త్యాగం చేస్తే ఆ త్యాగమూ మీ కోసమే" అని వ్యాఖ్యానించారు. వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వచ్చే వెయ్యేళ్ల కోసం అభివృద్ధి పరంగా భారత్ పునాదులు వేస్తోందని.. ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలబడటంతో పాటు ఆ స్థానాన్ని నిలబెట్టుకోవడమూ మనకు ప్రధానం అని అన్నారు. 21వ శతాబ్దం మీద చరిత్ర లిఖిస్తే గనక అందులో సౌరశక్తిలో భారత విప్లవం మీద ప్రత్యేక అధ్యాయం ఉంటుందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో తమ సర్కారు ప్రతి రంగంలో పురోగతికి ప్రయత్నించిందన్నారు. అయోధ్యతో పాటు మరో 16 నగరాలను 'మోడల్ సోలార్ సిటీస్'గా అభివృద్ధి చేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని వవేల్ ప్రాంతంలో 'ఉచిత సౌర విద్యుత్తు' లబ్ధిదారులతో మోదీ మాట్లాడారు.



అహ్మదాబాద్ వందే మెట్రో రైలులో ప్రయాణిస్తున్న మోదీ



అగ్రా-వారాణసీ వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న సమయంలో ప్లాట్‌ఫారం మీద నుంచి జారి పట్టాలపై పడ్డ బీజేపీ ఎమ్మెల్యే సరిత

'నమో..' భారత్

నరేంద్ర మోదీ! ఈ పేరు పొడి అక్షరాల్లో రాస్తే నమో! మోదీ పేరును స్ఫురించే విధంగా ఓ రైలుకు పేరు పెట్టేసింది రైల్వేశాఖ. వాస్తవానికి గుజరాత్‌లోని భుజ్-అహ్మదాబాద్ మధ్య ప్రారంభించిన రైలుకు తొలుత అనుకున్న పేరు 'వందే మెట్రో'! సోమవారం ఈ రైలును ప్రారంభించే కొన్ని గంటల ముందు రైల్వేశాఖ పేరు మార్చేసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' అని పేరు పెట్టింది. అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా జెండా ఊపడంతో భుజ్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం 4:15 గంటలకు అహ్మదాబాద్ దిశగా ఈ రైలు పరుగుతీసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' భుజ్-అహ్మదాబాద్ మధ్య తొమ్మిది స్టేషన్లను కవర్ చేస్తూ 5:45 గంటల్లో 359 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. 12 బోగీల్లో 1,150 సీట్లుంటాయి.

ఎన్‌పీఎస్-వాత్సల్య రేపు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల బడ్జెట్‌లో ప్రకటించిన నేషన్ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)-వాత్సల్య పథకం సాకారం దాల్చనుంది. ఈ పథకాన్ని బుధవారం ఆమె ఢిల్లీలో ఆవిష్కరించనున్నారు. పిల్లలు పసివారుగా ఉన్నప్పుడే వారు పేరున తల్లిదండ్రులుగానీ, సంరక్షకులుగానీ ఎన్‌పీఎస్-వాత్సల్య ఖాతాలను ప్రారంభించవచ్చు. 18 ఏళ్లు నుండి వారు మేజర్లయిన తరువాత ఆ ఖాతాలు ఆటోమేటిక్‌గా రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాలుగా మారిపోతాయి. పిల్లల్లో పొదుపు, ఆర్థిక బాధ్యతలపై అవగాహన కలిగించడం కూడా ఈ పథకం ఆశయాలు. భారత పౌరులతో పాటు ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజెన్స్ కూడా తమ పిల్లల పేరున ఈ ఖాతాలను ప్రారంభించవచ్చు. ఏడాదికి కనీసం 1,000 జమ చేసుకునే సౌలభ్యం కూడా ఉంది. గరిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు. ఈ పొదుపు ద్వారా తల్లిదండ్రులు పన్ను మినహాయింపు పొందవచ్చు. ప్రస్తుతం 80సీ కింద లభిస్తున్న రూ.1,50,000 మినహాయింపునకు ఇది అదనం. సెక్షన్ 80(సీసీడీ)(1బీ) కింద రూ.50,000 వరకు అదనంగా పన్ను మినహాయింపు లభిస్తుంది. 60 ఏళ్లు నిండిన తరువాత అప్పటి వరకు జమయిన సొమ్ములో 60 శాతాన్ని ఏకమొత్తంగా తీసుకోవచ్చు. ఖాతాదార్లు మైనర్లయినప్పటికీ వారికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్)ను కేటాయిస్తారు.

ఉద్యోగులపై వ్యతిరేక ప్రకటనను ఉపసంహరించుకొన్న సెబీ

» సమస్యలను పరిష్కరిస్తామని హామీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: బయటి శక్తుల ప్రోద్బలంతోనే నిరసనలు చేస్తున్నారంటూ రెండువారాల క్రితం తమ ఉద్యోగులకు వ్యతిరేకంగా విడుదల చేసిన ప్రకటనను సెబీ సోమవారం ఉపసంహరించుకొంది. ఉద్యోగుల సమస్యలను అంతర్గతంగానే పరిష్కరిస్తామని తెలిపింది. తద్వారా సంస్థ చైర్‌పర్సన్ మాధవి బుచ్ తమను వేధిస్తున్నారన్న, సెబీలో పని వాతావరణం అధ్వాన్నంగా ఉందన్న ఉద్యోగుల ఆరోపణలను అంగీకరించినట్లైంది. "సెబీలో పని వాతావరణం అతి దారుణంగా ఉందని అందులో పనిచేసే 500 మంది గ్రేడ్ ఏ ఉద్యోగులు ఆగస్టు 6న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సెబీ సమావేశాల్లో అరవడం, తిట్టడం, వేధించడం, అవమానించడం సర్వసాధారణంగా మారాయి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెబీలో నాయకత్వ స్థానాల్లో ఉన్నవారిపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు" అని కొన్ని రోజుల క్రితం ఓ మీడియా కథనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో సెబీ సెప్టెంబరు 4న తమ ఉద్యోగులపై పలు ఆరోపణలు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. బయటి వ్యక్తులు తమ ఉద్యోగులను ప్రభావితం చేసి సెబీలో అంతర్గత విభేదాలు సృష్టిస్తున్నారని, సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని అందులో పేర్కొంది. చైర్ పర్సన్ మాధవి రాజీనామా డిమాండ్ కూడా అందులో భాగమేనని ఆరోపించింది. అసలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది సంస్థ ఉద్యోగులు కాదని, ఆ ఫిర్యాదు సెబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేరిట లేదని, గుర్తు తెలియని మెయిల్ నుంచి ఫిర్యాదు వెళ్లిందని తెలిపింది. సంస్థలో అస్థిరత సృష్టించడానికే ఎవరో అలా చేశారని పేర్కొంది. అయితే, ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 5 నుంచి ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులపై సెబీ అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. దీంతో, సెబీ తాజాగా ప్రకటనను ఉపసంహరించుకొంది.

పాతాళానికి తొక్కేస్తాం

జమ్మూకశ్మీరులో ఉగ్రవాదం మళ్లీ పైకి లేవదు: అమిత్ షా



గులాబ్‌గఢ్, సెప్టెంబరు 16: జమ్మూకశ్మీరులో ఉగ్రవాదాన్ని అథఃపాతాళానికి తొక్కేస్తామని, మళ్లీ అది పైకి లేవకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఇక ఆర్టికల్ 370 అనేది చరిత్ర అన్నారు. భారత రాజ్యాంగంలో ఎన్నడూ భాగం కాబోదని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీరులోని కిష్వార్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సోమవారం అమిత్ షా మాట్లాడారు. బుధవారం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. మూడు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి జమ్మూకశ్మీరులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. 1990లో పేట్రేగిన ఉగ్రవాదం వల్ల ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఇకపై అలాంటి పరిస్థితి ఉత్పన్నం కానివ్వబోమని ప్రజలకు హామీ ఇచ్చారు. కశ్మీరు గడ్డపైకి మళ్లీ పైకి లేవనంత లోతుకు ఉగ్రవాదాన్ని పాతిపెడతామన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడుదల చేస్తామని హామీలు ఇస్తోందని అమిత్ షా విమర్శించారు. "అమ్మవారి గుడి ముందు నిల్చొని హామీ ఇస్తున్నా. ఇది మోదీ సర్కారు. భారత గడ్డపై ఉగ్రవాదాన్ని విస్తరించాలని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు" అని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం జమ్మూకశ్మీరులో గ్రామ స్థాయిలో భద్రతా దళాలకు ఆధునిక ఆయుధాలను సమకూర్చి, భద్రతను పటిష్ఠం చేసిందని చెప్పారు. కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని చెబుతోందని.. దాన్ని పునరుద్ధరించడం అవసరమా? అని ప్రశ్నించారు. వాళ్లు అధికారంలోకి వస్తే ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోతారని తెలిపారు. కానీ, ప్రజలు ఎవరూ భయపడొద్దని, ఆ కూటమి అధికారంలోకి రాదని చెప్పారు.

నేడే కేజ్రీవాల్ రాజీనామా!

ఢిల్లీ ఎల్జీతో సాయంత్రం 4.30కి భేటీ.. కొత్త సీఎంగా అతీషికే అవకాశాలు అధికం

» కేజ్రీవాల్‌ను ఎదుర్కొనే సత్తా బీజేపీకి ఉంటే ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతుంది: ఆప్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలవనున్నారు. ఈ మేరకు కేజ్రీవాల్ అపాయింట్‌మెంట్ కోరగా.. ఎల్జీ సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇచ్చారు. ఎల్జీతో భేటీలో కేజ్రీవాల్ రాజీనామా సమర్పించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. అంతకుముందే, ఉదయం ఆప్ ఎమ్మెల్యేల భేటీ కేజ్రీవాల్ అధికారిక నివాసంలో జరగనుంది. కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపై దీంట్లో చర్చించనున్నట్లు ఆప్ వెల్లడించింది. తద్వారా, కేజ్రీవాల్ ఎల్జీని కలవటానికి ముందే కొత్త సీఎంపై స్పష్టత రానుంది. ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరబ్ భరద్వాజ్ సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, బంతి బీజేపీ కోర్టులో ఉందని, కేజ్రీవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం ఉంటే ముందస్తు ఎన్నికలకు వాళ్లు సిద్ధమవుతారని అన్నారు. ఆదివారం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ, సీఎం పదవి నుంచి రెండు రోజుల్లో వైదొలగనున్నట్లు కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తనతోపాటు ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మీద అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. తాము పదవులకు రాజీనామా చేసి ప్రజల వద్దకు వెళ్తామని, 'మీరు అవినీతి పరులు కాదు.. సచ్ఛీలురు' అని వారు సర్టిఫికేట్ ఇచ్చిన తర్వాతే మళ్లీ తాము పదవులను చేపడతామని కేజ్రీవాల్ ప్రకటించారు. గడువు ప్రకారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది నవంబరులోనే మహారాష్ట్ర ఎన్నికలతో కలిపి జరపాల్సిందిగా కేజ్రీవాల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఢిల్లీ కొత్త సీఎం ఎవరవుతారనేదానిపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అగ్రస్థానంలో ఢిల్లీ విద్య, ప్రజాపనుల శాఖల మంత్రి ఆతిషి ఉన్నారు. సిసోడియా అరెస్టు తర్వాత విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన ఆతిషి ఢిల్లీలో స్కూళ్లను మెరుగుపరిచి వాటిలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పటానికి విశేష కృషి చేశారు. కేజ్రీవాల్, సిసోడియా జైలుకు వెళ్లటంతో.. మీడియా ఎదుట పార్టీ విధానాలను, నిర్ణయాలను వివరించే బాధ్యతలు తీసుకున్నారు. ప్రతిపక్ష బీజేపీ విమర్శలను గట్టిగా ఎదుర్కొన్నారు. ఆతిషి తర్వాత.. మరో మంత్రి సౌరబ్ భరద్వాజ్, ఎంపీలు రాఘవ్ చద్దా, సంజయ్‌సింగ్, ఆప్ సీనియర్ నేత కైలాశ్ గెహ్లాట్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.

ట్రంప్‌పై కాల్పులకు యత్నించింది 58 ఏళ్ల ర్యాన్ రౌత్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తాజాగా దాడికి యత్నించిన వ్యక్తిని 58 ఏళ్ల వయసున్న ర్యాన్ వెస్లీ రౌత్‌గా గుర్తించారు. ఆదివారం ఫ్లోరిడాలోని తన గోల్ఫ్ కోర్టులో ట్రంప్ ఆడుకుంటుండగా.. గోల్ఫ్ కోర్టుకు ఆనుకొని ఉన్న పొదల్లో 58 ఏళ్ల వయసున్న ర్యాన్ వెస్లీ రౌత్ అత్యంత శక్తిమంతమైన ఏకే-47-స్టైల్ తుపాకీతో 12 గంటల పాటు మాటువేశాడు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించి కాల్పులు జరపగా, రౌత్ ఆ పొదల్లోంచి బయటికి వచ్చి నల్లని కారులో అక్కడి నుంచి పారిపోయాడు. ఘటన స్థలం నుంచి ఏకే-47-స్టైల్ తుపాకీ, గోప్రో కెమెరాను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భద్రతా అధికారులు ఆ కారును గుర్తించి రౌత్‌ను అరెస్టు చేశారు.

ఉక్రెయిన్ యుద్ధంలో చనిపోవాలని ఆకాంక్ష..

న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం నార్త్ కరోలినా గ్రీన్స్‌బోరోకు చెందిన రౌత్ గతంలో నిర్మాణరంగంలో పనిచేశాడు. సాయుధ పోరాటంలో పాల్గొనాలనే బలమైన ఆకాంక్షను గతంలో సామాజిక మాధ్యమాల ద్వారా అతను వ్యక్తం చేశాడు. ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధంలో పాల్గొనాలని, ఆ యుద్ధంలోనే చనిపోవాలని ఉందని రౌత్ 'ఎక్స్'లో చేసిన పోస్టు కూడా తాజాగా వెలుగులోకి వచ్చింది. 'ఉక్రెయిన్ సరిహద్దులోకి వెళ్లి స్వచ్ఛందంగా యుద్ధం చేసి చనిపోవాలని ఉంది' అని రౌత్ రాశాడు. అలాగే, ప్రపంచ యుద్ధాల తీరును మార్చేయాలని కూడా ప్రజలకు రౌత్ పిలుపునిచ్చాడు. 'పౌరులు తప్పకుండా ఈ యుద్ధాన్ని మార్చివేయాలి. భవిష్యత్తు యుద్ధాలను కూడా నివారించాలి. మనలో ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో మానవ హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మద్దతుగా అడుగులు వేయాలి. మనలో ప్రతి ఒక్కరూ చైనా ప్రజలకు తప్పకుండా సాయం చేయాలి' అని వాట్సప్‌లోని తన బయోలో రౌత్ రాసుకున్నాడు.

15 లక్షల బ్యాంకు బ్యాలెన్స్ ఉంటేనే బ్రిటన్‌లో ఉన్నత విద్య

లండన్, సెప్టెంబరు 16: బ్రిటన్‌లో ఉన్నత విద్యను అభ్యసించదలిచిన విద్యార్థులకు యూకే సర్కారు షాకిచ్చింది.! ఇకపై బ్రిటన్‌కు వచ్చే విద్యార్థులు తమ వసతి, నిర్వహణకు గాను బ్యాంకుల్లో చూపించాల్సిన నిల్వల మొత్తాన్ని దాదాపు రూ.15లక్షలకు పెంచింది. ఇది జనవరి 2 నుంచి అమల్లోకి రానుంది. లండన్ నగరంలో చదువుకునే విద్యార్థులు వీసా దరఖాస్తు సమయంలో నెలకు 1,483 పౌండ్ల(సుమారు రూ.1.65 లక్షలు) చొప్పున 9 నెలలకు గాను బ్యాంకు నిల్వలను చూపించాల్సి ఉంటుంది. లండన్ నగరం వెలుపల చదివే వారికి ఆ మొత్తం నెలకు 1,136 పౌండ్లు(సుమారు రూ.1.26 లక్షలు)గా నిర్ణయించారు. వీసా దరఖాస్తు సమయంలో విద్యార్థులు 9 నెలలకు గాను బ్యాంకు నిల్వలను చూపించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. తొమ్మిది నెలల మొత్తం రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షలుగా ఉంటుంది.

చైనాలో 'బెబింకా' తుఫాన్ బీభత్సం!

షాంఘై, సెప్టెంబరు 16: బెబింకా తుఫాను చైనాను బెంబేలెత్తిస్తోంది. సోమవారం ఉదయం భారీ టైఫూన్ (తుఫాను) గంటకు 151 కిలోమీటర్ల వేగంతో షాంఘైను తాకడంతో ఈ ఆర్థిక నగరం అతలాకుతలమైంది. శక్తివంతమైన తుఫాను ధాటికి భీకరమైన గాలులు, భారీ వర్షాలు నగరాన్ని వణికిస్తున్నాయి. దీంతో 2.5 కోట్ల జనాభా ఉన్న షాంఘై మహా నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఇక్కడ రెడ్ అలర్ట్ ప్రకటించారు. 75 ఏళ్ల క్రితం (1949లో) గ్లోరియా టైఫూన్ తర్వాత షాంఘైను తాకిన అత్యంత బలమైన తుఫాను బెబింకానేనని చైనా వాతావరణ నిపుణులు తెలిపారు. షాంఘైలోని రెండు విమానాశ్రయాల్లో ఆదివారం సాయంత్రం నుంచి వందలాది విమానాలను రద్దు చేశారు. కొన్ని రైలు సర్వీసులను కూడా నిలిపివేశారు.

బంగారు గనిపై ఘర్షణ

పపువా న్యూగినియాలో 30 మంది కాల్చివేత!



పోర్ట్ మోర్స్‌బై, సెప్టెంబరు 16: బంగారు గనిపై పట్టు కోసం పపువా న్యూ గినియాలో హింస చెలరేగింది. అల్లర్లు, విధ్వంసాలు, కాల్పులతో అట్టుడికింది. భద్రతా దళాలకు అత్యవసర అధికారాలు అప్పగించి ఆయుధాలతో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసేంతగా పరిస్థితి దిగజారింది. ఇదంతా.. ఈ ఏడాది మే నెలలో కొండచరియలు విరిగిపడి, 2 వేల మంది ప్రాణాలను బలిగొన్న బంగారు గని ఉన్న ప్రాంతంలోనే జరగడం గమనార్హం. ఆస్ట్రేలియాకు సమీపాన ఉండే ఓషియానియా దేశమైన పపువా న్యూ గినియాలో న్యూ పోర్గెరా ప్రాంతంలోని బంగారు గనిని ఆగస్టులో సకార్ అనే గిరిజన తెగ ఆక్రమించుకుంది. వాస్తవానికి ఈ ప్రాంతంపై హక్కులు పయాండె తెగకు ఉన్నాయి. దీంతో రెండింటి మధ్య ఘర్షణ జరుగుతోంది. ఆదివారం వరుస ఘటనల్లో 300 పైగా రౌండ్లు కాల్పులు జరిగాయి. 30 మంది మృతిచెందారు. ఈ సంఖ్య 50కు చేరొచ్చని పోలీసులు చెబుతున్నారు. క్షతగ్రాతులూ భారీగానే ఉన్నారని పేర్కొన్నారు. ఆందోళనల్లో ఇళ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. కర్ఫ్యూ విధించినట్లు చెప్పారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వారు, వలసదారులు హింసకు దిగుతూ స్థానికులు, భూమి హక్కుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వివరించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఆయుధాలతో బహిరంగంగా తిరుగుతూ, ఎవరినైనా బెదిరిస్తూ కనిపించిన వారిని కాల్చివేయాలని ప్రభుత్వ ఆదేశాలిచ్చింది. కాగా, పపువా న్యూగినియాలో జాతుల ఘర్షణ సాధారణమే. కానీ, కొన్నాళ్ల నుంచి ఆటోమేటిక్ ఆయుధాల వినియోగంతో హింస పెరుగుతోంది. మే నెలలో కొండచరియలు విరిగిపడింది ప్రొగెరా గని ప్రాంతంలోనే. ఇది కెనడా జాతీయుడి ఆధీనంలో ఉంది. ఒకప్పుడు దేశ వార్షిక ఎగుమతుల్లో 10 శాతం ఆదాయం ఈ గని నుంచే వచ్చేది. అయితే, జాతుల ఘర్షణ, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో కొన్నాళ్ల కిందటే మూతపడింది. రెండేళ్ల కిందట సైతం అల్లర్లు చెలరేగి 17 మంది ప్రాణాలు కోల్పోయారు. పోప్ ఫ్రాన్సిస్ ఈ నెల మొదట్లో పపువాలో పర్యటించిన సందర్భంగా ఘర్షణలకు అంతం పలకాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీ మహిళల ప్రసవ యాతన

- రోడ్లు సరిగా లేకపోవడంతో గర్భిణులను జెడ్డీలపై మోసుకెళ్తున్న వైనం
- చర్ల మండలంలో ఒకే రోజు రెండు ఘటనలు

చర్ల, సెప్టెంబర్ 16: సరైన రోడ్లు, రవాణా సదుపాయాలు లేనికారణంగా భద్రాది కొత్తగూడెం జిల్లాలోని ఆదివాసీ ప్రాంత ప్రజలు ముఖ్యంగా గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చర్ల మండలంలో సోమవారం చోటు చేసుకున్న రెండు హృదయ విదారకర ఘటనలే ఇందుకు నిదర్శనం. పురిటి నొప్పులతో బాధపడుతున్న ఇద్దరు మహిళలను గ్రామస్థులు జెడ్డి కట్టి సుమారు 8 కిలోమీటర్లు భుజాలపై మోసుకుంటూ తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. బట్టిగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు నిండు గర్భిణులు సుబ్బమ్మ, రవ్వా దేవిలకు ఆదివారం రాత్రి నుంచే పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో గ్రామస్థులు. కుటుంబ సభ్యులు వారిని ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో జెడ్డీలు కట్టి 8 కిలోమీటర్లు మోసుకెళ్లి తిప్పాపురానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో సత్యనారాయణపురం వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం వారికి అక్కడ చికిత్స అందిస్తున్నారు. కొంతకాలంగా భద్రాద్రి ఏజెన్సీలో పలువురు ఆదివాసీ మహిళలు ఇలా ప్రసవ సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు. జెడ్డీలు కడితేనేగానీ ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాగా, నెల రోజుల వ్యవధిలో నలుగురు మహిళలను ఈవిధంగా జెడ్డీలపై మోసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు.


గర్భిణిని జెడ్డీపై మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

రెడ్‌స్టోన్ హోటల్‌లో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య!

- హత్యాచారంగా కుటుంబ సభ్యుల అనుమానం
- పోస్టుమార్టం నివేదిక వస్తేగానీ.. నిర్ధారించలేమంటున్న పోలీసులు
- ఆత్మహత్యగా కేసు నమోదు


విద్యార్థిని శ్రుతి

రాయదుర్గం, జడ్చర్ల/కోస్గి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లకు చెందిన ఓ నర్సింగ్ విద్యార్థిని హైదరాబాద్‌లోని హోటల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదంతమిది. ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇది హత్యేనని ఆరోపిస్తున్నారు. హోటల్ గదిలోని పరిస్థితులు ఇందుకు బలం చేకూరుస్తున్నాయని చెబుతున్నారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ కథనం ప్రకారం.. జడ్చర్లలోని కుమ్మరివాడకు చెందిన నర్సింగ్ విద్యార్థిని శ్రుతి(23) గతంలో మాదాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేశారు. పది రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లారు. ఈ నెల 14న తాను పనిచేసిన ఆస్పత్రిలో రావాల్సిన గౌరవ వేతనానికి సంబంధించి హైదరాబాద్ వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరారు. ఆమెకు గతంలో పరిచయం ఉన్న జీవన్, వెంకటేశ్, మోనతో కలిసి గచ్చిబౌలిలోని రెడ్‌స్టోన్ హోటల్‌లో 301, 501 నంబరు గల గదులను అద్దెకు తీసుకున్నారు. జడ్చర్లకు చెందిన తామంతా వినాయక నిమజ్జనాలను వీక్షించేందుకు హైదరాబాద్ వచ్చినట్లు హోటల్ రిసెప్షన్‌లో చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం తనకు తలనొప్పిగా ఉందంటూ శ్రుతి హోటల్ గదిలోనే ఉండగా.. మిగతా ముగ్గురు నిమజ్జనాలను వీక్షించేందుకు ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో హోటల్‌కు తిరిగి వచ్చి.. 501వ నంబరు గది తలుపులు తట్టగా.. శ్రుతి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఆమె ఫోన్ రింగ్ అవుతున్నా.. లిఫ్ట్ చేయలేదు. దీంతో.. హోటల్ సిబ్బందిని పిలిపించి, మారు తాళంచెవితో గది తలుపు తెరిపించగా.. శ్రుతి ఫ్యాన్‌కు వేళాడుతూ.. విగతజీవిగా కనిపించింది. హోటల్ సిబ్బంది సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు సంఘటనాస్థలికి వచ్చి, అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ నేర్చుకునేప్పుడు జీవన్ పరిచయమైనట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. శ్రుతి ఆత్మహత్యపై ఆమె కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రుతి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని చెబుతున్నారు. ఆమె విషయంలో జరగరానిది ఏదో జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తాము వచ్చేసరికి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తున్నారని ఆరోపించారు. బంధుమిత్రులు కాసేపు అంబులెన్స్‌ను ముందుకు కదలకుండా అడ్డుకున్నారు. శ్రుతి గదిలో రక్తపు మరకలు, మద్యం సీసాలున్నాయని, గది అంతా చిందరవందరగా ఉండడాన్ని బట్టి ఆమెపై హత్యాచారం జరిగి ఉంటుందని ఆరోపించారు. దీనిపై ఏసీపీ శ్రీకాంత్ స్పందిస్తూ.. ప్రస్తుతానికి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యగా కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వస్తేగానీ శ్రుతిది ఆత్మహత్యా? లేక హత్యా? అనేది తెలియదని పేర్కొన్నారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులతో ఫోన్‌లో మాట్లాడారు.

కొత్త రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)



బియ్యం వస్తున్నాయని తెలిపారు. కార్డుల జారీకి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో నిబంధన ఉందని, దీనిపై అధ్యయనం చేశామని వెల్లడించారు. ఆదాయ పరిమితిపై అధ్యయనం జరుగుతోందని తెలిపారు. కార్డుల జారీపై వివిధ రాజకీయ పక్షాలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు లేఖలు రాశామని, ఈనెల 19లోపు వారి అభిప్రాయాలు చెప్పడానికి గడువు ఇచ్చామని పేర్కొన్నారు. 21న మరోమారు మంత్రివర్గ సమావేశంలో చర్చించిన తర్వాత నెలాఖరులోగా మార్గదర్శకాలకు తుదిరూపు ఇస్తామని వెల్లడించారు. కార్డుల జారీ అనంతరం జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామని ప్రకటించారు. కాగా, ఖరీఫ్ ధాన్యం సేకరణ అక్టోబరులో ప్రారంభం కానుందని, ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చే పథకాన్ని ప్రారంభించనున్నామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు.

ఎన్నికల తాయిలాలుగా కార్డులిచ్చారు: పొంగులేటి

గత పదేళ్లలో కొత్తగా ఇచ్చిన కార్డులు 49,476 మాత్రమేనని.. అది కూడా ఉప ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవడానికి మాత్రమే జారీ చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో 5,98,000 కార్డులను రద్దు చేయగా.. 6,47,479 కార్డులు జారీ చేశారని.. అంతిమంగా ఇచ్చిన కార్డులు 49 వేలు మాత్రమేనని తెలిపారు. గతంలో రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు ఉప ఎన్నికలు వచ్చినప్పుడే ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అర్హులందరికీ అక్టోబరులో రేషన్ స్మార్ట్ కార్డులు, హెల్త్‌కార్డులు వేరుగా జారీ చేస్తామని ప్రకటించారు. కార్డుల జారీపై ప్రతిపక్షాల సూచనలు స్వీకరిస్తామని.. ఇప్పటిదాకా 15-16 మంది ప్రజా ప్రతినిధులు మాత్రమే కార్డులపై అభిప్రాయాలు తెలియజేశారని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

అమ్మో.. ఆకుకూరలు!

కిలో పాలకూర రూ.180కి పైగా.. కొత్తిమీర రూ.120

- బెండ, దొండ, క్యారెట్ రేట్లూ అంతే
- వర్షాలతో తగ్గిన దిగుమతి
- మహారాష్ట్ర, కర్ణాటక నుంచి తగ్గిపోయిన ఉల్లి లారీల రాక
- ఉన్న సరుకు ధరను పెంచిన వ్యాపారులు
- పెరిగిన ధరలతో ప్రజల గగ్గోలు

హైదరాబాద్ సిటీ, ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తిమీర రేటు కొండమీదికెక్కింది! పప్పులో వేసుకునే పాలకూర ధర బాగా ప్రియమైంది!! వీటితోపాటు నిన్న, మొన్నటి వరకు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న బెండకాయ, దొండకాయ, క్యారెట్ తదితర కూరగాయల ధరలు సైతం క్రమేపీ పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉల్లిగడ్డల ధర కూడా రోజురోజుకూ పెరుగుతోంది. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మొదటిరకం ఉల్లి ధర టన్ను రూ.51 వేలు పలికి ఆరు నెలల గరిష్ఠానికి చేరింది. అక్కడ కిలో రూ.51 పలుకుతుండగా.. బహిరంగ మార్కెట్లో కిలో రూ.60 అమ్ముతున్నారు. పప్పు, ఉప్పు కంటే ఆకు కూరల ధరలు భారీగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజార్లలోనే కూరగాయల ధరలు ఇలా ఉన్నాయంటే.. ఇక, సూపర్‌మార్కెట్లు, కాలనీల్లోని రిటైల్ దుకాణాల్లో ఆకు కూరలు, కొన్నిరకాల కూరగాయల ధరల సంగతి ఇక చెప్పనే అక్కర్లేదు! రాజధాని నగరంలోని బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్ మార్కెట్లు, రైతుబజార్లకు శివారు ప్రాంతాలైన యాచారం, మంచాల, మహేశ్వరం, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం నుంచి టమాటాలు, పచ్చిమిర్చి, దొండకాయ, బెండకాయతో పాటు వివిధ రకాల ఆకుకూరలు వస్తుంటాయి. అలాగే ఏపీలోని మదనపల్లి నుంచి టొమాటో, మహారాష్ట్రలోని నాసిక్, సోలాపూర్‌తో పాటు కర్నూల్ జిల్లా నుంచి ఉల్లి గడ్డ, ఆలుగడ్డ వస్తుంటాయి. కానీ, తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వివిధ రకాల కూరగాయల దిగుమతి బాగా తగ్గింది. మరీ ముఖ్యంగా.. నగర శివారు నుంచి వచ్చే పాలకూర, కొత్తిమీర, పుదీనా లాంటివి ఆశించిన మేరకు రాకపోవడంతో పాటు వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానాల నేపథ్యంలో వ్యాపారులు ఉన్న సరుకు ధరలు అడ్డగోలుగా పెంచేసి దోచుకుంటున్నారు. ఇక, ఉల్లి విషయానికి వస్తే.. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మలక్‌పేట మార్కెట్‌కు 60 లారీల ఉల్లి వచ్చేది. వినాయకచవితి నేపథ్యంలో అది ఇప్పుడు 37 లారీలకు తగ్గింది.



రైతుబజార్‌లో కూరగాయల రేట్లు

నగరంలోని రైతుబజార్లలో సోమవారం కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి..

రకం	కిలోకు
పాలకూర	రూ.180-200
కొత్తిమీర	రూ.100-120
చిక్కుడు	రూ.80-100
టొమాటో	రూ.31
వంకాయ	రూ.35
బెండ	రూ.45
క్యారెట్	రూ.50
దొండ	రూ.45
ఉల్లిగడ్డ	రూ.54
క్యాప్సికమ్	రూ.70

నాలుగు కట్టలు రూ.100!

సాధారణంగా మార్కెట్లలో ఇతర కూరగాయలతో పోల్చితే ఆకుకూరల రేట్లు అన్ని వర్గాల ప్రజలకూ కాస్తంత అందుబాటులో ఉంటాయి. రూ.20 పెడితే నాలుగు నుంచి ఆరు కట్టల పాలకూర, రూ.10 పెడితే కొత్తిమీర, పుదీనా కట్టలు రెండు, మూడు వస్తాయి. కానీ, ఇప్పుడా పరిస్థితే లేదు! చిన్న సైజు పాలకూర కట్ట ధర రూ.20 దాకా చెబుతున్నారు. పది రూపాయలకు కొత్తిమీర అడిగితే ఇచ్చేదే లేదంటున్నారు. సూపర్ మార్కెట్లలో అయితే నాలుగు కట్టల పాలకూర రూ.100కు పైమాటే! రూ.200 పట్టుకుని వెళ్తే కనీసం నాలుగైదు రకాల కూరగాయలు కూడా రావడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. కూరగాయల రేట్లు మరో వారంలోగా దిగి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగానే ఆకుకూరల దిగుమతి తగ్గిందని, శివారు ప్రాంతాల నుంచి త్వరలో పెరుగుతుందని వెల్లడించారు. రైతు బజార్లకు సరుకు రాకుండా కొంత మంది వ్యాపారులు నేరుగా చేలవద్దకు వెళ్లి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తుండడం వల్ల కూడా నగరంలో కొరత ఏర్పడుతోందని.. రవాణా చార్జీలను సాకుగా చూపి సామాన్య ప్రజలకు కావాల్సిన కూరగాయలను అందకుండా చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

57 ఏళ్ల తర్వాత మ్యుటేషన్ కోరుతారా?

- మొదట సివిల్ కోర్టులో టైటిల్ తేల్చుకోండి
- కరీంనగర్ జిల్లావాసికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపు 57 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భూమి తమ పేరుపై మ్యుటేషన్ చేయాలని, ఆ మేరకు రెవెన్యూ ఎంట్రీస్‌ను సవరించాలని కోరడం సరికాదని హైకోర్టు పేర్కొంది. మొదట సంబంధిత సివిల్ కోర్టును ఆశ్రయించి టైటిల్ తేల్చుకోవాలని స్పష్టం చేసింది. 1963 నాటి సేల్ డీడ్‌కు సంబంధించి 5.19 ఎకరాల భూమిని తమ తల్లి పేరు మీద కాకుండా ఇతరుల పేరు మీద తప్పుగా నమోదు చేశారని కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన సాగి హనుమంతరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఏకసభ్య ధర్మాసనం కొట్టివేయగా డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. రెవెన్యూ ఎంట్రీస్ సవరణ కోరుతూ తగిన సమయంలో పార్టీలు సంబంధిత అధికారులను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుత కేసులో 57 సంవత్సరాల సుదీర్ఘకాలం గడిచిపోయిందని పేర్కొంది. ఇన్నేళ్ల తర్వాత ఎలాంటి ఉపశమనం కల్పించడానికి వీలుండదని తెలిపింది. అయితే ప్రస్తుతం వివాదంలో ఉన్న భూమి టైటిల్ ఎవరిదో తేల్చుకోవడానికి సంబంధిత సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని తుది తీర్పులో పేర్కొంది.

ఏఐఎఫ్‌టీవో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టిఓ) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఏఐఎఫ్‌టిఓ జాతీయ సాధారణ కౌన్సిల్ సమావేశాలు సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగాయి. ఈ సమావేశంలో భాగంగా జరిగిన ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన 2021 నుంచి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ పథకం(యూపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే దాకా దేశంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేస్తూ పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు.

2035కల్లా 40 గిగావాట్ల గ్రీన్ పవర్!

- గుజరాత్‌లో అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి
- సోలార్ రంగంలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలతో భేటీ



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 2035 నాటికి అదనంగా 40వేల మెగావాట్ల(40గిగావాట్లు) గ్రీన్ పవర్(సౌర, పవన, జల విద్యుత్)ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గుజరాత్ గాంధీనగర్‌లో సోమవారం జరిగిన 'ప్రపంచ పునరుత్పాదక ఇంధన వనరుల పెట్టుబడిదారుల' 4వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి రాష్ట్రంలో చాలా అనుకూలత ఉందని చెప్పారు. ఏడాదిలో 300 రోజుల పాటు సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని, సోలార్ విద్యుత్‌కు సంబంధించి రాష్ట్రంలో 26.4 గిగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయని చెప్పారు. దేశంలో బలంగా గాలులు వీచే తొలి 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని, 150 మీటర్ల ఎత్తుతో 5.4 గిగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ప్లాంట్లు పెట్టడానికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లతో పాటు బొగ్గు నిల్వలు అంతరించిపోయిన ఓపెన్‌కాస్టు గనుల్లో కూడా పంప్ స్టోరేజీ ప్లాంట్‌లు పెట్టి జలవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుందన్నారు. వీటితోపాటు గ్రీన్ హైడ్రోజన్, జియో థర్మల్ అన్నీ కలిపి మొత్తం గా 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి వనరులున్నాయని వివరించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికను కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి అందించారు. రాబోయే రోజుల్లో ఏఐ సిటీ, ఫోర్త్ సిటీతో పాటు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌తో తెలంగాణ ముఖచిత్రమే మారనుందన్నారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో కీలక పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. భారతదేశం 2030కల్లా 500 గిగా వాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్న విషయాన్ని భట్టి గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, గోవా, రాజస్థాన్ సీఎంలు హాజరయ్యారు. అనంతరం సోలార్ రంగంలో పెట్టుబడుల కోసం దాదాపు 40 మంది పారిశ్రామిక వేత్తలతో భట్టి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన వెంట ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంట్లో బాణసంచా విస్ఫోటం

- 9 మందికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- కోనసీమ జిల్లా అమలాపురంలో ఘటన

అమలాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా భారీ పేలుడు సంభవించి డాబా ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. 17 మంది గాయపడ్డారు. వీరిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ శివారు రావులచెరువులో సోమవారం ఈ ఘోరం జరిగింది. రావులచెరువు ప్రాంతానికి చెందిన గొవ్వాల నాగేశ్వరరావు(62)తన ఇంట్లోనే కొంత కాలంగా బాణసంచా తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం యథావిధిగా కుటుంబసభ్యులతో కలిసి బాణసంచా తయారుచేస్తున్నాడు. సరిగ్గా ఉదయం 9.45 గంటలకు భారీ విస్ఫోటం సంభవించింది. దీంతో నాగేశ్వరరావు డాబా ఇల్లు పూర్తిగా ఆనవాలు లేకుండా నేలమట్టమైంది. పక్కనే ఉన్న గొవ్వాల సుభద్రమ్మ ఇల్లు కూడా ధ్వంసమైంది. బాణసంచా తయారుచేస్తున్న నాగేశ్వరరావు, ఆయన భార్య నాగలక్ష్మి(55), అతడి కుమారుడు యల్లీష్‌రాజు(25), కుమార్తె కట్టా వేణు(35), మనుమడు వెంకట్‌తోపాటు సమీప ఇళ్లకు చెందిన దూనబోయిన సుబ్బలక్ష్మి, చొల్లంగి మారుతీ సుబ్రహ్మణ్యం (25), దూనబోయిన సుబ్బలక్ష్మి (45), పితాని శాంతి (26), బొక్కా మోహనప్రియ(11)లకు తీవ్ర గాయాలయ్యాయి.

మఫ్టీలో 200 షీ టీమ్స్

- హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంలో డ్యూటీ
- స్పై కెమెరాలతో ఆకతాయిల చేష్టల రికార్డ్
- 464 మంది పోకిరీల ఆటకట్టించిన పోలీసులు
- మహిళల భద్రతకు మాది భరోసా: డీసీపీ కవిత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జన వేడుకల్లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం సుమారు 200 మంది షీ టీమ్స్ పోలీసులు మఫ్టీలో విధుల్లో ఉన్నారని మహిళా భద్రత, షీటీమ్స్ డీసీపీ కవిత ధార తెలిపారు. హుస్సేన్ సాగర్ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేకంగా 12 షీ టీమ్స్ నిఘా ఉంచాయని వెల్లడించారు. దీంతో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే శోభాయాత్రలో అదనపు బలగాలు మఫ్టీలో ఉంటాయని చెప్పారు. గణేశ్ నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నగరంలో 464 మంది పోకిరీల భరతం పట్టినట్లు డీసీపీ తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతి వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో మహిళలు, యువతులు, బాలికల పట్ల కొంతమంది ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారని.. అలాంటి ఘటనల్లో పోకిరీలను షీ టీమ్స్ పోలీసులు ఫొటోలు, వీడియోలతో సహా పట్టుకున్నారని పేర్కొన్నారు. నగరంలో మహిళలను వేధిస్తున్న, ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీలు, ఆకతాయిల ఆట కట్టించేందుకు షీ టీమ్స్‌కు స్పై కెమెరాలను అందజేశామని తెలిపారు. పోకిరీల చేష్టలను స్పై కెమెరాల్లో రికార్డు చేసి కేసులు నమోదు చేస్తున్నామని, ఆ ఆధారాలతో కోర్టులో శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ వెల్లడించారు.

మహిళలూ.. ధైర్యంగా ఫోన్ చేయండి

ఖైరతాబాద్ మహాగణపతి, ఇతర గణేశ్ నిమజ్జనాలను వీక్షించడానికి హుస్సేన్ సాగర్ చుట్టుపక్కల ప్రాంతాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. వారిలో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో ఉంటారు. వారి భద్రత కోసం షీటీమ్స్ మఫ్టీలో రంగంలోకి దిగాయి. పోకిరీల వేధింపులను బాధిత మహిళలు మౌనంగా భరించొద్దు. డయల్-100, వాట్సాప్ నంబర్ 9490616555కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. బాధిత మహిళల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

-కవిత ధార, డీసీపీ, మహిళా భద్రతా విభాగం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్ చాణక్యం

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు కానీ, తాను రాజీనామా చేయబోతున్నట్టుగా చేసిన ప్రకటన మాత్రం ఊహించనిది. ఆర్నెల్లుగా ఆ ఊసెత్తకుండా, తిహార్ జైలునుంచి బయటకు వచ్చిన తరువాత ఈ నిర్ణయాన్ని ప్రకటించడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. ఎన్నికల నిమిత్తం స్వల్పకాలం బెయిల్ దక్కడం వినా, సుదీర్ఘకాలంగా ఆయన జైల్లోనే ఉన్నాడు. మనీష్ సిసోడియా సహా సుప్రీంకోర్టు ఇప్పటికే కొందరికి బెయిల్ మంజూరు చేస్తూ, ఊపావంటి కఠినమైన చట్టాలు మోపిన కేసుల్లో సైతం జైలు అనేది మినహాయింపు, బెయిల్ ఒక రూల్ అన్న సూత్రాన్ని పలుమార్లు ఉద్ఘాటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ పెట్టిన కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన వెంటనే, దాదాపు రెండేళ్లుగా నిమ్మకునీరెత్తినట్టు ఉన్న సీబీఐ అప్పుడు హడావుడిగా రంగంలోకి దిగిన వైనాన్ని సుప్రీంకోర్టు ఈ తీర్పు సందర్భంగా గుర్తుచేసింది. కేజ్రీవాల్‌ను జైల్లోనే ఉంచాలన్న ఉద్దేశం తప్ప ఇంకేమీ కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

ఇప్పటికైనా బెయిల్ వచ్చినందుకు సంతోషించి, చక్కగా రాజ్యపాలన చేసుకోవాల్సిన కేజ్రీవాల్ హఠాత్తుగా ఇలా రాజీనామాకు ఎందుకు సిద్ధపడ్డారన్నది ప్రశ్న. నైతికవిలువల అంశమే అయితే, ఆయన జైల్లో కాలూనిన క్షణాన్నే తన పదవికి రాజీనామా చేసివుండవచ్చు. ప్రజలు ఎన్నుకున్న తనకు జైలునుంచి ఏలే హక్కు ఉన్నదని ఆయనా, పార్టీ న్యాయస్థానాల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ వాదించారు. రాజీనామా చేయకుండా జైల్లో ఉన్న ఆయనకు ఎన్నికల ప్రచారం చేసుకొనే అవకాశం కూడా న్యాయస్థానాలద్వారా దక్కింది. బెయిల్‌మీద బయటకు వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేసుకున్నప్పటికీ, ఢిల్లీ ప్రజలు జాలి పడిందీ లేదు, బ్రహ్మరథం పట్టిందీ లేదు. ఏడు లోక్‌సభ సీట్లనూ ఐదేళ్ళనాటి మెజారిటీలను అధిగమించి మరీ బీజేపీ తన్నుకుపోయింది. పంజాబ్‌లో సైతం కేజ్రీవాల్ జైలు ప్రభావం అంతగా లేదు. పదమూడు లోక్‌సభ స్థానాల్లో మూడుమాత్రమే ఆ పార్టీకి దక్కాయి. కేజ్రీవాల్‌కు ఈ లెక్కలేమీ తెలియనివి కావు. కానీ, కోర్టుల్లో న్యాయం, ప్రజాక్షేత్రంలో తీర్పు అంటూ ఓ ఎత్తుగడకు తెరదీశారు. తాను తెచ్చిన మద్యం విధానం సరైనదని, ఢిల్లీకి ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూర్చేదనీ, తన మెడకు చుట్టిన కేసులన్నీ రాజకీయప్రేరేపితమైనవని వాదిస్తున్నప్పుడు వాటి సంగతి న్యాయస్థానాల్లో తేల్చుకోవాలి, పరిశుద్ధుడై ప్రజలముందుకు రావాలి. ఢిల్లీవాసులు తన సచ్ఛీలతను, నైతికతను విశ్వసించడం లేదని ఆయనకు ఇప్పుడు ఎందుకు అనుమానం కలిగిందో మరి.

ఢిల్లీలో ఎన్నికలు ఎలాగూ మరో ఐదునెలల్లో జరగాల్సి ఉన్న తరుణంలో కేజ్రీవాల్ ఎత్తుగడ ఆయనకు ఏ మేరకు లాభిస్తుందో చూడాలి. సుప్రీంకోర్టు విధించిన కఠినమైన బెయిల్ నిబంధనలు కూడా ఆయనకు అడుగడుగునా అడ్డుపడుతున్న తరుణంలో ఎన్నికలు ముందుకు జరగాలని ఆయన కోరుతున్నారు. ఆయన కోరికమేరకు ఇంతస్వల్పవ్యవధిలో, మరో రెండురాష్ట్రాలతో కలిపి ఢిల్లీలో ఎన్నికలు జరగడం అసాధ్యం. కానీ, ఫిబ్రవరివరకూ తన స్థానంలో మరొకరిని కూచోబెట్టి, పరోక్షంగా తానే రాజ్యాన్ని ఏలుతూ, బీజేపీ కక్షరాజకీయాలకు తాను బలైపోయానని, ప్రజలు గట్టిగా తనపక్షాన నిలిస్తే కానీ, తాను మళ్ళీ గద్దె నెక్కననీ ఆయన చెప్పుకోబోతున్నారు. తననూ, పార్టీలోని కీలకమైన నాయకులందరినీ అవినీతి ఆరోపణలు చుట్టుముట్టిన నేపథ్యంలో, ఈ రాజీనామా ద్వారా ప్రజలు తనను అగ్నిప్రవేశం చేసినట్టుగా భావిస్తారన్నది ఆయన ఆలోచన కావచ్చు. ఈ మూడునెలలూ ముఖ్యమంత్రి కుర్చీలోనే కూర్చొని, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేకంటే, వేరొకరిని ఆ సీట్లో తాత్కాలికంగా కూచోబెట్టి, తాను ఒక కొత్త ముఖంతో, మళ్ళీ సరికొత్త సీఎం అభ్యర్థిగా ప్రజలముందుకు వెళ్ళడం వల్ల అధిక రాజకీయ ప్రయోజనం ఉంటుందని ఆయన నమ్మకం. సీఎం కార్యాలయం, సచివాలయం ఇత్యాది చోట్లకు వెళ్ళకూడదనీ, గవర్నర్‌కు పంపాల్సిన ఫైళ్ళమీదే సంతకాలు చేయాలని అంటూ సుప్రీంకోర్టు సవాలక్ష బెయిల్ నిబంధనలు విధించిన నేపథ్యంలో, ఈయన సీఎంగా కొనసాగితే రాష్ట్రపతిపాలన విధించాలన్న వాదన కూడా మరింత హెచ్చే ప్రమాదం ఉన్నది. ఇప్పుడు తాను తప్పుకొని, కొత్త వ్యక్తిని అక్కడ కూచోబెట్టి, ఎన్నికలు ముందుగా నిర్వహించాలన్న డిమాండ్ తెచ్చి, కేజ్రీవాల్ రాజకీయచదరంగంలో అతి వేగంగా ఎన్నో ఎత్తులు వేశారు. దశాబ్దంన్నర క్రితం అవినీతి వ్యతిరేక పోరాట యోధుడుగా తాము చూసిన కేజ్రీవాల్ ఇప్పటికీ అంతే పవిత్రంగా ఉన్నాడని ప్రజలు నమ్ముతున్నదీ లేనిదీ ఎన్నికల అగ్నిపరీక్షలో తేలుతుంది.


సర్దార్ స్ఫూర్తి బాటలో నరేంద్రుడు

శతాబ్దాల విదేశీపాలన అనంతరం 15 ఆగస్టు 1947లో యావద్భారతం స్వాతంత్ర్యాన్ని పొందినా తెలంగాణ, మరాఠ్వాడా, కర్ణాటకలోని మూడు జిల్లాల ప్రజలకు మాత్రం నాటి నిజాం ప్రభుత్వం చేసిన మారణకాండతో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని బతకాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో దేశ సమైక్యత, సమగ్రతను కాపాడే బాధ్యతను భుజస్కంధాలపై వేసుకున్న ఉక్కుమనిషి, నాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ, దానికి తోడు ఇక్కడి ప్రజల తెగింపు.. వెరసి.. 17 సెప్టెంబర్ 1948నాడు హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్య ఊపిరి పీల్చుకుంది.

ఈ ప్రాంత చరిత్రను, సంస్కృతిని, భాషను, ఆచార, వ్యవహారాలను తుడిచిపెట్టి, ఇస్లామీకరణ చేద్దామనుకున్న నిజాం నవాబు ఆలోచనను 'ఆపరేషన్ పోలో' ద్వారా పటేల్ భగ్నం చేశారు. ఆపరేషన్ పోలో ముగింపు సమయంలో రజాకార్లకు మద్దతుగా తమపై దుష్ప్రచారం చేసిన కమ్యూనిస్టులకు కూడా భారత సైన్యం బుద్ధి చెప్పింది. దీని ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పదమూడు నెలల తర్వాత హైదరాబాద్ సంస్థానం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది.

ఇదీ మన నిజమైన చరిత్ర, ఇదే మన అస్తిత్వం. కానీ ఈ చరిత్రను రాజకీయ అవసరాలకోసం నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది. చరిత్ర అంటే జరిగిన ఘటనల సమాహారం. కానీ చరిత్ర తమకు నచ్చినట్లుగా ఉండాలనే సూడో ఇంటెలెక్చువల్, సూడో సెక్యులరిస్టుల ఆలోచనలతో నేడు తెలంగాణ అస్తిత్వాన్ని అణిచిపెట్టారు. హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రకారం మరాఠీ భాష మాట్లాడే మరాఠ్వాడా ప్రాంతం మహారాష్ట్రలోను, కన్నడ మాట్లాడే రాయచూరు, గుల్బర్గా, బీదర్ జిల్లాలు కర్ణాటక రాష్ట్రంలోను కలిసిపోయాయి. మహారాష్ట్రలో సెప్టెంబర్ 17ను 'మరాఠ్వాడా ముక్తి సంగ్రామ్ దివస్'గా, కర్ణాటకలో 'కల్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని అక్కడి ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయి. కానీ, మన తెలంగాణలో మాత్రం ఓ వర్గం ఓట్లకోసం, మజ్లిస్ పార్టీ ఆదేశాలతో హైదరాబాద్ (నేటి తెలంగాణ) విమోచన ఉత్సవాలు జరపకుండా తెలంగాణ ప్రజలకు అధికారం చేపట్టిన పార్టీలు ఘోర అన్యాయం చేశాయి.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరిగినన్ని రోజులు 'తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకోనీయరా?' అంటూ నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించింది. కానీ తాము అధికారంలోకి వచ్చాక అసలు విమోచనం అనే పదమే సరైంది కాదని, ఆ అవసరం ఏముందని పదేళ్లుగా ఇచ్చిన మాట తప్పింది. చారిత్రక దినాన్ని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించలేదు. ఇందుకు కారణం కేవలం 'తుష్టీకరణ' మాత్రమే! చివరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయితే ఆగమేఘాల మీద విమోచన కాదు, ఇది 'జాతీయ సమైక్యత దినం' అని హడావుడి ప్రకటనలతో చేతులు దులుపుకుంది.



చరిత్రను, వాస్తవాలను మరుగునపడేయాలన్న ఏ ప్రయత్నాన్నీ ప్రజలు హర్షించరు. తెలంగాణ విమోచన వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేసే ఈ ఉత్సవాలను వేర్వేరు పేర్లతో పిలుస్తూ అసలైన చరిత్రను నీరుగార్చే ప్రయత్నాన్ని రాజకీయ పార్టీలు మానుకోవాలి. ఓటుబ్యాంకు రాజకీయాలు, తుష్టీకరణ కంటే వాస్తవ చరిత్రే గొప్పదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఇటీవల రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఈ తుష్టీకరణోన్మాదం నెత్తికెక్కి 'విమోచనం' కాదు, ఇది 'ప్రజాపాలన దినోత్సవమ'ని కొత్త రాగం అందుకుంది. ఓవైపు కేంద్రం అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవాన్ని' నిర్వహిస్తుంటే– రాష్ట్ర ప్రభుత్వం ఇందులో భాగస్వామి కాకపోగా రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసం? భారతీయ జనతా పార్టీ మాత్రం 1996 నుంచి తెలంగాణ విమోచన ఉత్సవాలు నిర్వహించాలని అనేక ఉద్యమాలు చేసింది. తెలంగాణ వాస్తవ చరిత్రను ప్రజలకు మరీ ముఖ్యంగా భవిష్యత్ తరాలకు అందజేసేందుకు కృషిచేస్తోంది.



భిన్న సంస్కృతులు, భిన్నభాషలు, భిన్న సంప్రదాయాల కలయిక అయిన భారతదేశం ఒక్కటిగా ఉండాలనేది, 'భిన్నత్వంలో ఏకత్వా'న్ని ప్రతిబింబిస్తూ యావత్ ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలనేది సర్దార్ పటేల్ ఆలోచన. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాలని, మనమంతా ఒక్కటేననే భావనను ప్రజల్లో పెంపొందించాలనేది వారి పట్టుదల. దీంట్లో భాగంగానే తన రాజనీతిజ్ఞత, దౌత్యవిధానంతో 560కి పైగా సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసి, భారతీయుల స్వప్నాన్ని సాకారం చేసేంతవరకు విశ్రమించలేదు. ఆ తర్వాత పాలనా పరమైన నిర్ణయాల్లోనూ ఇదే లక్ష్యంతో వారు పనిచేశారు.

2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ కూడా 'ఉక్కు మనిషి' బాటలోనే పయనిస్తున్నారు. దేశ సమగ్రత, భద్రత, దీర్ఘకాల సుస్థిరతపై ప్రత్యేక దృష్టి సారించారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' నినాదాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ ఇదే బాటలో వివిధ పథకాలను తీసుకొచ్చి దేశ సామాజిక ఆర్థిక, రాజకీయ సమైక్యత కోసం ప్రజలందరి భాగస్వామ్యంతో కృషి చేస్తున్నారు. ఆర్టికల్ 370ని రద్దుచేసి జమ్మూకశ్మీర్లో ఏళ్ల తరబడి రాజ్యమేలుతున్న అరాచకాన్ని పారద్రోలారు. జమ్మూకశ్మీర్లో భారత రాజ్యాంగం అమలయ్యేలా మోదీ తీసుకున్న చొరవతో నాడు పటేల్ చేయాల్సిన పనిలో మిగిలిపోయిన పని 5 ఆగస్టు, 2019తో సంపూర్ణమైంది. 'ఒకే దేశం, ఒకే రాజ్యాంగం' పూర్తిస్థాయిలో దేశంలో అమల్లోకి వచ్చింది.

దీంతోపాటుగా దేశమంతా ఒకే విధానం అమలు చేయడం ద్వారా ప్రజలకు సౌలభ్యాన్ని కల్పించేందుకు 'వన్ నేషన్, వన్ టాక్స్' (GST), 'వన్ నేషన్, వన్ రేషన్ కార్డ్, 'వన్ నేషన్, వన్ గ్రిడ్' వంటి మార్పులు దేశంలో గణనీయమైన మార్పుకు కారణమయ్యాయి. ఈ నిర్ణయాలు తీసుకోవడానికి పటేల్ వంటి ఉక్కు సంకల్పం ఉండాలి. అది మోదీ గారికి మాత్రమే ఉందని మరోసారి ప్రపంచానికి వెల్లడైంది.

దేశంలో 'సాంస్కృతిక ఏకీకరణ' జరగాలన్నది మోదీ ఆలోచన. ఇదే దేశంలో ఐకమత్య భావనకు బాటలు వేస్తుందని విశ్వసించి 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' నినాదంతో కాశీ–తమిళ్ సంగమం, కాశీ–తెలుగు వంటి వివిధ రాష్ట్రాల సంస్కృతుల సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించారు. ఒక భాష, జీవన విధానాలు ఆచరించే ప్రజలకు మన దేశంలోని మరో భాష, భిన్నమైన జీవన విధానాల గురించి తెలుసుకుని, పరస్పర గౌరవాన్ని పెంచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు బాటలు వేశాయి. ఇది దేశ సమైక్యతకు ఎంతో ఉపయోగపడింది.

ఇదే బాటలో మోదీ ప్రభుత్వం 'సహకార సమాఖ్య' విధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేసింది. రాష్ట్రాలకు ప్రాధాన్యత లభించేలా 'నీతి ఆయోగ్' ఏర్పాటు, రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచడం, వెనకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందించడం ద్వారా రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం, NDRF, SDRF నిధుల వాటాను పెంచడం, జీఎస్టీలో రాష్ట్రాలకు సమాన వాటా పంచడం వంటివెన్నో 'కోఆపరేటివ్ ఫెడరలిజా'న్ని ప్రోత్సహిస్తూ దేశ సమగ్రతకు బాటలు వేస్తున్నాయి. దేశ సమగ్రాభివృద్ధి, సాంస్కృతిక ఏకీకరణ, సుపరిపాలన వంటివి... మోదీ జాతీయ సమగ్రతా విధానానికి ఉదాహరణలు.

'తెలంగాణ విమోచన దినోత్సవా'లను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం దేశ సమైక్యతను కాపాడే దిశగా మోదీ సర్కారు తీసుకున్న చర్యల్లో ఒకటి. నాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ కేంద్ర హోంమంత్రి హోదాలో 1948 సెప్టెంబర్ 17నాడు మొదటిసారి హైదరాబాద్‌లో జెండా ఎగరవేస్తే, సరిగ్గా 75 ఏళ్ల తర్వాత మళ్లీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ గడ్డపై 2022 సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరవేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఇదే దేశ సమగ్రతను కాపాడే విషయంలో మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

చరిత్రను, వాస్తవాలను మరుగున పడేయాలన్న ఏ ప్రయత్నాన్నీ ప్రజలు హర్షించరు. అందుకే తెలంగాణ విమోచన వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేసే ఈ ఉత్సవాలను వేర్వేరు పేర్లతో పిలుస్తూ అసలైన చరిత్రను నీరుగార్చే ప్రయత్నాన్ని రాజకీయ పార్టీలు మానుకోవాలి. ఓటుబ్యాంకు రాజకీయాలు, తుష్టీకరణ కంటే వాస్తవ చరిత్రే గొప్పదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

నిజాం నియంతృత్వం నుంచి తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న ప్రజలందరూ ఉత్సాహంగా, ఐకమత్యంగా, సంతోషంగా తెలంగాణ విమోచన ఉత్సవాలను జరుపుకోవాలని కోరుతున్నాను. ఇలాంటి పర్వదినం నాడే గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం కూడా అయిన సందర్భాన వారికి తెలంగాణ ప్రజల పక్షాన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఇదే రోజు విశ్వకర్మ జయంతి, వినాయక నిమజ్జన శోభాయాత్ర కలిసిరావడం సంతోషకరమైన విషయం. 1948 సెప్టెంబర్ 17 నాడు కూడా వినాయక నిమజ్జనం జరిగిన రోజు (అనంత చతుర్దశి). మళ్లీ ఇన్నాళ్ల తర్వాత విమోచన దినోత్సవంనాడు మళ్లీ వినాయక నిమజ్జనం రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా మరోసారి తెలంగాణ ప్రజలకు హార్దిక శుభాకాంక్షలు.

■ జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

ప్రజాపాలనకు పునాది రైతాంగ సాయుధ పోరు

సెప్టెంబర్ 17.. తెలంగాణ ఆధునిక చరిత్రలో ఒక భావోద్వేగ రోజు. అసంఖ్యాక ఉద్యమాలు, అశేష త్యాగాలు స్మరించుకునే సందర్భం. 1920లో తెలంగాణ భాషా సంస్కృతుల పరిరక్షణకు, సంస్కరణలకు బీజం వేసిన ఆంధ్ర జనసంఘం ఆంధ్ర మహాసభగా మారి ఆ తర్వాత కమ్యూనిస్ట్ పార్టీ నేతృత్వంలో 1946 నుంచి 1951 వరకు సాయుధ పోరాటాన్ని నిర్వహించింది. దశాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో ఘనీభవించిన జడత్వాన్ని తొలగించి పెను మార్పులు తీసుకువచ్చింది. ఈ సందర్భ నేపథ్యాన్ని స్మరించుకుంటూ ఆ పోరు అందించిన ప్రధాన తాత్వికత వివక్ష అంతరాలు లేని, ప్రతి మనిషికి ఒకే విలువ ప్రాతిపదికతో పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఈ ఇతివృత్తంతో తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించాలని తలపెట్టింది. నిజాం రాచరిక నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా, నిజాం సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి హైద్రాబాద్ రాజ్య ప్రజలు ప్రాతినిధ్యాలు, సత్యాగ్రహాలు, అంతిమంగా సాయుధ పోరాటంతో తమ విముక్తిని సాధించుకున్న రోజుగా సెప్టెంబర్ 17 నిలిచిపోతుంది.



మట్టి మనుషులు నిర్వహించిన ఈ పోరు అందించిన ముఖ్య ఫలితం.. పాలనలో ప్రజల భాగస్వామ్యం. ఈ ప్రేరణతో రాజ్యాంగంలో 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలతో గ్రామ, నగర పంచాయత్ వ్యవస్థలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ ఈ విలీన నేపథ్య చారిత్రాత్మక ఉద్యమాన్ని, ఉద్యమకారులను త్యాగాలను సదా స్మరణలో, స్ఫూర్తిదాయకంగా ఉండడానికి, నూతన తరాలు బాధ్యతాయుతంగా ఉండడానికి అనేక చర్యలు తీసుకుంది. నిజాం రాచరిక కాలంలో తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిలబడిన జయసూర్య పేరుతో హోమియో కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది. పుట్టిన గడ్డ కోసం, అన్నం పెట్టిన భూమి కోసం ఇంటిని పోరాట కేంద్రంగా మార్చిన అగ్నికణిక ఐలమ్మ. భీమ్‌రెడ్డి, నల్లా నరసింహ దేవులపల్లి వంటి వీరయోధులను సాకిన తల్లి ఐలమ్మ. ఈ అవ్వ పాత్ర చిరస్మరణీయంగా ఉండడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. ప్రకృతి వనరులు సమాజ ఉమ్మడి ఆస్తులు, వాటిని రక్షించడమే ప్రథమ కర్తవ్యం అని చాటి చెప్పిన పోరాటం ప్రేరణతో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవకుండా హైడ్రాను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. భాషా సంస్కృతుల పరిరక్షణ ఉద్యమ ఆద్యుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టనున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధన పోరుకు నాటి రైతాంగ ఉద్యమం చోదకశక్తిగా, స్ఫూర్తిగా, ఉత్ప్రేరకంగా పనిచేసిందని గత టీఆర్‌యస్ ప్రకటించింది. ఆ ఉద్యమ అమరుల జయంతి, వర్ధంతులను అధికారికంగా ప్రకటించింది. నాటి ఉద్యమంలో మహిళలు చూపిన దీక్ష, ప్రతిఘటన అసమానమైనవి. తొలినాళ్లలో పోరాటకారులకు అన్నం పెట్టి ఆశ్రయం ఇచ్చిన మహిళలు తమ పాత్రను పెంచుకుని సాయుధ దళ సభ్యులుగా, దళ నేతలుగా పనిచేసారు. దాడులు, ఆత్మరక్షణలో శిక్షణ ఇచ్చిన మోటూరు ఉదయం లలితమ్మ, దళాలలో చురుకైన పాత్ర పోషించిన వజ్రమ్మ, నాగమ్మ, స్వరాజ్యం, ఆరుట్ల కమలమ్మ, దళాలకు వైద్యసేవలు అందించిన అచ్చమాంబ, రజియా లాంటి వేలాది మహిళలు ఈ పోరాటంలో వెన్నుదన్నుగా నిలిచారు. జాతి, భాషా, సాంస్కృతిక ఆధిపత్య ధోరణులను ఈసడించుకునే వారసత్వాన్ని ఈ తెలంగాణ నేల కలిగివున్నది. ఈ స్ఫూర్తిని దేశానికి అందించడంలో మనం అగ్రగామిగా కదలడమే నాటి రైతాంగ విముక్త, హైదరాబాద్ విలీన పోరాటకారులకు మనం ఇచ్చే ఘనమైన నివాళి.

– అస్నాల శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం

అది ప్రజా విముక్తిపోరు...

భూస్వామ్య, రాచరిక బానిసత్వంపై తిరగబడి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిందే వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. మట్టి మనుషుల పోరాటం అది. వెట్టి మనుషుల ఆరాటం అది.

ఈ పోరాటంలో భూమి కోసం పోరాడి అమరుడుగా తొలి భాగంలో నిలిచినవాడే బందగి. పేద ముస్లిం రైతు. 1946లో తెలంగాణ సాయుధ పోరాటం ఆరంభం కావడానికి తొలి అమరత్వం పొందినవాడు దొడ్డి కొమరయ్య, విసునూరి దేశ్‌ముఖ్ కాల్పుల్లో అమరుడైనాడు. భూమి కోసం ఐలమ్మ కొడవలి పట్టి పోరాడింది. భీమిరెడ్డి, ఆరుట్ల దంపతులు, నల్ల నర్సింహులు, గంగవరపు శ్రీనివాసరావు, వక్కంతుల సూర్యం – ఒక్కరా ఇద్దరా! నాలుగు వేల మంది అమరులు, లక్షల మంది పోరాట వీరులు. వీరికి కార్మిక నాయకుడిగా మగ్దూం మొహియుద్దీన్, రాజబహదూర్ గౌర్, పత్రికా సంపాదకుడిగా పోరాటానికి బాసటగా నిలబడ్డందుకు చంపబడ్డవాడు షోయబుల్లాఖాన్. అంటే అన్ని మతాలు, అన్ని కులాలు, దళితులు, వ్యవసాయదారులు, కష్టజీవులందరూ కలసి సాగించిన పోరాటం అది. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, పారశీకులు, జైనులు అందరూ ప్రజాక్షేత్రం వైపు నిలబడ్డ పోరాటం అది. ప్రత్యేకించి పేద ముస్లింలు సైతం ముస్లిం రాజైన నిజాంను తరతరాల బూజు అంటూ, ఎర్రజెండాలెత్తి పోరాడిన పోరాటం అది.

అలాంటి పోరాటాన్ని నేడు బీజేపీ, సంఘ్ పరివార్ మూకలు, దేశంలో స్వాతంత్రోద్యమాన్ని వక్రీకరించినట్లే– హిందూ, ముస్లింల మధ్య పోరాటంగా చిత్రించే కుటిలత్వానికి పూనుకున్నది. ప్రజల పోరాటంలో సంఘ్ పరివార్‌కు ఏ పాత్రాలేదు. స్వాతంత్రోద్యమంలోనూ దానికి పైసా వంతు పాత్ర లేదు. జమీందారుల, ప్రభువుల పల్లకీలు మోసిన వీరు, నేడు ప్రజల మధ్య విద్వేషాల కోసం చరిత్రను వక్రీకరించే యత్నం చేస్తున్నారు. భూస్వామ్యంపై, నిజాం రాచరికంపై వీరోచిత విజయాలు సాధిస్తున్న తెలంగాణ సాయుధ పోరాటాన్ని, దాని నాయకత్వ కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో నిజాం రాజు – నెహ్రూ పటేల్ మధ్య జరిగిన రాజీ ఒప్పందంతో పటేల్ సైన్యాలు సెప్టెంబర్ 17న తెలంగాణకు వచ్చాయి. నెత్తురు చుక్క కారకుండా నిజాం లొంగిపోయాడు. రాజభరణాలు ఇచ్చారు. కమ్యూనిస్టు యోధులను నిజాం రాజు కంటే ఎక్కువ మందిని సైన్యాలు కాల్చి చంపాయి. ప్రజలను హింసించారు. జైళ్ళకు పంపారు. ప్రజల చేతుల్లోకి వచ్చిన భూములను జమీందారులకు తిరిగి అప్పగించారు. అందుకే సెప్టెంబర్ 17 పోరాటాన్ని బూర్జువా పాలకవర్గం అణచడానికి ఎంచుకున్న రోజు. ప్రజా విముక్తి పోరాటానికి విద్రోహం జరిగిన రోజు.

– పోటు రంగారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్

ధీర ప్రజాకోటి పోరాటాన్ని గుర్తించరా?

భారతదేశం చిన్న చిన్న రాజ్యాలుగా రాచరిక వ్యవస్థలో మగ్గుతున్న కాలమది. ఈ పరిస్థితుల్లో యూరోపియన్లు వ్యాపార, వాణిజ్యాల పేరుతో దేశంలోకి ప్రవేశించారు. ప్రధానంగా బ్రిటీష్‌వారు దేశ వ్యాపితంగా రాజుల బలహీనతలను ఉపయోగించుకుని విభజించి పాలించు కుయుక్తులతో పలు రాజ్యాలు, ప్రాంతాలను తమ పెత్తనంలోకి తీసుకున్నారు. రాచరిక వ్యవస్థను పూర్తిస్థాయిలో తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అతిపెద్ద హైదరాబాద్ సంస్థానాన్ని అసఫ్‌జాహీ వంశస్థులు రెండు శతాబ్దాలకు పైగా పరిపాలిస్తున్నారు. నిజాం నవాబుగా పిలవబడే అసఫ్ జాహి పాలకుడి కనుసన్నలలో జమిందార్లు, జాగీరుదార్లు, వత్తన్‌దారులు, భూస్వాముల వ్యవస్థ కొనసాగేది. నిజాం నవాబు తన స్వంత అవసరాల నిమిత్తం హైదరాబాద్‌లో వేలాది ఎకరాల భూములు తన అధీనంలో ఉంచుకున్నాడు.

నవాబు వైభోగం అలా ఉంటే ప్రజలకు ఎలాంటి హక్కులు లేవు. పల్లెవాసుల బ్రతుకులు దినదిన గండంగా సాగేవి. దొరల కబంధహస్తాల కింద వెట్టిచాకిరి, బానిసత్వంగా బ్రతుకులు వెళ్ల దీసిన రోజులవి. అణిగిమణిగి ఉండాల్సిందే. ఆ విపత్కర పరిస్థితుల్లో ప్రజలు దిక్కుతోచని స్థితిలో బతుకులు వెళ్లదీస్తున్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల పాలనకు వ్యతిరేకంగా 1857లో తొలుత సిపాయిలు, ఆ తరువాత ప్రజలు తిరుగుబాటు చేశారు. బ్రిటీష్‌వారు తమ ఈస్టిండియా కంపెనీ పాలనకు స్వస్తి చెప్పి తమ అధీనంలోని రాజ్యాలు, ప్రాంతాలను తమ ప్రత్యక్ష పాలనలోకి తీసుకున్నారు. దరిమిలా భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావంతో స్వాతంత్ర్య జాగృతి మొదలయింది. 1930 తరువాత భారత స్వాతంత్ర్యోద్యమం ముమ్మరమయింది. హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న పలువురు యువకులు ఆ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1932 కాకినాడ ఉప్పు సత్యాగ్రహం లాంటి వార్తలు విని తెలంగాణలో కూడా నిజాం ఆగడాలను, అరాచకాలను ఎండగట్టేందుకు నిర్ణయించుకున్నారు. బానిస బ్రతుకులకు చరమగీతం పాడేందుకు మెదక్ జిల్లా జోగిపేటలో మొదటి ఆంధ్ర మహాసభను నిర్వహించారు. అందులో ప్రధానంగా పౌరహక్కులు, వెట్టిచాకిరి రద్దు, తెలుగులో పాఠశాలలు నిర్వహించాలనే అంశాలపై తీర్మానాలు చేసారు. ఆ తదుపరి, ప్రతి సంవత్సరం ప్రజల కష్టాలు, కడగండ్లపై మహాసభలు నిర్వహిస్తూ 1945లో భువనగిరిలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన ఆంధ్రమహాసభ నూతనత్వానికి, ప్రజల స్వేచ్ఛ, హక్కుల సాధనకై, భూమి, భుక్తి పోరాటాలకు పిలుపునిచ్చింది. 'ఊరూర ప్రజలు సంఘం పెట్టుకొని' సంఘటితమై దొరల దౌర్జన్యాలపై పిడికిలి బిగించారు. తెగింపు ఉద్యమాలకు సన్నద్ధమైనారు.

జనగామ ప్రాంతంలో విసునూరు రామచంద్రారెడ్డి 20 గ్రామాలకు అధిపతి, 40 వేల ఎకరాల పైబడి భూములకు యజమాని. అతని అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. కడివెండిలో ఆయన తల్లి జానకమ్మది క్రూరమైన మనస్తత్వం. అక్కడ నల్లా నర్సింహులు, ఇంకా అనేక మంది యువకులు ఆంధ్ర మహాసభ ప్రభావంతో క్రియాశీలంగా ప్రజల మధ్య ఉంటూ దొరలను ఎదిరించేవారు. జానకమ్మ అరాచకాలకు వ్యతిరేకంగా ఒకసారి ఆమె ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా వెట్టిచాకిరి రద్దు, దున్నేవాడికే భూమి లాంటి నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆ ఊరేగింపు జానకమ్మ ఇంటి ముందుకు రాగానే ఆమె గూండాలు దాడి చేశారు. కార్యకర్తలు ఎదురు తిరగడంతో దొరసాని బంట్లు తుపాకితో కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో దొడ్డి కొమురయ్య నేలకొరిగాడు. కొమురయ్య ప్రాణత్యాగం ప్రజలను చైతన్యపరిచింది. నిజాం నవాబు, ఆయన తాబేదారులను మరింత తీవ్రంగా ప్రతిఘటించసాగారు.

నిజాంను గద్దెదించడానికి సాయుధ పోరాటమొక్కటే శరణ్యమని రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ భావించారు. సెప్టెంబర్ 11, 1947న రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. నిజాం నవాబు తాబేదార్లపై ఎక్కడికక్కడ బడిశలు, కత్తులు, కర్రలు, కారంపొడితో ఆడ మగ అనే తేడా లేకుండా తిరగబడాలని వారు పిలుపునివ్వడం జరిగింది. ఆ పిలుపు ప్రభంజనంగా మారింది. ఊరు, వాడ, ఉప్పెనగా తిరుగుబాటు చేశారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసారు. 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారు. 2500 మంది యువ కిశోరాలు సాయుధ పోరాటంలో ప్రాణాలు అర్పించారు. నిజాం నవాబుకు గత్యంతరం లేక కేంద్రంతో ఒప్పందం చేసుకున్నాడు. ఇది నిజం. యథార్థ చరిత్ర. ఆ రైతాంగ సాయుధ పోరాటమే లేకపోతే తెలంగాణ ఎలా ఉండేదో ఈ తరం మేధావులు, యువకులు ఆలోచించాలి.

నిజాం నవాబుకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సెప్టెంబర్ 11, 1947న పిలుపునిచ్చారు. ఆ పిలుపు ప్రభంజనంగా మారింది. ఊరు, వాడ, ఉప్పెనగా తిరుగుబాటు చేశారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసారు. 2500 మంది యువ కిశోరాలు ప్రాణాలు అర్పించారు. నిజాం నవాబుకు గత్యంతరం లేక కేంద్రంతో ఒప్పందం చేసుకున్నాడు. ఇది నిజం. ఆ సాయుధ పోరాటమే లేకపోతే తెలంగాణ ఎలా ఉండేదో ఈ తరంవారు ఆలోచించాలి.



అసమాన త్యాగాలు చేసి ప్రాణాలర్పించిన నాయకత్వంతో కేంద్రం కనీసం సంప్రదింపులు అయినా ఎందుకు జరపలేదు? చర్చలు లేకుండానే అణచివేయడానికి పాలకులు మొగ్గుచూపారు. యువ కిశోరాలు ఏమి ఆశించి ప్రాణాలర్పించారు? ఎట్టకేలకు 17 సెప్టెంబర్ 1948న భారతదేశంలో తెలంగాణ విలీనమయింది. ఈ విషయమై కూడా చర్చలు జరపలేదు. యూనియన్ సైన్యాలు సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. నిజాం నవాబు స్వంత భూములు, భవనాలు, ఆభరణాలు అన్నింటిని ఆయనకే ఇవ్వడంలో ఔచిత్యాన్ని, అంతర్యాన్ని ఇప్పటికైన మేధావులు దృష్టిలో ఉంచుకోవాలి. ఆనాటి పోరాట యోధులలో కేవలం కమ్యూనిస్టులే కాకుండా కాంగ్రెస్, సోషలిస్టు పార్టీల నేతలు కూడా ఉన్నారు. ఎందుకు వీరిని తెలంగాణ సంస్థానాన్ని భారత దేశంలో కలపడానికి (వీలీనం) కృషి చేసిన వారి ప్రాణాల అర్పణకు విలువ లేదు అనేది చరిత్ర ముందున్న ఒక ప్రధాన ప్రశ్న.

1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో మహారాష్ట్రలోని 5 జిల్లాలు, కర్ణాటకలోని 3 జిల్లాలు పోగా మిగిలిన 8 జిల్లాల తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం ఒక చరిత్రాత్మక పరిణామం. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17ను అధికారికంగా విలీన దినంగా పాటిస్తున్నాయి. ఆనాటి పోరాట యోధులను గుర్తించి సత్కరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలంగాణ యోధులకు అలాంటి గుర్తింపు ఇవ్వలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విలీనదినంగా జరుపుతానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా అనేక సభలలో సాయుధ పోరాటమే లేకపోతే తెలంగాణ ఏమైపోయేదో, మరో పాకిస్థాన్ లాగా ఉండేదేమో అని కేసీఆర్ తరచు అనేవారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన తన మాట నిలబెట్టుకోలేదు. చివరలో ఏదో మమ అనే విధంగా విలీన దినోత్సవాలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ స్పష్టమైన వైఖరితో అఖిలపక్ష పార్టీల సమావేశం ఏర్పాటు చేసి విలీన దినాన్ని ప్రభుత్వపరంగా నిర్వహించడం సబబుగా ఉంటుంది.

ఆ చరిత్రాత్మక కాలంలో అసలు ఉనికిలోనే లేని భారతీయ జనతా పార్టీ ఆ పోరాట యోధుల విషయమై మొసలి కన్నీరు కారుస్తోంది. తెలంగాణలో పాగా వేసేందుకు విమోచన దినాన్ని అధికారపూర్వకంగా రాష్ట్రం జరపకపోయినా కేంద్ర ప్రభుత్వం జరుపుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంటున్నారు. ఆయన స్వయంగా సెప్టెంబర్ 17న తెలంగాణలో బీజేపీ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేస్తున్న సభలలో పాల్గొంటున్నారు. రాజకీయ లబ్ధికి ఆరాటపడకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం ముఖ్యం.

ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భూస్వాములు, వత్తన్‌దారులకు వత్తాసు పలుకుతోంది. సారవంతమైన భూములు, అడవులు, అపార సహజ వనరులు ఉన్న ప్రాంతం తెలంగాణ. స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు గడిచి 78లో అడుగు పెడుతున్నా ఇప్పటికీ భూముల సమగ్ర సర్వే జరగనేలేదు. చివరి సర్వే 1936లో జరిగింది. పాలకుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల భూములకు హద్దులు చెరిగిపోయి కోర్టులలో కేసులు కొనసాగుతున్నాయి. రెవెన్యూ, అటవీశాఖల హద్దులు సరిగా లేకపోవడం ఒక వివాదస్పద అంశంగా కొనసాగుతున్నది. అక్రమకట్టడాలను కూల్చడానికి హైడ్రాను ఏర్పాటు చేయడం మంచి పరిణామమే అయినా శాస్త్రీయంగా సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు చేపట్టడం సబబుగా ఉంటుంది.

గతం లేకుండా వర్తమానం ఉండదు. ఇప్పటికైనా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని రేవంత్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విలీన దినంగా పాటించాలి. ఆ వేడుకలను అధికారపూర్వకంగా నిర్వహించాలి. ట్యాంక్ బండ్‌పై రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఇతర ప్రముఖుల విగ్రహాలు నెలకొల్పాలి. నాటి రైతాంగ వీరోచిత పోరాటంలో చరిత్ర కెక్కిన బైరాన్‌పల్లి, గుండ్రాయిపల్లి మొదలైన గ్రామాలను పర్యాటక ప్రదేశాలుగా గుర్తించాలి. నేలకొరిగిన యోధులకు స్మారక చిహ్నాలు నిర్మించాలి. పాఠ్యపుస్తకాలలో ఆ వీరుల చరిత్రను చేర్చాలి. ఆ చరిత్రను ఈనాటి తరానికి స్ఫూర్తిదాయకంగా తెలియపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలి. నాటి పోరాట స్మృతులతో మ్యూజియంను ఏర్పాటు చేయాలి. తెలంగాణ చరిత్రను, సంస్కృతి, సంప్రదాయాలను శాశ్వతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించాలి.

• చాడ వెంకటరెడ్డి
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

ముమ్మాటికీ విద్రోహమే

భారత సైన్యాలు సెప్టెంబర్ 17న హైదరాబాద్‌ను స్వాధీనం చేసుకోకుంటే అనతికాలంలోనే కమ్యూనిస్టుల నాయకత్వంలో నిజాంను గద్దె దించి రిపబ్లిక్‌ను ఏర్పరచి ప్రజాస్వామిక, సోషలిస్టు రాజ్య నిర్మాణం జరిగే అవకాశాలు ఎవరూ తోసిపుచ్చలేనివి. ఈ కాలంలోనే చైనా విప్లవం విజయవంతం అయి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఏర్పడింది. ఆ విధంగానే బయటి శక్తులు జోక్యం లేనట్లయితే హైదరాబాద్ కమ్యూనిస్టుల నాయకత్వంలో విముక్తి అయి పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ హైదరాబాద్ ఏర్పడి భూసంస్కరణలు, వ్యవసాయ విప్లవం విజయవంతమయి, సోషలిస్టు రాజ్యం దిశగా సాగించే అవకాశాలు మెరుగైవుండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటు నిజాంను, అటు కమ్యూనిస్టులను దెబ్బతీయాలనే ప్రణాళికలు సిద్ధం చేసింది. నాటి భారత సైన్యాలు ప్రవేశం నిజాంను లొంగదీసుకునేందుకే అయితే త్వరలోనే తిరిగి వెళ్లిపోయేవి. కానీ వాళ్ల అసలు లక్ష్యం ఇక్కడ కమ్యూనిస్టుల నాయకత్వంలో దినదినం పెరుగుతున్న రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచడం. అందుకే మరో నాలుగు సంవత్సరాలు ఇక్కడే తిష్టవేసి మూడువేల గ్రామాల్లో ఆనాటికే నెలకొన్న గ్రామరాజ్య వ్యవస్థను దెబ్బకొట్టి, నాలుగువేల మందికి పైగా కమ్యూనిస్టులను ఊచకోత కోసి పట్నాలకు చేరిన జాగీర్దార్లు, భూస్వాములకు కాంగ్రెస్ టోపీలు తొడిగి మళ్లీ గ్రామాల్లో పొందుబాటు చేయించారు. అనేక పోరాటాలు చేస్తున్నా, చేసినా కూడా తెలంగాణ విద్రోహానికి గురవుతూనే ఉన్న పరిస్థితి. నైజాం కాలం నాటి పరిస్థితి ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా పునరావృతమవుతోంది. తమ కనీస సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న ప్రజానీకంపై తీవ్ర నిర్బంధం ప్రయోగించడం చూస్తున్నాం. తెలంగాణ అస్తిత్వం కాపాడుకోవడం కోసం పోరాటం మిగిలేవుందని తెలంగాణ ప్రజాఫ్రంట్ భావిస్తున్నది.

– మెంతెన సంజీవరావు
రాష్ట్ర కో–కన్వీనర్,
తెలంగాణ ప్రజాఫ్రంట్

76 ఏళ్ల తర్వాత..!

- సెప్టెంబర్ 17న వినాయక నిమజ్జనం
- ఈ ఏడాది ఉత్సవాలకు ఓ ప్రత్యేకం

8



షెడ్డు తొలగించిన అనంతరం ఖైరతాబాద్ మహా గణపతి



నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన క్రేన్లు

డీజే మోగింది.. ఉద్యోగం ఊడింది

- ఉస్మానియా ఆస్పత్రిలో నలుగురు ఉద్యోగుల తొలగింపు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేతో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ రోగుల ఇబ్బందులకు కారణమైన నలుగురు ఉద్యోగులపై వేటు పడింది. ఈనెల 15న ఆదివారం ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణపతి నిమజ్జనం సందర్భంగా సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సంస్థ ఇన్‌చార్జీలు డీజే పెట్టి నృత్యాలు చేయడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇదే విషయంపై 'ఉస్మానియా ఆస్పత్రిలో మోగిన డీజే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆరా తీశారు. డీఎంఈ

మిగతా 6వ పేజీలో..

- నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం
- గ్రేటర్‌లో 73 ప్రాంతాల్లో నిమజ్జనం
- సకల ఏర్పాట్లు చేసిన జీహెచ్ఎంసీ
- విద్యుత్ ధగధగల్లో సాగర తీరం కళకళ
- వాటర్‌బోర్డు తాగునీటి వసతి, ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఉద్యోగులు రెడీ
- అర్ధరాత్రి వరకు ఆర్టీసీ, ఎంఎంటీఎస్, మెట్రో సర్వీసులు

మహా వేడుక.. అదరాలిక





మహానగరం నిమజ్జనానికి ముస్తాబైంది. పార్వతీ పుత్రుడిని తల్లి ఒడికి సాగనంపేందుకు భక్తజనం సిద్ధమైంది. వేడుకలు ప్రశాంతంగా, అసౌకర్యం లేకుండా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అప్రమత్తమైంది. మంగళవారం జరిగే సంరంభానికి అన్ని శాఖలు సమన్వయంతో సన్నద్ధమయ్యాయి. ప్రధానంగా హుస్సేన్‌సాగర్‌తోపాటు సరూర్‌నగర్, కాప్రా తదితర పెద్ద చెరువులు, బేబి, పోర్టబుల్ పాండ్స్‌తో కలిపి 73 ప్రాంతాల్లో నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. పారిశుధ్య నిర్వహణ, ఇతరత్రా పనులకు 15 వేల మందిని రంగంలోకి దింపింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడు కమిషనరేట్ల పరిధిలో 35 వేల మందికిపైగా పోలీసులు బందోబస్తులో నిమగ్నం కానున్నారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ, ఎంఎంటీఎస్, మెట్రో అర్ధరాత్రి వరకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నాయి. - హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి)



పత్తికుంట చెరువును పరిశీలించి ఏర్పాట్లను తెలుసుకుంటున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

35 లక్షల తాగునీటి ప్యాకెట్లు

వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి 122 వాటర్ క్యాంపులు, 35 లక్షల తాగునీటి ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. శోభాయాత్ర జరిగే దారి వెంట, ట్యాంక్‌బండ్, సచివాలయం పరిసర ప్రాంతాల్లో వాటర్ క్యాంపులు ఉంటాయని చెప్పారు. మంచినీటి శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ, ఇతర సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో సివరేజీ ఓవర్ ఫ్లో సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జెట్టింగ్ మిషన్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే మిలాద్ ఉన్ నబీ ఏర్పాట్లపైనా ఎండీ సమీక్షించారు.

నిమజ్జనానికి పర్యాటకశాఖ బోట్లు

ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనాన్ని పురస్కరించుకుని పర్యాటకశాఖ హుస్సేన్‌సాగర్‌లో

మిగతా 8వ పేజీలో..

సమన్వయంతో వ్యవహరించండి

- అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం

కవాడిగూడ, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): జంటనగరాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించి వేడుకలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి సోమవారం పర్యవేక్షించారు. నిమజ్జనం, వ్యర్థాల తొలగింపు, విద్యుత్, తాగునీటి వసతి, మెడికల్ క్యాంపుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడారు. 'నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మండపాల నిర్వాహకులు కూడా అధికారులకు సహకరించాలి. త్వరగా నిమజ్జనమయ్యేలా చూడాలి' అని సూచించారు. బల్దియా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో 465 క్రేన్లు, హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 38 క్రేన్లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో క్రతువును పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, పోలీసులు, గజ ఈతగాళ్లు మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేశ్, మేయర్ విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, వేం నరేందర్‌రెడ్డి

ఖైరతాబాద్, లక్డీకాపూల్‌కు 600 బస్సులు

నిమజ్జనం నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు ఖైరతాబాద్, లక్డీకపూల్ వరకు 600 బస్సులు నడుపుతున్నామని, రద్దీకనుగుణంగా ట్రిప్పులు పెంచుతామని ఆర్టీసీ గ్రేటర్ ఈడీ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ వేడుకల్లో 1700 మందికి పైగా అధికారులు, సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇద్దరు రీజినల్ మేనేజర్లు, ఏడుగురు డిప్యూటీ ఆర్ఎంలు, 27 మంది డిపో మేనేజర్లతోపాటు 250 మంది సూపర్‌వైజర్లు, 1200 మంది కండక్టర్లు, డ్రైవర్లతోపాటు జిల్లాల నుంచి వచ్చిన మరో 150 మంది అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. వీరంతా ముఖ్య కూడళ్లలో అందుబాటులో ఉంటారని, బస్సుల వివరాల కోసం సూపర్‌వైజర్లను సంప్రదించాలన్నారు.

మధ్యాహ్నం 1.30లోపే ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం

- ఉదయం 6 గంటలకు శోభాయాత్ర మొదలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): పది రోజులపాటు విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ సప్తముఖ మహా గణపతి గంగమ్మ ఒడికి పయనమయ్యేందుకు సిద్ధమయ్యాడు. అందరి చూపు ఖైరతాబాద్ వైపే ఉండడంతో అన్ని విభాగాలు శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేశాయి. మధ్యాహ్నం 1.30 గంటలలోపే నిమజ్జనం పూర్తి చేసేలా 'ఆపరేషన్ ఎర్లీ నిమజ్జన్'ను రెండు రోజుల ముందు నుంచే పోలీసులు ప్రారంభించారు. గణపతి ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని భక్తులను ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. ఓ వైపు ట్రాలీ అలంకరణ

మిగతా 8వ పేజీలో..

సమన్వయ లోపం.. భక్తులకు శాపం

- ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా వైపు పెరిగిన ఒత్తిడి
- గంటల తరబడి బారులు తీరిన విగ్రహాలు

మహా నిమజ్జనానికి సన్నాహకంగా భావించే 9వ రోజు ఆదివారం భక్తులు నరకయాతన అనుభవించారు. ప్రభుత్వ విభాగాల సమన్వయ లోపం, ప్రణాళిక లేమితో హుస్సేన్‌సాగర్ తీరంలో నిమజ్జనానికి రెండు మూడు గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లోనూ అదే పరిస్థితి. ట్రాఫిక్ క్రమబద్ధీకరించే పరిస్థితి లేకపోవడంతో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. సాగర తీరంలో సోమవారం ఉదయం కూడా విగ్రహాలు బారులు తీరడంతో సాధారణ వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్,

మిగతా 8వ పేజీలో..



ఎన్టీఆర్ మార్గ్‌లో బారులు తీరిన వాహనాలు

కూల్..కూల్

- చల్లబడిన నగరం
- గరిష్ఠ ఉష్ణోగ్రత 31.2 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నగరం మెల్లగా చల్లబడుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు కాస్త నెమ్మదించడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం రోజంతా మబ్బులు కమ్ముకున్నాయి. గ్రేటర్‌లో గరిష్ఠం 31.2 డిగ్రీలు, కనిష్ఠం 23.5 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైందని, మరో రెండు రోజులపాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మెడికల్ షాపులపై నియంత్రణేది?

- ఫార్మాసిస్టు ఉండరు
- ప్రిస్క్రిప్షన్ లేకున్నా మందులు
- నిబంధనలు బేఖాతర్

8

మరమ్మతులు మానేసి.. మ్యాన్‌హోల్‌లోకి వదిలేసి

- వాటర్‌బోర్డు అధికారుల నిర్వాకం
- అయ్యప్ప సొసైటీలో లక్షల లీటర్ల మంచినీళ్లు వృథా



నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి

- గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

8

'విమోచన' వెలుగులు



తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా విద్యుత్ ధగధగల్లో కాంతులీనుతున్న సచివాలయం

కుమార్తె పుట్టిన రోజున.. తండ్రి వాహనం కింద నలిగి కొడుకు దుర్మరణం

- డీసీఎం రివర్స్ తీస్తుండగా దుర్ఘటన
- మరో ఘటనలో ఔటర్ పైనుంచి లారీ బోల్తా
- డ్రైవర్ దుర్మరణం, క్లీనర్‌కు తీవ్రగాయాలు



డీసీఎం కింద పడి మరణించిన కుమారుడు విఘ్నేష్‌ను మోసుకొస్తున్న తండ్రి కృష్ణ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): కుమార్తె పుట్టిన రోజు కావడంతో త్వరగా ఇంటికి రావాలన్న తండ్రి ఆతృత కుమారుడిని బలిగొనేలా చేసింది. డీసీఎం వ్యాన్ రివర్స్ తీస్తుండగా దానికింద ఆడుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు చక్రాల కింద నలిగి కన్నుమూశాడు. రాజేంద్రనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన కృష్ణ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కిస్మత్‌పూర్‌లోని ఓ సిమెంటు ఇటుకలు తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సోమవారం కుమార్తె పుట్టినరోజు ఉండటంతో సిమెంటు ఇటుకలను డెలివరీ చేసి

మిగతా 6వ పేజీలో..

సీఎం కాన్వాయ్ వెళ్లే దారిలో డమ్మీ బాంబు కలకలం

- ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు
- షూటింగ్ నిమిత్తం సిద్ధం చేసినట్టు వెల్లడి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వెళ్లే దారిలో డమ్మీ బాంబు కలకలం రేపింది. ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ ప్రయాణించే జూబ్లీహిల్స్ దారిలో నలుపు రంగు బ్యాగు లభించింది. దీన్ని సీఎల్‌డబ్ల్యూ అధికారులు స్వాధీనం చేసుకుని కేంద్ర కార్యాలయానికి తీసుకువెళ్లి పరిశీలించగా అందులో డమ్మీ బాంబు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ బ్యాగు ఎలా వచ్చింది అనే దానిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేసి వివరాలు వెల్లడించారు. కృష్ణానగర్‌లో ఉంటూ సినీ పరిశ్రమలో పనిచేసే ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అతడి స్నేహితుడు తీసుకుని జూబ్లీహిల్స్ వైపు వచ్చాడు. ఏదో కొనుగోలు చేసి వాటిని వాహనం డిక్కీలో పెట్టేందుకు తెరవగా అందులో బ్యాగు కనిపించింది. పరిశీలించగా వైర్లు, డిస్‌ప్లే కనిపించడంతో అది బాంబు అని భయపడి అక్కడే ఉన్న ఖాళీ మైదానంలో విసిరేసి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ బ్యాగులో బాంబు ఉన్నట్టు గుర్తించి విషయాన్ని పోలీసులకు తెలపగా వారు బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. షూటింగ్ నిమిత్తం దీన్ని సిద్ధం చేసినట్టు తేలిందని పోలీసులు వెల్లడించారు.

4 నెలల ముందే రైళ్లన్నీ ఫుల్

- సంక్రాంతికి ఏపీ వైపు వెళ్లే రైళ్లలో 'నో రూమ్' స్టేటస్
- బుకింగ్ ఓపెన్ చేసిన కాసేపటికే రిగ్రెట్



హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సుమారు నాలుగునెలల ముందే ఏపీకి వెళ్లే రైళ్లల్లో బెర్త్‌లన్నీ నిండిపోయాయి. రిజర్వేషన్ బుకింగ్ ఓపెన్ చేసిన కొద్ది గంటల్లోనే బెర్త్‌లు అయిపోయాయి. అప్పుడే వెయిటింగ్ లిస్ట్ భారీగా కనిపిస్తోంది. ప్రత్యేకించి నగరంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఏపీ వాసులైతే కుటుంబాలతో సహా తమ ఊర్లకు వెళ్లేందుకు నాలుగు నెలల ముందు నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్, నాంపల్లి, లింగంపల్లి, కాచిగూడ స్టేషన్ల నుంచి జనవరి 11, 12 13 తేదీల్లో ఏపీవైపు వెళ్లే రైళ్లన్నింటిలో బెర్తులన్నీ అప్పుడే ఫుల్ అయిపోయాయి.

ఆ రైళ్లలో బెర్తు దొరికితే గగనమే

సంక్రాంతికి వారం ముందు నుంచి ఏపీ వైపు వెళ్లే రైళ్లలో బెర్తులు దొరికితే ప్రయాణికులు గగనంగా భావిస్తారు. మరో వైపు బెర్తులు దొరకని వారు ప్రయాణానికి సమయం ఉండడంతో వెయిటింగ్ లిస్టు టికెట్‌తో ఎలాగోలా ఊరికి వెళ్లొచ్చులేనని సంతృప్తి పడుతున్నారు. కానీ, కొన్ని ప్రధాన రైళ్లలో రిగ్రెట్(నో రూమ్) స్టేటస్ కనిపించడంతో వెయిటింగ్ లిస్ట్ కూడా దొరకని వారు ఏం చేయాలా? అని ఆందోళన చెందుతున్నారు. ఈనెల 11,12 తేదీల నుంచే సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారు రైళ్లలో రిజర్వేషన్ చేసుకోవడంతో నగరం నుంచి వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల రిజర్వేషన్లు నిండిపోయాయి. విజయవాడ, విశాఖపట్నం వైపు వెళ్లే అన్ని రైళ్లల్లో బెర్తులన్నీ అయిపోయి, వెయిటింగ్ లిస్టు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. అయితే, నగరం నుంచి తిరుపతి వైపు వెళ్లే వెంకటాద్రి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వచ్చే జనవరి 11, 12, 13వ తేదీల్లో వెయిటింగ్ లిస్టు టికెట్ దొరుకుతోంది.

ప్రత్యేక రైళ్ల కోసం డిమాండ్

నగరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు వచ్చే జనవరి 11, 12వ తేదీల్లో ప్రత్యేక రైళ్ల ప్రకటన కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. సికింద్రాబాద్-విశాఖ వైపు వెళ్లే గరీబ్‌రథ్ రైళ్లలో రిగ్రెట్ కనిపిస్తుండగా, దురంతో ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ తరగతుల్లోనూ 250కి పైగా వెయిటింగ్ లిస్ట్ ఉంది. విశాఖ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, నాందేడ్ ఎస్‌టీపీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గోదావరి, లింగంపల్లి - నర్సాపూర్, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో అన్ని తరగతుల రిజర్వేషన్ పూర్తయి రిగ్రెట్ స్టేటస్ కనిపిస్తోంది. షిరిడి-విశాఖపట్నం ఎస్ఎస్ఎల్ఎన్ఎస్ ఎక్స్‌ప్రెస్‌లో జనవరి 11, 12వ తేదీలలో స్లీపర్‌క్లాస్ రిగ్రెట్ చూపుతుండగా, ఏసీ తరగతుల్లో 300పైగా వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. లింగంపల్లి నుంచి విశాఖపట్టణం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సెకండ్ సిట్టింగ్ సీట్లన్నీ అయిపోగా, చైర్‌కార్‌లో చాంతాడంత వెయిటింగ్ లిస్ట్ ఉంది. దీంతో దక్షిణమధ్య రైల్వే నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీ ఉన్న మార్గాల్లో అవసరమైన మేరకు ప్రత్యేక రైళ్లు నడుపుతామని, ఎన్ని నడిపేదీ త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



తండ్రి వాహనం కింద నలిగి కొడుకు మృతి

(5వ పేజీ తరువాయి)

త్వరగా ఇంటికి రావాలనుకొని చూసుకోకుండా డీసీఎంను రివర్స్ చేస్తున్నాడు. వాహనం కింద ఆడుకుంటున్న కుమారుడు విహ్నేష్(3)పైకి చక్రాలు ఎక్కడంతో నలిగిపోయి మరణించాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కన్నుమూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔటర్ పైనుంచి లారీ బోల్తా..

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): అతివేగమో.. డ్రైవర్ నిద్రమత్తో తెలియదు కానీ ఔటర్ రింగ్‌రోడ్డు పైనుంచి లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డుపై బోల్తాపడింది. చాలా ఎత్తు నుంచి ఒక్కసారిగా కిందపడిపోవడంతో క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...

అనంతపురం జిల్లా హిందుపురం మోడల్ కాలనీకి చెందిన రాజగోపాలచారి (28) లారీ డ్రైవర్. అదే ప్రాంతానికి చెందిన బాబాజాన్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. రాయ్‌పూర్ నుంచి ఐరన్ లోడ్‌తో లారీ (ఏపీ02టీడీ3786)లో బెంగళూరుకు బయల్దేరారు. సోమవారం తెల్లవారుజామున ఔటర్‌పై ఘట్‌కేసర్ దాటి తారామతిపేట వంతెన వద్దకు రాగానే అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. క్యాబిన్ నుజ్జునుజ్జవడంతో రాజగోపాలచారి తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు గ్యాస్ కట్టర్ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్రగాయాలపాలైన క్లీనర్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గతంలో ఇదే బ్రిడ్జి వద్ద ఔటర్ పైనుంచి సర్వీసు రోడ్డుపై లారీ బోల్తా పడడం గమనార్హం.



ఔటర్ పైనుంచి బోల్తాపడి నుజ్జునుజ్జయిన లారీ

రెడీమిక్స్ ఢీకొని వ్యాపారి మృతి

దుండిగల్ : రెడీమిక్స్ లారీ డ్రైవర్ అజాగ్రత్త ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ చెందిన రాకేశ్‌రాయ్ (33) బతుకు దెరువు కోసం నగరానికి వలసొచ్చి బౌరంపేటలో ఉంటూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. భార్య గుడ్డితో కలిసి సోమవారం తన బైక్‌పై షాపూర్‌నగర్ నుంచి బౌరంపేటకు వెళుతుండగా మార్గమధ్యలో రెడీమిక్స్ లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాకేశ్ లారీ వెనుక టైర్ల కిందపడి ప్రాణాలు వదలగా, భార్య గుడ్డికి తీవ్రగాయాలయ్యాయి.

డీజే మోగింది.. ఉద్యోగం ఊడింది

(5వ పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు విచారణ చేపట్టి ఇందుకు కారణమైన శానిటేషన్ సూపర్‌వైజర్లు శంకర్, మురళి, సెక్యూరిటీ సూపర్‌వైజర్ మురళి, క్యూపీఎంఎస్ సంస్థ మేనేజర్ హస్సన్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు.

వారిపై చర్యలేవి ?


మద్యం మత్తులో డీజే హోరు నడుమ పలువురు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, వైద్య సిబ్బంది చొక్కాలు విప్పి ఆస్పత్రిలో నృత్యాలు చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదైనప్పటికీ అధికారులు.. కేవలం కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకొని అసలు వారిని వదిలేశారని రోగి సహాయకులు మండిపడుతున్నారు.



బతుకమ్మ, సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్, నిజాం నవాబు లొంగిపోయిన శకటాలు





















మహా నిమజ్జనానికి పాతబస్తీ సిద్ధం

వినాయక మహా ఊరేగింపునకు పాతబస్తీ సర్వం సిద్ధమైంది. పదిరోజుల పాటు భక్తుల నుంచి విశేష పూజలందుకున్న గణనాథులు మంగళవారం భారీ ఊరేగింపు మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి తరలివెళ్లనున్నాయి. అందుకోసం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులు, పోలీసులు, అధికారులు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. ఇప్పటికే మండపాలకు తరలించిన భారీలారీలు, టస్కర్‌లలో గణేశ్ విగ్రహాలను ఎక్కించే పనిలో నిర్వాహకులు ఉన్నారు. వినాయక మహా శోభాయాత్రకు స్వాగతం పలుకడానికి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చార్మినార్, లాల్‌దర్వాజమోడ్ వద్ద స్వాగత వేదికలను ఏర్పాటు చేశారు. వీరితోపాటు పలు హిందూ సంస్థలు వేదికలను ఏర్పాటుచేసి గణనాథులకు స్వాగతం పలుకడానికి సిద్ధమయ్యారు. ఈ ఉత్సవాల సందర్భంగా రోడ్లకు ఇరువైపులా వివిధపార్టీలకు చెందిన నాయకులతో పాటు హిందూ సంస్థలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు భారీగా వెలిశాయి. భారీబందోబస్తు ఏర్పాటు చేశామని, అడుగడుగునా నిఘానేత్రాలతో పర్యవేక్షిస్తామని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు.

● గణేశ్ శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి ● అదనపు పోలీస్ బలగాలతో బందోబస్తు ● అడుగడుగునా సీసీ కెమెరాలతో నిఘా: డీసీపీలు స్నేహా మెహ్రా, డీసీపీ సునీతారెడ్డి

బాలాపూర్ వినాయకుడి నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

పహాడిషరీఫ్: బాలాపూర్ గణేశ్ నిమజ్జన వేడుకలకు సర్వం సన్నద్ధమైంది. బాలాపూర్ గణేశ్ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలు బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాటలో 31వ సారి బాలాపూర్ లడ్డూ ఎవరికి సొంతం కానుందో - మరికొన్ని గంటల్లో భవితవ్యం తేలనుంది. గత సంవత్సరం రూ.27 లక్షలకు దాసరి దయానంద్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. ఈ యేడు జరుగనున్న బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాట ఎంతో ఆసక్తి రేకెత్తించనుంది. ఈసారి బాలాపూర్ గ్రామస్థులు కూడా ముందుగానే డిపాజిట్ చేశాక లడ్డూ వేలంపాటలో పాల్గొనడానికి అర్హులని కొత్త నిబంధనలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చివరగా సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.27లక్షలు డిపాజిట్ చెల్లించిన వారికే లడ్డూ వేలం పాట పాల్గొనడానికి అర్హులని బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు.

బాలాపూర్ గణేశ్‌ను దర్శించుకున్న 7 లక్షలకు పైగా భక్తులు

గత పది రోజులుగా.. ప్రతి రోజూ బాలాపూర్ గణపతిని 40 వేల నుంచి 50వేల మంది దర్శించుకుంటే సెలవుదినాల్లో మాత్రం 80వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఎప్పుడూలేని విధంగా ఈ యేడు ఇప్పటి వరకు 7 లక్షలకు పైగా భక్తులు బాలాపూర్ గణపతిని దర్శించుకున్నారని చెప్పారు.

5 గంటల నుంచే బాలాపూర్ గణేశ్..

బాలాపూర్ గణపతి నిమజ్జన వేడుకలు మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటల నుంచి బాలాపూర్ పురవీధుల గుండా అత్యంత భక్తిశ్రద్ధలతో భజన చేస్తూ బాలాపూర్ గణపతిని ఊరేగిస్తారు. బాలాపూర్ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కొబ్బరికాయ కొట్టి, మంగళహారతులు పడతారు. 9 గంటలకు బాలాపూర్ గణపతి డీసీఎం వాహనంలో బొడ్రాయి వద్దకు చేరుకుంటుంది. ఉదయం 10 గంటలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాట అట్టహాసంగా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా గత ఏడాది లడ్డూను సొంతం చేసుకుని, డబ్బులు చెల్లించిన దాసరి దయానంద్ రెడ్డిని బంగారు గొలుసుతో ఘనంగా సత్కరించనున్నారు.

బాలాపూర్ గణపతిని దర్శించుకున్న డీకే అరుణ



బాలాపూర్ గణనాథుడికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పూజలు చేసిన అనంతరం ప్రసాదం లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

పహాడిషరీఫ్: బాలాపూర్ గణనాథుడిని మహబూబ్ నగర్ ఎంపీ డీకే.అరుణ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీకి బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం డీకే అరుణకు వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణనాథుని చల్లని చూపు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోళ్లన్ శంకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు అందేలా శ్రీరాములు, గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో భారీపోలీసు బందోబస్తు

నేడు జరగనున్న బాలాపూర్ గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. బాలాపూర్ గణేష్ శోభాయాత్ర వెంట ఒక డీసీపీ, ఒక అడిషనల్ డీసీపీ, నలుగురు ఏసీపీలు, 12 మంది సీఐలు, 26 మంది ఎస్ఐలు, 208 మంది పోలీసు సిబ్బందితోపాటు రాపిడ్‌యాక్షన్ ఫోర్స్, పారామిలటరీ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొంటారన్నారు. సీసీకెమెరాలతో బందోబస్తును పర్యవేక్షిస్తామన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/InnZyriలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్



జెండాను ఆవిష్కరిస్తున్న వడ్డె చంద్రయ్య, తదితరులు

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో ముందు ఆ సంఘం ఉద్యోగులు సోమవారం ఉదయం జెండా ఆవిష్కరించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాజేంద్రనగర్ డిపోకార్యదర్శి వడ్డె చంద్రయ్య, హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి క్రిష్ణ మాట్లాడుతూ, ఐక్య పోరాటాలకు తమ సంఘం పెట్టింది పేరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఎస్ఐఓ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు

మదీన, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో సోమవారం పాతబస్తీలోని సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ విద్యా సదస్సు జరిగింది. 'ఈ సదస్సులో భారతదేశంలోని ముస్లింల రాజకీయ భవిష్యత్, ముస్లింల రాజకీయ చరిత్ర, సమకాలీన సందర్భాల గురించి జమాతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సాదతుల్లా హుసేని విశ్లేషించారు. తెలంగాణ ముస్లింల గురించి ఆర్థికవేత్త, టీఎస్‌పీఎస్‌సీ బోర్డు సభ్యుడు ప్రొఫెసర్ అమీర్‌ఉల్లాఖాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టర్కీలోని ఇబ్న్ హల్దున్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఇర్ఫాన్ అహ్మద్, ఎస్ఐఓ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ తదితరులు ప్రసంగించారు.

భారీ పోలీసు బందోబస్తు

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నేడు జరుగనున్న గణేశ్ శోభాయాత్ర సజావుగా జరగడానికి పాతబస్తీలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నిమజ్జన వేడుకలు తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశాలుండడంతో పోలీసులు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ, సీపీతోపాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాతబస్తీలో ఇప్పటికే పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. స్థానిక పోలీసులతో పాటు జిల్లాల నుంచి అదనపు బలగాలను పాతబస్తీకి రప్పించారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి సభ్యులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా సాగర తీరానికి వినాయకులు తరలివెళ్లేటట్లు మండపాల నిర్వాహకులు కృషి చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు కోరారు. ఊరేగింపు సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రధాన చౌరస్తాలతోపాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు.

ఊరేగింపును త్వరగా ప్రారంభించాలి



నిమజ్జన ఊరేగింపును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి. నిమజ్జనానికి వెళ్లే వాహనాల్లో చిన్నపిల్లలను అనుమతించవద్దు. భారీ వాహనాలపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జనంలో గణేశ్ విగ్రహం వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు.

\- కొడి మహేందర్,
భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి

మహిళల భద్రత కోసం మఫ్టీలో మహిళా కానిస్టేబుళ్లు : డీసీపీ స్నేహా మెహ్రా



స్నేహా మెహ్రా

చార్మినార్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పాతబస్తీలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మండల డీసీపీ స్నేహామెహ్రా అన్నారు. సోమవారం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో స్నేహ మాట్లాడుతూ దక్షిణ మండల పరిధిలోని పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయకుల విగ్రహాలను మంగళవారం నిర్వహించే సామూహిక గణేశ్ నిమజ్జనానికి తరలించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. బందోబస్తు కోసం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగలతో పాటు వివిధ జిల్లాల నుంచి పోలీస్ సిబంది పాల్గొంటారన్నారు. ఊరేగింపు కొనసాగే దారిలో నిమజ్జన పాయింట్‌ను చేరుకునే వరకు పోలీసులు వెంబడి ఉంటారన్నారు. ప్రస్తుతం సీసీ కెమెరాల తోపాటు ప్రధాన ఊరేగింపు మార్గంలో అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు. ప్రతి వినాయక మండపం నుంచి వాహనం వెంటా, నిమజ్జనం తర్వాత తిరిగి మండపం చేరుకునే వరకు పోలీస్ సిబ్బంది ఉంటారన్నారు.

ప్రత్యేక కంట్రోల్‌రూం

దక్షిణ మండలం నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడానికి ప్రత్యేక కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు. అంతేకాకుండా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ నుంచి అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. సామూహిక ఊరేగింపులో మహిళల భద్రత కోసం మఫ్టీలో మహిళా కానిస్టేబుళ్లు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగడానికి ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. వదంతులను ప్రచారం చేసే వారిపై డిజిటల్ నిఘా కొనసాగుతుందన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

కౌశిక్ రెడ్డికి మతి భ్రమించింది

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఇది సమాజానికి, రాజకీయ నాయకులకు మంచిది కాదని వెంటనే ఒళ్లు దగ్గర పెట్టుకొని రాజకీయం చేసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన నాయకుల సమీక్షా సమావేశంలో గౌరీసతీష్ మాట్లాడుతూ... పాడి కౌశిక్ రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశాడని 'నీ స్థాయి ఏమిటో' కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజలకు తెలుసని సతీష్ కుమార్ గుర్తుచేశారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ల బీ-ఫామ్‌లను అమ్ముకున్న చరిత్ర మరిచిపోయావా కౌశిక్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌పై మాట్లాడే నైతిక హక్కు, అర్హత లేదన్నారు. 'నీ ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తుంది. వెంటనే ఎర్రగడ్డ ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలి' అని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చెరువులలో ఆదివారం సాయంత్రం ప్రారంభమైన వినాయక నిమజ్జనాలు సోమవారం ఉదయం 9 గంటల వరకు కొనసాగాయి. రాజేంద్రనగర్‌ను ఆనుకుని ఉన్న హనుమాన్‌నగర్ పత్తికుంటలో పెద్ద మొత్తంలో వినాయక నిమజ్జనాలు జరిగాయి. ఈ చెరువు వద్ద జీహెచ్ఎంసీ అధికారులు మూడు క్రేన్‌లు ఏర్పాటు చేశారు. ఆది, సోమవారం ఉదయం వరకు పత్తికుంటలో 1,600 వినాయకులను నిమజ్జనం చేశామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేశామని, ఆ చెరువులో 400 వరకు వినాయకులను ఆది, సోమవారం ఉదయం వరకు నిమజ్జనం చేశామని తెలిపారు. మీరాలం చెరువు వద్ద రెండు క్రేన్‌లు ఏర్పాటు చేశామని, మీరాలం చెరువులో 80 నుంచి 90 విగ్రహాలను నిమజ్జనం చేశామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులు వి.శ్రీనివాసులు, నరేందర్‌గౌడ్, వెంకోబా, నామాల శ్రీనివాసులు, ఉదయ్, సత్యనారాయణ, జుబేర్, సాజిద్‌అలీ, శ్రావ్యతో పాటు పోలీసులు దగ్గరుండి ఏర్పాట్లను చేస్తున్నారన్నారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

గోషామహల్, అఫ్జల్‌గంజ్, మంగళ్‌హట్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో మండపాల్లో కొలువైన వినాయకుడిని సోమవారం వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ముఖ్యఅతిథులను సన్మానించారు. కొన్నిచోట్ల అన్నదానాలు చేశారు.



గౌలిపురా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతిని దర్శించుకున్న నగరపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు

● **అఫ్జల్‌గంజ్:** గోషామహల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో హైదరాబాద్ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ టి.సతీష్‌కుమార్ హాజరై వినాయకుడికి పూజలు నిర్వహించారు. ఆయనను నిర్వాహకులు సత్కరించారు.

● బేగంబజార్‌లో శ్రీరాం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి గోషామహల్ బీజేపీ సీనియర్ నాయకులు బబూత్‌సింగ్, నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉదయ్‌సింగ్ చౌహాన్ పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గోషామహల్: గౌలిగూడ టెలిఫోన్ ఎక్చేంజ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆర్.వి.మహేందర్‌కుమార్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పూజలు చేశారు.

● **మంగళ్‌హట్:** గోషామహల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ జి.ముఖేశ్‌సింగ్, సామాజికవేత్త ఆశిష్ పండిత్‌ను నిర్వాహకులు సత్కరించారు.

● హనుమాన్ టెకిడిలో బాలక్ వీర్‌గణేశ్ మండపంలో సామాజికవేత్త పి.నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

● **చాంద్రాయణగుట్ట:** ఫలక్‌నుమా నాగులబండ అంబేద్కర్‌నగర్‌లో గణపతికి ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి తదితరులు పూజలు చేశారు. చాంద్రాయణగుట్టదాస్ స్కూల్‌లేన్ బస్తీలో గణపతి లడ్డూను రూ.45వేలు పలికింది. గౌలిపురా జానకిదాస్ మఠ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణపతి లడ్డూను రూ.51వేలకు ఆర్టీఏ విశ్రాంత ఉద్యోగి బాల్‌రాజ కుటుంబసభ్యులు దక్కించుకున్నారు.





మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌ను సన్మానిస్తున్న ముస్లింనాయకులు

మతాల మధ్య బీజేపీ చిచ్చు : కేఎల్ఆర్

పహాడిషరీఫ్ సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడదీస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకోవటం విశేషమన్నారు. ప్రజలు వినాయక నిమజ్జనాలను సంతోషంగా జరుపుకోవాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. రూపాలు వేరైనా దేవుడు అందరికీ ఒక్కడే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ యుసూఫ్ ఖాద్రీ పలువురు ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, ముస్లింలు

మిలాద్ ఉన్ నబీ

కార్వాన్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): జాసనే ఈ మిలాద్ ఉన్‌నబీని పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గంలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ హాజరయ్యారు.

తప్పిపోయిన బాలుడు
కుటుంబ సభ్యుల చెంతకు

మంగళ్‌హట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లి తప్పిపోయిన ఓ బాలున్ని గంటల వ్యవధిలో గుర్తించి కుటుంబ సభ్యులకు మంగళ్‌హట్ పోలీసులు అప్పగించారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్ కుమార్ వివరాలను వెల్లడించారు. మంగళ్‌హట్ మార్కెట్‌కు చెందిన సాజిదా ఖతూన్ మరిది కుమారుడు సలావుద్దీన్ సోమవారం ఉదయం ఇంటి నుంచి పనినిమిత్తం బయటికెళ్లి అదృశ్యమయ్యాడు. అతని కోసం స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళ్‌హట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్‌కుమార్ వెంటనే స్పందించి మిస్సింగ్ కేసుగా నమోదు చేసి రెండు పోలీసు టీమ్‌లను రంగంలోకి దింపారు. సలావుద్దీన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



రోగులకు భోజనం వడ్డిస్తున్న ప్రముఖులు

పేదలకు సేవ చేస్తే అంతులేని ఆనందం

మంగళ్‌హట్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవచేయడంలోనే అంతులేని ఆనందం ఉంటుందని సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సోమవారం నాంపల్లిలోని ఎంఎన్‌జే ఖన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఆశ్రిత కల్ప ఆశ్రమంలో సత్యసాయిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన వంటశాలను ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ డీజీపీ, సత్యసాయి ట్రస్ట్ ఏపీ, తెలంగాణ కన్వీనర్ హెచ్‌జే దొరతో కలిసి ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకటరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశరరావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధిత చిన్నారుల కోసం ముస్లింలు రక్తదానం

అభినందించిన 'చిలుకూరు బాలాజీ' ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పీడీపీ సమీపంలోని మసీదు ఈ మహ్మద్ హుస్సేన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ హాజరయ్యారు. నగరంలోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో బాధిత చిన్నారుల కోసం రక్తదానం చేయడానికి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు ముస్తాబా హుస్సేన్ అస్కారీ తెలిపారు. హిందు, ముస్లింల మధ్య మత సామరస్యాన్ని పెంపొందించడానికి ఐదు సంవత్సరాలుగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, చిలుకూరు బాలాజీ దేవాలయం కలిసి పనిచేస్తున్నాయన్నారు. రంగరాజన్, సంస్థ నిర్వాహకులు ముస్తాబా హుస్సేన్ అస్కారీ ఇద్దరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో బ్యాచ్‌మెట్స్ కావడం విశేషం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక సేవ చేయడానికి ముందుకు రావాలన్నారు.



రక్తదానం చేసిన ముస్లింలకు పండ్లు, కూల్‌డ్రింక్ అందజేస్తున్న సీఎస్ రంగరాజన్

సులేమాన్‌నగర్‌లో....

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని సులేమాన్‌నగర్ 12 రబూల్ అవాల్ కే మజీదు ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి పాల్గొని రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో హజ్రత్ అల్‌హజ్ సఫీవుల్లా, అమేరి నూరి చిస్తీ ఖాద్రీ, సర్ఫరాజ్, టాంజీమ్, ముస్తాఫా పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

మంగళ్‌హట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో వాహనాల్లో పెట్రోల్ పోయించుకుంటుండగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితుల నెలకొన్నాయి. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం... పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన విజయ్ కుమార్ అతని కుటుంబ సభ్యులు మూడు ద్విచక్ర వాహనాలపై ఖైరతాబాద్‌లోని భారీ వినాయకున్ని చూసి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తున్నారు. నాంపల్లిచౌరస్తా వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లో తమ వాహనాల్లో పెట్రోల్ పోసుకునేందుకు క్యూలైన్‌లో నిలబడ్డాడు. కాగా విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనం హసన్(35) అనే వ్యక్తి వాహనానికి తాకింది. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. ఇద్దరూ అసభ్యపదజాలంతో దూషించుకున్నారు. దీంతో విజయ్‌కుమార్ భార్యపై కూడా హసన్ దాడి చేశాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హసన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో సెంట్రల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో సోమవారం రిహార్సల్స్ చేస్తున్న కళాకారులు

ప్రమాదంలో స్మార్ట్‌కార్డుల భద్రత

● నాసిరకం చైనీస్ చిప్‌లతో ముప్పు



మాట్లాడుతున్న కమల్ సోయి

పంజాగుట్ట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ స్మార్ట్ కార్డులలో నాసిరకం చైనీస్ చిప్‌లను వాడుతోందని, దీని వల్ల జాతీయ భద్రతకు ముప్పు తప్పదని రాహత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి హెచ్చరించారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని హోటల్ మెర్క్యూరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ కార్డుల పంపిణీని కలర్‌ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చారన్నారు. ఈ స్మార్ట్‌కార్డులు స్మార్ట్‌కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్(ఎస్‌సీఓఎస్‌టీఏ) నిబంధనలకు అనుగుణంగా లేవని తెలిపారు. ఈ స్మార్ట్‌కార్డ్‌లతో హ్యాకింగ్, డేటా లీక్, అనధికార ప్రవేశానికి ఆస్కారం ఉందని, వినియోగదారుల గోప్యత ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కలర్ ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డులపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్డులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రద్దు చేసిన రేషన్‌కార్డులను పునరుద్ధరించాలి

● డీలర్లకు నెల వేతనం ఇవ్వాలి

● మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లేఖ



మౌలాలి, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): కొత్తరేషన్ కార్డుల జారీతోపాటే రేషన్‌డీలర్ల సంక్షేమంపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పలు సూచనలు చేస్తూ సోమవారం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. నియోజకవర్గంలో 76 వేల రేషన్‌కార్డుదారులకు 105 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్నారు. ఈ సేవలకు సంబంధించిన పలు విషయాలు ఈ లేఖలో వివరించారు. హెచ్ఐవీ, తలసీవియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులతో పాటు కీమోథెరపీ చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధితులకు, డయాలసిస్ రోగులకు కొత్తరేషన్ కార్డులు అందజేయాలని సూచించారు. రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు స్థానికంగా నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, సదరం సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారికి 35 కేజీల బియ్యం అందించాలని, స్మార్ట్‌కార్డు ద్వారా సేవలు అందించాలని, రద్దు చేసినకార్డులను పునరుద్ధరణ చేయాలని ఆయన పేర్కొన్నారు.

రేషన్ డీలర్లకు రూ.20 వేల వేతనం ఇవ్వాలి

రేషన్‌డీలర్ల సంక్షేమానికి కూడా ఎమ్మెల్యే మర్రి పలు సూచనలు చేశారు. పట్టణ ప్రాంత డీలర్లకు నెలకు రూ.20 వేల వేతనం ఇవ్వాలని కోరారు. జీవిత, ప్రమాదబీమా పాలసీలను రేషన్‌డీలర్లకు కల్పించాలని పేర్కొన్నారు. గన్నీ బ్యాగుల లీకేజీలను నివారించాలని, ప్రజాపంపిణీ తేదీతో నిమిత్తం లేకుండా నెల రోజులు చేపట్టాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన షాపులను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

76 ఏళ్ల తర్వాత..!

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఈసారి వినాయక నిమజ్జనంకు ఓ ప్రత్యేకత ఉంది. సెప్టెంబర్ 17న ఈ నిమజ్జనం జరుగుతుంది. సెప్టెంబర్ 17కు తెలంగాణా చరిత్రలో ఓ ప్రత్యేకమైన చరిత్ర ఉందన్న సంగతి తెలిసిందే! 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చిన రోజు. అదే రోజు హైదరాబాద్ నగరంలో వినాయక నిమజ్జనం కూడా! అప్పట్లో హైదరాబాద్‌లో ఓ విధమైన కర్ఫ్యూ వాతావరణం ఉండడంతో వినాయక నిమజ్జనాలు వైభవంగా జరగలేదని, ఆనాటి పరిస్థితులను ఎరిగిన కొంతమంది చెబుతున్నారు. నిమజ్జనం కంటే కూడా నిజాం పాలన నుంచి విముక్తి లభిస్తుందన్న సంతోషమే ఎక్కువగా ప్రజలలో కనిపించిందని అంటున్నారు. సికింద్రాబాద్‌లో మాత్రం కొద్దిపాటి అలజడులు చెలరేగాయని గుర్తు చేసుకుంటున్నారు.



1948 సెప్టెంబర్ 17న ఏం జరిగిందంటే..

భారత సైన్యం విజయోత్సాహంతో హైదరాబాద్ నగరం వైపు దూసుకువస్తున్న క్రమంలో తలొగ్గక తప్పదన్న వాస్తవం గ్రహించి నిజాం ప్రధాని లాయక్ అలీతో పాటుగా మంత్రివర్గమంతా 1948 సెప్టెంబర్ 17న రాజీనామాలు చేశారు. వాటిని ఆమోదిస్తున్నట్లు నిజాం ప్రభుత్వం ప్రకటించింది. అయితే, సెప్టెంబర్ 17న అలజడులు సృష్టించడానికి ఆయుధాలను ఖాసిం రజ్వీ పంచాడు. ఊచకోత కోయడానికి ప్రణాళికలు రచించాడు. ఈ సంగతి తెలిసి, నవాబ్ దీన్ యార్ జంగ్ ఇలాంటి పనులు వద్దని వారించి, అల్లర్ల ప్రణాళికలను రద్దు చేయించాడు. ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు ఖాసిం రిజ్వీ దక్కన్ రేడియోలో తాను ఇచ్చిన హామీల మేరకు పనిచేయలేకపోయానని ఒప్పుకున్నాడు. హిందూ- ముస్లింల మధ్య ఉన్న సంప్రదాయ ఐక్యత కొనసాగాలని ఆకాంక్షించారు. హింసను ప్రేరేపించాలనుకున్న వ్యక్తే శాంతి వచనాలు చెప్పడం అతనిలో వచ్చిన మార్పుకు నిదర్శనంగా నిజాం ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేసిన మొహమ్మద్ హైదర్ తాను రాసిన '1948, ద ఫాల్ ఆఫ్ హైదరాబాద్' పుస్తకంలో ప్రస్తావించారు. జనరల్ చౌదరి, తమ బెటాలియన్‌తో సహా సెప్టెంబర్ 18న నగరానికి వచ్చారు. సెప్టెంబర్ 19న జనరల్ ఎల్ ఇద్రూస్ భారతసైన్యం ముందు లొంగిపోయాడు. దానితో పోలీసుచర్య ముగిసిందని ప్రకటించారు.

నిమజ్జనం ఇదే రోజు ఎందుకంటే..


నిమజ్జనం మంగళవారం చేస్తుండడంపై కొంతమంది సందేహాలను వెలిబుచ్చుతున్న వేళ డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి స్పష్టత ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ "చాంద్రమానం ప్రకారం మనం క్యాలెండర్ చూస్తాం, భాద్రపద మాసంలో శుక్లపక్ష చతుర్థిన వినాయక చవితి చేసుకుని, భాద్రపద మాసం శుక్లపక్ష చతుర్దశి నాడు నిమజ్జనం చేయాలని చెప్పుకుంటాం. మనకు ఇంగ్లిష్ క్యాలెండర్‌తో సంబంధం లేదు. కేవలం తెలుగు తిథిల ప్రకారమే వినాయక చవితి చేసుకుంటాం, తిథిల ప్రకారమే నిమజ్జనం చేస్తాం. అనంత పద్మనాభ చతుర్థశి అని, మనం భాద్రప్రద మాస శుక్లపక్ష చతుర్థశి నాడు నిమజ్జనం చేస్తాం. బాల గంగాధర్ తిలక్ ఈ వినాయక ఉత్సవాలను నిర్వహించడం మొదలుపెట్టినప్పటి నుంచి కూడా అనంత పద్మనాభ చతుర్థశి నాడు మాత్రమే నిమజ్జనం చేయడం జరుగుతుంది. కాబట్టి ఇదే పద్ధతి దేశం మొత్తం అనుసరిస్తుంటాం, ఈ కారణం చేతనే నిమజ్జనం 9 రోజులు, 11 రోజులు లేదా 12 రోజులలో కూడా రావొచ్చు. తిథిలతోనే సంబంధం కానీ, తేదితో సంబంధం లేదు. 76 సంవత్సరాలు లేదంటే 75 సంవత్సరాల తరువాత అదే రోజు వచ్చిందనేది యాదృశ్చికం. అలాగే వస్తుందని చెప్పలేము. చాంద్రమానం ప్రకారం మనకు ఒక సంవత్సరంలో 385 రోజులు వస్తాయి. ఒక్కోసారి 355 రోజులు వస్తాయి. అంటే మనకు సంవత్సరంలో అంగ్ల సంవత్సరంలోలా 365 రోజులు రావు. పోయిన సంవత్సరం మన తెలుగు క్యాలెండర్ ప్రకారం అధికమాసం వచ్చింది కాబట్టి 385 రోజులు వచ్చాయి. సోషల్ మీడియా యాక్టివ్ అయిన తరువాత యూట్యూబర్లు అతిశయోక్తిగా చెబుతున్నారు, అభూతకల్పనలు చేస్తున్నారు. తేదిలకు, భారతీయ పండుగలకు సంబంధం లేదు" అని వివరించారు.

హైదరాబాద్‌లో స్థిరపడ్డ మహారాష్ట్రియన్లు..

వాస్తవానికి వినాయక చవితి ఉత్సవాలను జాతీయోద్యమ స్ఫూర్తిని సామాన్యులలో రగిలించేందుకు బాలగంగాధర్ తిలక్ ప్రారంభించారు.. ఆ స్ఫూర్తితోనే హైదరాబాద్‌లో స్థిరపడ్డ మహారాష్ట్రియన్లు ఇక్కడ గణపతి నవరాత్రులను నిర్వహించడం ప్రారంభించారు. అప్పట్లో హైదరాబాద్ సిటీ అంటే పాతనగరం పరిసర ప్రాంతాల వరకే పరిమితం. నగరంలో చెరువులు, కుంటలు ఎక్కువగా ఉండేవి. మట్టి విగ్రహాలను వాటిలో కలిపేవారు. చవితి ఉత్సవాలను చదువుకున్న వారు ఎక్కువగా చేసేవారు. సరిగ్గా 76 సంవత్సరాల తర్వాత మళ్లీ సెప్టెంబర్ 17న వినాయక నిమజ్జనం రావడం యాదృశ్చికమే కానీ, విలీనం, విమోచనం, ప్రజాపాలన దినోత్సవం... పేరు ఏదైనా తెలంగాణా చరిత్రలో ఓ ప్రత్యేకమైన రోజుగా మాత్రం చెప్పాల్సిందే !

నిమజ్జనోత్సాహం

నగర వ్యాప్తంగా సోమవారం కొనసాగిన గణేశుల నిమజ్జన కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై నిజ్జనానికి తరలి వస్తున్న భారీ గణనాథుడు..



హుస్సేన్ సాగర్‌లో..

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద..



సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి తరలి వచ్చిన భక్తులు

మెడికల్ షాపులపై నియంత్రణేది?

● ఫార్మాసిస్టు ఉండరు ● ప్రిస్క్రిప్షన్ లేకున్నా మందులు ● నిబంధనలు బేఖాతర్

అర్హత గల ఫార్మాసిస్టు ఉండడు.. ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా మందుల అమ్మకాలు జరిగిపోతున్నాయి.. కడుపునొచ్చినా, కాలునొచ్చినా, నిద్ర రాకపోయినా, గర్భం దాల్చవద్దన్నా సరే మెడికల్ షాపునకు వెళితే చాలు అవసరమైన మందులను వారే ఇచ్చేస్తున్నారు. ఆ మందులను ఎలా వేసుకోవాలో కూడా వారే సూచిన్నారు. ఇచ్చిన మందులకు రికార్డులు ఉంటాయా..! అంటే అవి కనిపించవు. ఇటీవల ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు ;;నిర్వహిస్తున్న దాడుల్లో ఇలాంటి ఘటనలే అనేకం వెలుగు చూస్తున్నాయి.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి)



'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940' ప్రకారం ప్రతి మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టు ఉండాలి. బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, డీ ఫార్మసీ పూర్తి చేసి రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే ఈ మెడికల్ దుకాణాలను నిర్వహించాలి. కానీ, మెజారిటీ మెడికల్ దుకాణాల్లో ఫార్మాసిస్టులు ఉండడం లేదు. ఇంగ్లిష్ అక్షరాలు చదవగలిగిన వ్యక్తులను మెడికల్ దుకాణాల్లో నియమించుకుని అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మెడికల్ దుకాణాలకు అనుమతి ఇచ్చే సమయంలో ఔషధ నియంత్రణ అధికారులు ఫార్మాసిస్టు ఉన్నది, లేనిది పరిశీలించిన తరువాతే వారికి అనుమతి ఇవ్వాలి. ఏరియా ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేస్తున్న సమయంలో కూడా ఫార్మాసిస్టులు ఉన్నారా.. లేరా అనే అంశాలను పరిశీలించాలి. లేకపోతే షోకాజ్ నోటీసు జారీ చేసే అవకాశముంది.

ఎవరొచ్చి అడిగినా..

డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌పై రాసిచ్చిన మందులను మాత్రమే మెడికల్ షాపుల నిర్వాహకులు ఇవ్వాలి. కానీ, ప్రస్తుతం ఏ మెడికల్ షాపు నిర్వహకుడు ఈ నిబంధనను పాటించడం లేదు. రోగి కానీ, అతని కుటుంబ సభ్యులు వచ్చి ఫలాన మందులు ఎన్ని కావాలంటే అన్ని ఇచ్చేస్తున్నారు. ముఖ్యంగా కార్డియాక్, సైక్రియాట్రిక్స్, డయాబెటిక్, బీపీ, స్లీపింగ్, యూరిన్ ఇన్‌ఫెక్షన్ తదితర 3 నుంచి 4 రకాల మందులకు డాక్టర్ రాయనిదే మెడికల్ షాపు నిర్వాహకులు రోగులకు ఇవ్వొద్దని ఔషధ నియంత్రణ అధికారి ఒకరు తెలిపారు. రోగికి రాసే మందుల్లో హై డెస్, లో డోస్ ఉంటాయి. రోగి వయస్సును, శరీరతత్వం, ఇతర వ్యాధుల ఆధారంగా చేసుకుని వైద్యులు డోసులను నిర్ణయిస్తారని తెలిపారు. రోగి ఏది అడిగితే అది ఇస్తే సదరు రోగిపై మందులు దుష్ప్రభావం చూపే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.

ఓటీఎస్ మందులను మాత్రమే..

ఓవర్ ది కౌంటర్ డ్రగ్స్ (ఓటీఎస్) మందులను మాత్రమే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా మెడికల్ షాపుల్లో శిక్షణ పొందిన ఫార్మాసిస్టులు ఇవ్వొచ్చు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులకు ఒక రోజు వరకు మందులు ఇవ్వొచ్చు. సదరు రోగి రెండోసారి వస్తే ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వొద్దు. నిబంధనల ప్రకారం షెడ్యూల్-హెచ్, షెడ్యూల్-హెచ్1 రకాల మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించొద్దని అధికారులు పేర్కొన్నారు. బీపీ, షుగర్, కార్డియాక్, న్యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, ప్రెగ్నెన్సీ, అబార్షన్ వంటి షెడ్యూల్‌కు సంబంధించిన వెయ్యి రకాల మందులను వైద్యుల సూచనలు, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దు. ప్రిస్క్రిప్షన్‌పై డాక్టర్ ఎన్ని మందులు రాశాడో ఆ మేరకే ఇవ్వాలి. ఆతరువాత రోగి మరోసారి వచ్చి వాటిని కావాలని అడిగితే ఇవ్వొద్దు. డాక్టర్ మరోసారి రాస్తేనే ఇవ్వాలి. అంతే కాకుండా ప్రిస్క్రిప్షన్‌పై మెడికల్ షాపు స్టాంప్ వేయాలి. రోగి సెల్ నంబర్, చిరునామా కూడా బిల్లుపై పొందుపర్చాల్సి ఉంటుంది.

సమన్వయ లోపం..

(5వ పేజీ తరువాయి)

ఇందిరాపార్కు, లక్డీకాపూల్, బషీర్‌బాగ్ తదితర మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కార్యాలయాలు, ఇతర పనుల నిమిత్తం వెళ్లాల్సిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

వ్యూహం అమలులో పోలీసుల వైఫల్యం

సాగర తీరంలో 38 క్రేన్లు ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ తెలిపింది. తొమ్మిది రోజులు పూర్తవడం, ఆదివారం సెలవు కావడంతో వేల సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం జరిగింది. అందుకు తగ్గట్టుగా వ్యూహం అమలు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు కాగా, కొందరు పోలీసులు నిమజ్జన ఆంక్షలను సొమ్ము చేసుకుంటున్నారు. డీజే, బ్యాండ్ మేళాలు, ఇతర సౌండ్ సిస్టమ్ వినియోగించవద్దన్న నిబంధనలను అక్రమార్జనకు వినియోగించుకుంటున్నారు. గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో వినాయక ఊరేగింపుల పేరిట వసూళ్లు సాధారణమైనట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.



కూకట్‌పల్లి రంగదాముని చెరువులో గణేశుల నిమజ్జనం

35 లక్ష తాగునీటి ప్యాకెట్లు

(5వ పేజీ తరువాయి)

వివిధ రకాల బోట్లను అందుబాటులో ఉంచింది. సాగర్‌లో ప్రమాదాలను నివారించేందుకు 8 మంది గజ ఈతగాళ్లను కూడా విధుల్లో ఉంచుతోంది.

చెరువులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 7 వేల మంది పోలీసులతో నిమజ్జన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. సోమవారం ఆయన రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌లోని పత్తికుంట చెరువును సందర్శించారు. ఏర్పాట్ల గురించి పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట రాజేంద్రనగర్ అదనపు డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ తుల శ్రీనివాస్ ఇతర అధికారులు ఉన్నారు.

నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి

● గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

నార్సింగ్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుండెపోటుతో మృతిచెందారు. అల్కాపురి కాలనీలో జరిగిన నిమజ్జన వేడుకల్లో శ్యామ్‌ప్రసాద్ (32) స్నేహితులతో ఉల్లాసంగా గడిపాడు. అనంతరం ఊరేగింపులో నృత్యాలు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్యామ్‌ప్రసాద్ స్వస్థలం కర్నాటకలోని రాయచూరు జిల్లా. మొన్నటి వరకు బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పనిచేశారు.

రాచకొండ సీపీ పరిశీలన

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చెరువుల వద్ద ఏర్పాట్లను సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. నిమజ్జనం జరుగుతున్న కాప్రా, సరూర్‌నగర్ చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను, బందోబస్తును పర్యవేక్షించారు. ఇతర ప్రభుత్వశాఖలతో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీలు ప్రవీణ్‌కుమార్, కరుణాకర్, అరవింద్ బాబు, శ్రీనివాసులుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లు బందోబస్తును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు

కలర్ పేపర్ షాట్స్ నిర్మూలనపై అవగాహన

● నిమజ్జన కార్యక్రమాల్లో బ్యానర్లు ఏర్పాటు

● ఆధునిక యంత్రాలతో కలర్ పేపర్‌ల తొలగింపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనోత్సవంలో కలర్ పేపర్ షాట్స్ వెదజల్లకుండా అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. 'కలర్ పేపర్ షాట్స్ నిర్మూలిద్దాం.. శానిటేషన్ కార్మికులకు సహకరిద్దాం' అంటూ జీహెచ్ఎంసీ సిబ్బంది బ్యానర్లు ఏర్పాటు చేశారు. శోభయాత్రలో నిర్వాహకులు పండుగ వాతావరణ కలిగించేందుకు కలర్ పేపర్ షాట్స్ ఎక్కువ చేయడం మూలంగా రోడ్లపై పేపర్ శానిటేషన్ చేసే కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. చెత్తను తొలగించేందుకు కార్పొరేట్ కంపెనీలు ఉపయోగించే స్వీపింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా నెక్లెస్ రోడ్డు ప్రాంతంలో కలర్ పేపర్ తీసేందుకు యంత్రాలను వినియోగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నిర్ణయించారు. కలర్‌పేపర్ షాట్స్ చల్లే విషయంలో జీహెచ్ఎంసీ విజ్ఞప్తిని భక్తులు ఆచరించాలని కమిషనర్ కోరారు.



కలర్‌పేపర్స్‌ను ఏరివేస్తున్న అధునాతన స్వీపింగ్ మెషీన్

మధ్యాహ్నం 1.30లోపే
ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం

(5వ పేజీ తరువాయి)

పనులు చేస్తూనే మరోవైపు షెడ్డు పైకప్పు, కర్రలను తొలగించారు. సోమవారం రాత్రి 9.45 గంటలకు కలశ పూజ నిర్వహించి భారీ గణపతిని ట్రాలీపైకి చేర్చారు.

భక్తుల తీవ్ర నిరాశ

ఖైరతాబాద్ మహా గణపతి దర్శనం లభించక భక్తులు తీవ్ర నిరాశ చెందారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసులు అనుమతించకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొందరు ప్రాధేయపడినా అనుమతించకపోవడంతో పలుమార్లు పోలీసులు, భక్తుల మధ్య వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి.

గణపతిని దర్శించుకున్న మంత్రి పొన్నం, వీహెచ్

ఖైరతాబాద్ మహాగణపతిని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు దర్శించుకున్నారు. పోలీసులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడి నిమజ్జన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మరమ్మతులు మానేసి..
మ్యాన్‌హోల్‌లోకి మంచినీళ్లు వదిలేసి..!

● వాటర్ బోర్డు అధికారుల నిర్వాకం

● అయ్యప్ప సొసైటీలో లక్షల లీటర్ల నీరు వృథా

● అధ్వాన్నంగా మారిన వీధులు, రోడ్లు

● నాలుగు నెలలుగా పట్టించుకోని వాటర్‌బోర్డు

వందల కిలోమీటర్ల దూరం నుంచి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తీసుకొస్తున్న కృష్ణా జలాలు వృథాగా పోతున్నాయి. నీటి లీకేజీలను అరికట్టాల్సిన వాటర్‌బోర్డు అధికారులు నాలుగు నెలలుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తాగునీటిని మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో గల ఓ వీధిలోని మ్యాన్‌హోల్‌లోకి మళ్లించారు. దీంతో లక్షల లీటర్ల నీళ్లు వృథాగా పోతున్నాయి.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి)



రోడ్లపై మ్యాన్‌హోల్ కలుస్తున్న కృష్ణా జలాలు

హైదరాబాద్ మహా నగరంలోని అత్యధిక ప్రాంతాల ప్రజల దాహార్తిని కృష్ణా జలాలు తీరుస్తున్నాయి. నాగార్జునసాగర్ నుంచి రోజూ మూడు ఫేజ్‌ల్లో 1250మిలియన్ లీటర్ల నీటిని నగరానికి తీసుకొచ్చి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో మిలియన్ లీటర్‌కు దాదాపు రూ.40కి పైగా వాటర్ బోర్డు ఖర్చు చేస్తోంది. కృష్ణా ఫేజ్-2లో భాగంగా రాజేంద్రనగర్, అత్తాపూర్ మీదుగా జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో గల డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్‌కు రోజూ నీరు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి ప్రశాసన్‌నగర్ రిజర్వాయర్ పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నారు.

అయ్యప్ప సొసైటీలో లక్షల లీటర్లు వృథా

ప్రశాసన్‌నగర్ నుంచి హైటెక్ సిటీ హెచ్ఐసీసీకి, అయ్యప్ప సొసైటీకి దాదాపు 900 వయా డక్టిపీఎస్సీ పైపులైన్‌ను 20ఏళ్ల క్రితమే వేశారు. ఈ పైపులైన్‌పై అయ్యప్ప సొసైటీ తర్వాత ఎగువ ప్రాంతం ఉండడంతో ఒత్తిడి పెరుగుతోంది. దీంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. నాలుగు నెలల క్రితం అయ్యప్ప సొసైటీలో ఈ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడగా.. సాధారణ మరమ్మతులు చేసి వదిలేశారు. ఆ వెంటనే మరో రెండు ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. అయ్యప్ప సొసైటీలో రోడ్డు నంబర్ 9లో వాల్ దగ్గర పైప్‌లైన్ నుంచి నీరు లీకవుతోంది. దీంతో అయ్యప్ప సొసైటీలోని వీధులు, రోడ్లపై కృష్ణాజలాలు పరుగులు తీస్తుండడంతో వీధులు, రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో అయ్యప్ప సొసైటీలో సరిపోను తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు.


సీఎం ఇంటికి నీటి సరఫరా ఆగుతుందనేనా..

ప్రశాసన్‌నగర్ నుంచి హైటెక్స్ వైపు గల ఈ పైపులైన్ ద్వారా జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని వాటర్‌బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేస్తే సీఎం నివాసంతో పాటు ఆయా ప్రాంతాల వాసులకు ఇబ్బందులు తలెత్తుతాయని అధికులు చెబుతున్నారు. సీఎం నివాసం పేరుతో నాలుగు నెలలుగా వాటర్‌బోర్డు అధికారులు లక్షల లీటర్ల తాగునీటిని వృథాగా రోడ్లపై, మ్యాన్‌హోల్‌లో వదిలేస్తున్నారు.

కృష్ణా జలాలను మ్యాన్‌హోల్‌లోకి..

అయ్యప్ప సొసైటీలో రోడ్ నంబర్ 5- 6 మధ్యలో పైపులైన్ లీకేజీ ఏర్పడింది. కృష్ణా జలాలు పెద్దఎత్తున వీధుల్లో పరుగులు తీస్తున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు వాటర్‌బోర్డు అధికారులకు తెలిపారు. అక్కడికి వచ్చి పరిశీలించిన అధికారులు వృథాగా పోతున్న కృష్ణా జలాలను కట్టడి చేయలేదు. వీధుల్లో, రోడ్లపై తాగునీరు పరుగులు తీయకుండా మ్యాన్‌హోల్‌లోకి మళ్లించారు. నాలుగు నెలలుగా కృష్ణా జలాలు మ్యాన్‌హోల్‌లోకి వృథాగా పోతున్నాయి. 24గంటల పాటు నీటిని నిలిపివేసి పైపులైన్ మరమ్మతులు చేసేందుకు కూడా నాలుగు నెలలుగా వాటర్‌బోర్డు అధికారులకు తీరిక దొరకడం లేదు. స్థానికులు నీళ్లు వృథాగా పోతున్నాయని వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ సెంటర్‌కు ఫిర్యాదు చేయగానే వెంటనే టోకెన్ నంబర్ ఇస్తున్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని మెసేజ్‌లో పేర్కొంటున్నారు. కానీ, రెండు రోజుల తర్వాత సమస్య పరిష్కారం చేయకుండానే ఫిర్యాదు క్లోజ్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్ 9
మంగళవారం • 17 సెప్టెంబరు 2024



కంటి వ్యాధులను సకాలంలో కనిపెట్టే పరీక్షలు చవకలో అందుబాటులోకొచ్చినప్పుడే వాటిని అరికట్టడం సాధ్యపడుతుంది. ఆ దిశగా సరికొత్త పరిశోధనలకు పూనుకున్న ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి శాస్త్రవేత్తలు, తాజాగా కొన్ని పరికరాలను ఆవిష్కరించారు. వాటి పనితీరు, ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

పిల్లలు, పెద్దలు కలిగి ఉండే వేర్వేరు కంటి సమస్యలకు వేర్వేరు నిర్ధారణా ప్రక్రియలుంటాయి. ఇందుకోసం వాడుకలో ఉన్న పరికరాలు ఖరీదైనవీ, పరీక్షలు ఖర్చుతో కూడుకున్నవీ అయినప్పుడు అందరూ వాటిని వినియోగించుకోలేకపోతూ ఉంటారు. ఫలితంగా కంటి సమస్యలను సకాలంలో కనిపెట్టలేక, సమస్య తీవ్రత పెరిగి కంటిచూపు క్షీణించే పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటారు. ఈ ఇబ్బందులను అధిగమించాలంటే తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో, సమస్యను కచ్చితంగా కనిపెట్టే పరికరాలు అందుబాటులోకి రావాలి. అలాంటి పరికరాలను ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు వాటి గురించి ఇలా వివరిస్తున్నారు.

విలువైన కళ్ల కోసం చవకైన పరికరాలు



గ్లాకోమాను అరికట్టే 'ఓం'

తిరిగి సరిదిద్దలేనంతగా కంటిని దెబ్బతీసే సమస్య గ్లాకోమా! క్రమం తప్పకుండా పరీక్ష చేయించుకుంటూ, కంటి వైద్యుల కనుసన్నల్లో నడుచుకోవడం మినహా గ్లాకోమాను నియంత్రించే ఇతరత్రా మార్గాలే లేవు. అయితే తరచూ వైద్యులను కలవలేని వాళ్లు, పెద్దలు, దివ్యాంగులు, ఐసియుల్లో ఉన్నవాళ్లు క్రమం తప్పకుండా గ్లాకోమా పరీక్షలు చేయించుకోవడం సాధ్యపడదు. కానీ తాజాగా రూపొందిన ఓమ్ (ఆర్డర్ ఆఫ్ మ్యాగ్నిట్యూడ్) వీఆర్ హెడ్‌సెట్, పరీక్షకు అనుకూలంగా ఉండడంతో పాటు, సులువుగా ఎక్కడికైనా ...కువెళ్లగలిగే సౌలభ్యాన్ని కూడా కలిగి ఉంది. పైగా కేవలం పది నిమి...ల వ్యవధిలో సమస్యను కచ్చితంగా అంచనా వేయగలుగుతుంది. ఈ పరీక్ష ఖర్చు కేవలం 50 రూపాయలే!


డాక్టర్ శిరీష

స్పార్క్‌తో... మయోపియాకు అడ్డుకట్ట



పిల్లలను వేధించే కంటి సమస్యల్లో మయోపియా ఒకటి. ఐదు నుంచి 15 ఏళ్ల పిల్లల్లో తలెత్తే ఈ సమస్యలో దగ్గరి దృష్టి మెరుగ్గానే ఉన్నప్పటికీ, దూర దృష్టి తక్కువగా ఉండడంతో పిల్లలు బోర్డు మీద రాసి ఉన్న అక్షరాలను, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను చూడలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. ఈ సమస్య తీవ్రత ఇటీవలి కాలంలో ఎంతో పెరిగింది. ఇంతకు ముందు వంద మంది పిల్లల్లో ఐదుగురికి ఈ సమస్య ఉంటే, ప్రస్తుతం ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకర్లో కనిపిస్తోంది. ఇందుకు కారణం గ్యాడ్జెట్స్ వాడకం పెరగడమే! వాటిని కనిపెట్టే సంప్రదాయ విధానాలు ముందున ఉంచీ ఉన్నప్పటికీ, కళ్లద్దాలతో సరిపెట్టే పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు కంటి మధ్యలోనే (సెంట్రల్ రిఫ్రాక్షన్) కాకుండా, ఇరువైపులా (పెరిఫెరల్ రిఫ్రాక్షన్) పవర్‌లను కనిపెట్టే పరికరాన్ని మేం సృష్టించాం. కంటికి ఇరువైపులా పవర్‌లను పరీక్షించడానికి మన దేశంలో కనీసం పది లక్షల రూపాయలు ఖర్చవుతాయి. కాబట్టి ఈ పరీక్ష అందరికీ సాధ్యపడకపోవచ్చు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు, సమస్య ఉందని నిర్ధారించినప్పుడు, దాన్ని పెరగకుండా నియంత్రించే పరికరం స్పార్క్ (సింప్లిఫైడ్ పెరిఫెరల్ యాన్సిలరీ రిఫ్రాక్షన్)ను రూపొందించాం. మయోపతి కేసుల తగ్గుదలకూ, కచ్చితమైన చికిత్స అంచనాకూ, స్పార్క్ పరికరం ఎంతో బాగా సహాయపడుతుంది. మయోపియాకు ఇప్పటివరకూ కంటి చుక్కలు, కాంటాక్ట్‌లెన్స్‌లు, కళ్లజోళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే కంటి మధ్యలో, పక్కల్లో ఉన్న పవర్ ఆధారంగా కచ్చితమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోగలిగితే, ఖరీదైన కాంటాక్ట్‌లెన్స్‌లు, కళ్లజోళ్ల అవసరం తప్పుతుంది.


డాక్టర్ పవన్

బేబీస్ కోసం 'బావీస్'



కంటి చూపు ఒక్కటే సరిపోదు. దాన్లో కలర్ విజన్, త్రీడి విజన్, సైడ్ విజన్ లాంటివి కూడా సమర్థంగా ఉండాలి. మరీ ముఖ్యంగా పసికందుల్లో ఈ లక్షణాలను కనిపెట్టడం కోసం ఇంతకు ముందు, టార్చ్‌లైట్ కళ్లలోకి వేసి, కంటి కదలికలను గమనించేవారు. అయితే ఈ పరీక్షతో పసికందుల కంటిచూపును మాత్రమే నిర్ధారించగలిగేవారు తప్ప, ఆ చూపు ఎంత స్పష్టంగా కనిపెట్టే వీలుండేది కాదు. ప్రస్తుతం ఆవిష్కరణకు నోచుకున్న పరికరం పసికందులు కళ్లు, కంటిచూపుకు సంబంధించిన కీలక సమాచారాన్ని అందించగలుగుతుంది. పసికందులు వెలుగుకు మాత్రమే స్పందిస్తూ కళ్లను తిప్పగలుగుతారు కాబట్టి ఆ కదలికల ఆధారంగా, పసికందు దృష్టి సారించిన లక్ష్యం ఆధారంగా వారి కంటి చూపును కచ్చితంగా అంచనా వేయడం కోసం తాజాగా 'బావీస్' (బేబీ విజన్ స్క్రీనర్) పరికరాన్ని ఆవిష్కరించాం. డోమ్ లాంటి ఈ పరికరంలో ఒక ఎల్ఇడి లేదా బహుళ ఎల్ఇడిలను వెలిగించి, పసికందులు కాంతి ప్రసరించే దిశను కనిపెట్టగలుగుతున్నదీ లేనిదీ వైద్యులు తెలుసుకోగలుగుతారు. ఈ ప్రక్రియలో కాంతిని కనిపెట్టడం కోసం పసికందులు తీసుకునే సమయాన్ని అంచనా వేయవచ్చు. కొన్ని సందర్భాల్లో, హైపోగ్లైసెమిక్ ప్రభావానికి లోనైన పసికందులు బ్రెయిన్ డ్యామేజీతో పుడుతూ ఉంటారు. ఈ పిల్లలు పెరిగే క్రమంలో ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటారు. కాబట్టి బావీస్‌తో ఇలాంటి సమస్యను ప్రారంభంలో కనిపెట్టవచ్చు. బావీస్‌లో ఉండే ఇన్‌ఫ్రారెడ్ కెమెరా సహాయంతో, పసికందుల్లో క్యాటరాక్ట్, మీడియా ఒపాసిటీ సమస్యలను కూడా కనిపెట్టవచ్చు. అలాగే పసికందుల్లో మెల్ల కళ్లను కూడా బావీస్‌తో కనిపెట్టవచ్చు.


డాక్టర్ ప్రేమ నందిని

ఎల్‌వి ప్రసాద్ నేత్రాలయం, దేశ వ్యాప్త నేత్ర సంరక్షణ రంగంలో, వినూత్న విధానాలకూ, నిబద్ధతకూ పేరు పొందింది. పరిశోధన, ఆవిష్కరణలపరంగా కంటి సంరక్షణల విధానాల అభివృద్ధిలో గణనీయమైన పురోగతిని సాధించింది. **సెంటర్ ఫర్ టెక్నాలజీ ఇన్నొవేషన్ డైరెక్టర్, రమేష్ కెకునయా** సారధ్యంలో వైద్యులు, డిజైనర్లు, ఇంజనీర్ల బృందం, కంటి సమస్యల పరిష్కారం, నియంత్రణల పరంగా అత్యాధునిక సాంకేతికతల ఆధారంగా నిరంతరం కొత్త పరికరాల సృష్టి కోసం కృషి చేస్తూ ఉండడం విశేషం.



మెదడు పనితీరును కనిపెట్టే... ప్యూపిల్ ఎన్





కాంతి ప్రభావానికి కదిలే, కంటి కదలికల ఆధారంగా మెదడు పనితీరును పసిగట్టే పరికరమే, ప్యూపిల్ ఎన్. ప్రమాదాల బారిన పడినవాళ్లు, ఇంటెన్సివ్ కేర్‌కు చేరుకున్న బాధితులు, క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితులకు లోనైన వాళ్లలో మెదడు పనితీరు వేగంగా క్షీణిస్తూ ఉంటుంది. క్షీణించిన మెదడు పనితీరును సత్వరం కనిపెట్టడం ద్వారా పరిస్థితి మరింత దిగజారకుండా కచ్చితమైన చికిత్సను ఆశ్రయించడంలో ఈ పరికరం కీలకంగా మారుతుంది. ప్రస్తుతం న్యూరోలైట్స్, న్యూరోఆప్టిక్ ప్యూపిలోమీటర్ లాంటి 6 నుంచి 7 లక్షల ధర పలికే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా ఈ సౌలభ్యం అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండకపోవచ్చు. తాజాగా రూపొందుతున్న ప్యూపిల్ ఎన్ కేవలం లక్ష రూపాయలకే అందుబాటులోకి రాబోతోంది.


డాక్టర్ శ్రీకాంత్ భరద్వాజ్

అవగాహన

ఆరోగ్యం కోసం వీటికి దూరం

ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని తినకూడని పదార్థాల చిట్టాను విడుదల చేసింది. అవేంటంటే...

చక్కెర: ఊబకాయం, మధుమేహాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్న చక్కెర వాడకాన్ని వీలైనంత తగ్గించాలి. చక్కెరతో కాలేయం, పిత్తాశయం, జీర్ణ వ్యవస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడుతుంది. కాబట్టి చక్కెర వాడకాన్ని మానేయడం అన్ని విధాలా శ్రేయస్కరం.

వేపుళ్లు: డీప్ ఫ్రైలతో అధిక క్యాలరీలు, ఉప్పు, అనారోగ్యకరమైన కొవ్వులు శరీరంలోకి చేరతాయి. ఇవి గుండెజబ్బులకు దారి తీస్తాయి కాబట్టి నూనెలో వేయించే స్నాక్స్ దూరంగా ఉండాలి.

పాస్తా, బ్రెడ్: ప్రపంచంలోని అత్యంత అనారోగ్యకరమైన ఆహారపదార్థాలు, పాస్తా, బ్రెడ్. ఈ రిఫైన్డ్ కార్బొహైడ్రేట్స్ తెల్ల బ్రెడ్, పాస్తా, చక్కెరతో తయారయ్యే స్నాక్స్‌లలో ఉంటాయి. ఇవి రక్తంలోని చక్కెరను పెంచుతాయి. కాబట్టి వీటికి బదులుగా పొట్టు తీయని ధాన్యాలు, వాటితో తయారయ్యే పిండ్లతో తయారైన పదార్థాలనే ఎంచుకోవాలి.

కాఫీ: కాఫీతో కెఫీన్ ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. దీంతో తల నొప్పి, డిప్రెషన్, నిద్రలేమి, అధిక రక్త పోటు, అలసటలు వేధిస్తాయి. కాబట్టి కాఫీని పరిమితంగా తీసుకోవాలి.



ఉప్పు: ఉప్పు లేని ఆహారం తినలేం! అలాగని అవసరానికి మించి తింటే, హైపర్‌టెన్షన్, హృద్రోగ వ్యాధులు తప్పవు. కాబట్టి వీలైనంత తగ్గించి వాడుకోవాలి. ఉప్పుతో తయారయ్యే స్నాక్స్ తినడం మానుకోవాలి. కెచప్, నిల్వ పచ్చళ్లు, సాల్టెడ్ చిప్స్ లాంటివి మానేయాలి.

పొటాటో చిప్స్: పొటాటో చిప్స్, మైక్రోవేవ్ పాప్‌కార్న్‌తో అనారోగ్యకరమైన కొవ్వులు, క్యాలరీలు ఎక్కువ. కాబట్టి ఇవి తినకూడదు.

చీజ్: చీజ్‌లో శాచురేటెడ్ ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి.

దోమ కాటుకు విరుగుడు ఇలా...

దోమలు కుడితే దురదలు, దద్దుర్లు సహజం. ఈ అసౌకర్యాలను పరిష్కరించుకోడానికి కొన్ని చిట్కాలున్నాయి. అవేంటంటే...

ఐస్ ప్యాక్: దురద, దద్దుర్లు తలెత్తిన ప్రదేశంలో ఐదు నుంచి పది నిమిషాల పాటు ఐస్‌ప్యాక్ పెట్టుకుంటే చర్మం అడుగున ఉండే రక్తనాళాలు కుంచించుకుపోయి దురద తగ్గుతుంది.

యాపిల్ సెడార్ వెనిగర్: దురద ఉన్న చోట యాపిల్ సిడార్ వెనిగర్ అద్దుకుంటే, దీని క్షార గుణం వాపు, దురదలను మటుమాయం చేస్తుంది.

టూత్‌పేస్ట్: మెంథాల్, పెప్పర్‌మింట్ ఫ్లేవర్‌తో కూడిన టూత్‌పేస్ట్‌ను కూడా దోమ కుట్టిన ప్రదేశంలో అద్దుకోవచ్చు. కూలింగ్ ప్రభావాన్ని కలిగి ఉండే ఈ టూత్‌పేస్ట్‌లు దురద నుంచి తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి.



ఉల్లిపాయ: చక్రాల్లా తరిగి దోమ కుట్టిన ప్రదేశంలో రుద్దుకోవాలి. దీన్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు దోమ కాటు దురదలను తగ్గిస్తాయి.

తులసి: తులసిలో కాంఫర్, థైమాల్ ఉంటాయి. దురదను తగ్గించుకోవడం కోసం తులసి ఆకులను మెత్తగా దంచి దోమలు కుట్టిన చోట పట్టు వేయాలి.

వెల్లుల్లి: వెల్లుల్లి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియాల్ గుణాలను కలిగి ఉంటుంది. కాబట్టి దురద నుంచి ఉపశమనం దక్కుతుంది. అందుకోసం వెల్లుల్లిని దంచి, కొద్దిగా కొబ్బరినూనె జోడించి, దోమలు కుట్టిన ప్రదేశంలో రుద్దుకోవాలి.

సర్జరీ తర్వాత... ఒక్క రోజులో ఇంటికి

కీలు మార్పిడి కోసం రోజుల తరబడి ఆస్పత్రుల్లో గడిపే రోజులకు కాలం చెల్లింది. ఒక్క రోజులో కీలు మార్పిడి చేయించుకుని, ఇంటికెళ్లిపోగలిగే ఆధునిక సర్జరీలు అందుబాటులోకొచ్చాయి. ఆ సర్జరీలు, వాటికి ఉండవలసిన అర్హతల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

కీలు మార్పిడి



సర్జరీ తదనంతర తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉంటే, ఖర్చు కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ ఇబ్బందుల నుంచి తప్పించుకోవడం కోసం, రోగి త్వరగా కోలుకుని, దైనందిన జీవితానికి అలవాటు పడిపోవడం కోసం 24 గంటల్లో కీలు మార్పిడి చేయించుకుని, నడుచుకుంటూ ఇంటికి వెళ్లగలిగే, డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు అందుబాటులో కొచ్చాయి. పూర్తి కీలు మార్పిడి, పాక్షిక కీలు మార్పిడి, డైరెక్ట్ యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్, రోబోటిక్ అసెస్టెడ్ సర్జరీ మొదలైన సింగిల్ సైడ్ (ఒక కాలి సర్జరీ) సర్జరీలకు రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండవలసిన అవసరం లేదు. ఇవన్నీ చిన్న కోతతో పూర్తయ్యే సర్జరీలు కాబట్టి 24 గంటల్లోనే నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోవచ్చు. ఉదాహరణకు తుంటి సర్జరీ వెనక నుంచి, పక్క నుంచి ముందు నుంచి చేయవచ్చు. డైరెక్ట్ యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్‌లో కండరాలను కత్తిరించకుండా, చిన్న కోతతో సర్జరీ చేయడం జరుగుతుంది. ఈ సర్జరీ చేయించుకున్న వాళ్లు తదనంతరం ఎలాంటి నియమాలు పాటించవలసిన అవసరం లేదు. వీళ్లు నేల మీద కూర్చోవచ్చు. పద్మాసనం వేయవచ్చు. ఈ తరహా సర్జరీలు కూడా డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల కోవలోకే వస్తాయి. కొవిడ్ తర్వాత ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్‌కు గురయ్యే యువత సంఖ్య కూడా పెరిగింది. వీళ్లలో తుంటి ఎముక దెబ్బతిన్నప్పుడు సర్జరీతో మార్పిడి చేయవలసి వస్తుంది. ఇది కూడా డే కేర్ సర్జరీ కోవకే చెందుతుంది.

సూటయ్యే వారికే...

రెండు వైపులా రెండు కాళ్లకూ సర్జరీ చేసినప్పుడు, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం కలిగి ఉన్న వ్యక్తులకు కీలు మార్పిడి సర్జరీలు చేసినప్పుడు, వాళ్లను ఒక్క రోజులోనే ఇంటికి పంపించడం సాధ్యపడదు. ఇవేవీ లేకుండా, ఆర్థ్రయిటిస్ ఉండి, సింగిల్ జాయింట్ మార్పిడి చేయించుకోవాలనుకున్నవాళ్లు డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీని ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సర్జరీ తర్వాత నొప్పిని కొంత మేరకు తట్టుకోగలిగి ఉండి, ఇతరుల సహాయం లేకుండా బాత్రూమ్‌కు వెళ్లి రాగలిగి, కుర్చీలో కూర్చోగలిగే వ్యక్తులను మాత్రమే వైద్యులు ఈ తరహా సర్జరీలకు ఎంచుకుంటారు. అయితే అందుకోసం సర్జరీకి ముందే వైద్యుల బృందం రోగికి పెయిన్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీలను నేర్పించడంతో పాటు సర్జరీ కోసం చిన్న కోతతో కూడిన రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలను ప్లాన్ చేస్తుంది.

బహుళ ప్రయోజనాలు

ఆస్పత్రిలో ఎక్కువ రోజుల పాటు వైద్యులు పర్యవేక్షణలో ఉండి, పూర్తిగా కోలుకున్న తర్వాతే ఇంటికి వెళ్లడం మేలనే అపోహలు సర్వత్రా ఉంటాయి. కానీ ఆస్పత్రి నుంచి ఎంత వీలైతే అంత త్వరగా డిశ్చార్జ్ అయిపోయి, ఇంటికి చేరుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. నిజానికి రీప్లేస్‌మెంట్ సర్జరీల విషయంలో సర్జరీ తర్వాత వైద్యుల పర్యవేక్షణ అవసరం ఉండదు. అన్ని విధాలా సూట్ అయ్యే రోగులను ఇలాంటి సర్జరీలకు ఎంచుకుంటారు కాబట్టి సర్జరీ తదనంతర సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండవు. పైగా ఒక్క రోజులో డిశ్చార్జ్ అయిపోవడం వల్ల, ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు ఉండవు. ఆస్పత్రి ఖర్చులు కూడా తగ్గుతాయి. ఒక్క రోజులో సర్జరీ చేయించుకుని ఇంటికి చేరుకోవడంతో రోగుల్లో ఆత్మవిశ్వాసం, కోలుకునే వేగం పెరుగుతాయి. సర్జరీ తదనంతర నొప్పి విషయంలో కూడా వైద్యులు, ముందుగానే రోగుల స్వభావాన్ని అంచనా వేస్తారు. పెయిన్ టాలరెన్స్ స్కోర్స్ ఆధారంగా రోగుల వ్యక్తిగత స్వభావాలను బట్టి సర్జరీకి తగిన వ్యక్తులనే వైద్యులు ఎంచుకుంటారు. కాబట్టి ఆస్పత్రిలో రీఎడ్మిషన్ సమస్య తప్పుతుంది.


డాక్టర్ కృష్ణ కిరణ్
ఆర్థోపెడిక్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

గుడ్ లైఫ్

ఈ స్లీప్ హైజీన్ సూపర్

సాయంత్రం ఐదున్నరకు చివరి భోజనం చేసి, పెందలాడే నిద్రపోవడం అలవాటు చేసుకున్న తర్వాత, తాను రెట్టింపు హుషారుగా ఉండగలుగుతానని చెప్పి, బాలీవుడ్ నటి అనూష్క శర్మ, కొత్త తల్లులందర్నీ ఆలోచనలో పడేసింది. నిజానికి ఇది అద్భుతమైన ఆరోగ్యకరమైన అలవాటనీ, కొద్దిపాటి అవగాహనతో పిల్లల తల్లులందరికీ ఈ అలవాటు సాధ్యపడుతుందనీ వైద్యులు కూడా అంటున్నారు.

చిన్నపిల్లల తల్లులకు కంటి నిండా నిద్ర తప్పనిసరి. కానీ సాధారణంగా తల్లులు, పిల్లలను నిద్రపుచ్చి, అప్పుడు పనులకు పూనుకుంటూ ఉంటారు. టివి చూడడం, ఫోన్లు మాట్లాడడం, వ్యాపకాలకు పూనుకోవడం, వంటగది సర్దుకోవడం, ఇంటి పనులు చేసుకోవడం లాంటివి చేస్తూ ఏ అర్థరాత్రికో నిద్రకు ఉపక్రమిస్తూ ఉంటారు. కానీ కంటి నిండా నిద్ర పోలేకపోతే, శరీరంలో సత్తువ సన్నగిల్లుతుంది. రోగ నిరోధకశక్తి కుంటుపడి తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు. బ్రెయిన్ ఫాగ్ రోజంతా వేధిస్తుంది. పిల్లల పనులు రెట్టింపు భారంగా మారతాయి. కానీ చంటి పిల్లలతో సాయంత్రం పెందలాడే నిద్రపోవడం ఎలా సాధ్యపడుతుంది? అని అనుకోవచ్చు. నిజానికి దైనందిన జీవితంలో చిన్నపాటి మార్పులతో ఈ అలవాటు సాధ్యపడుతుంది. అదెలాగంటే...

- స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడం, నిద్రకు ముందు చురుకైన పనుల్లో పాల్గొనడం, అవసరానికి మించి కెఫీన్ తీసుకోవడం, ఆలస్యంగా తినడం... ఇవన్నీ నిద్రకు దూరం చేసే అలవాట్లే! ఉదయాన్నే పరిపూర్ణమైన హుషారుతో నిద్రలేవాలనుకుంటే, రాత్రి భోజనం సాయంత్రమే ముగించేసి, పెందలాడే నిద్రపోవాలి.
- పిల్లల నిద్రవేళలను అనుసరించాలి. పిల్లలూ, తల్లులూ ఒకే నిద్రవేళలను క్రమం తప్పక పాటించేలా చూసుకోవాలి. పిల్లల నిద్రవేళల్లో తల్లులూ నిద్రకు ఉపక్రమిస్తే, ఇద్దరూ ఆరోగ్యంగా, హుషారుగా ఉంటారు. పెందలాడే నిద్రపోవడానికి పడగ్గది వాతావరణాన్ని అందుకు అనువుగా మార్చుకోవాలి. కంటి నిండా నిద్ర పట్టడం కోసం పడగ్గది కిటికీలకు ముదురు రంగు కర్టెన్లు కట్టుకోవాలి. నిద్రాభంగం కలిగించే శబ్దాలు పడగ్గదిలోకి చొరబడకుండా చూసుకోవాలి.
- కమ్మని నిద్ర పట్టాలంటే పగటివేళ శరీరానికి ఎండ సోకేలా చూసుకోవాలి. కాబట్టి ఉదయం



వేళ తక్కువ తాపమానాల్లో పసికందులతో పాటు ఆరుబయట కొన్ని నిమిషాలు గడపడం అలవాటు చేసుకోవాలి.

గుడ్ ఫుడ్

జాజికాయ జబర్దస్త్

చాలా చాలా అరుదుగా ఉపయోగించే సుగంధ ద్రవ్యం జాజికాయ. కాజూ కట్లీ లాంటి కొన్ని స్వీట్లలో మాత్రమే జాజికాయ సువాసన తగులుతూ ఉంటుంది. కొందరు బిరియానీల్లో, ఇంకొన్ని తీపి పదార్థాల్లో వాడుతూ ఉంటారు. అయితే కమ్మని సువాసన వెదజల్లే జాజికాయలో ఎన్నో ఆరోగ్యకరమైన అంశాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

జాజికాయ కొన్ని తీవ్ర వ్యాధులను అరికడుతుంది. కేన్సర్, డీజనరేటివ్ డిసీజెస్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఫ్రీ ర్యాడికల్స్‌తో కణాలకు జరిగే నష్టాన్ని అరికట్టే సయానిడిన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఫినైల్ ప్రొపనాయిడ్స్, టెర్పెన్స్ అనే, ఎసెన్షియల్ ఆయిల్స్ జాజికాయలో ఉంటాయి. ఇవన్నీ ఫ్రీ రాడికల్స్‌ను స్థిరీకరించి, కణ నష్టాన్ని అరికడతాయి. దీన్లోని మోనోటర్పీన్స్, సాబినిన్, టెర్పినాల్, పినీన్, మొదలైన కాంపౌండ్లు ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి. అయితే జాజికాయకు గర్భవిచ్ఛిత్తిని ప్రేరేపించే స్వభావం ఉంటుంది. కాబట్టి గర్భిణులు వీటిని తీసుకోకూడదు. అలాగే మానసిక సమస్యలున్న వాళ్లు కూడా వీటికి దూరంగా ఉండడం మేలు. శరీర బరువులో ఒక కిలోకు రెండు మిల్లీగ్రాముల జాజిపొడి ఆరోగ్యకరం.



దిక్సూచి DIKSUCHI

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి క్యాట్

దరఖాస్తు గడువు తేదీ సెప్టెంబరు 20కి పొడిగింపు



మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకే) ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఫర్ విజనరీ లీడర్‌షిప్ ఇన్ మాన్యుఫాక్చరింగ్(పీజీపీఈఎక్స్-వీఎల్‌ఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జేఐసీఏ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రొమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఎంహెచ్‌ఆర్‌డీ-ఇండియా ఉమ్మడిగా రూపొందించాయి. దీనికి ఐఐఎం కోల్‌కతా, ఐఐటీ మద్రాస్ సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా 36 వారాల క్లాస్ రూం స్టడీ, కేస్ స్టడీస్, ల్యాబ్ సెషన్స్, ఇండివిడ్యువల్ అండ్ టీం అసైన్‌మెంట్స్, జపనీస్ ఫ్యాకల్టీ గెస్ట్ లెక్చర్స్, ఆరు వారాల ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వారంపాటు జపాన్‌లో ఇండస్ట్రియల్ విజిట్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ మాన్యుఫాక్చరింగ్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు.

ఐఐటీ కాన్పూర్‌లో పీజీ



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2025 ఫిబ్రవరి 28 నాటికి కనీసం నాలుగున్నరేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

ఎంపిక: ఐఐఎంసీ, ఐఐటీకే, ఐఐటీఎం ఉమ్మడిగా అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తాయి. రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరిని మాత్రమే రిటెన్ టెస్ట్‌కు అనుమతిస్తారు. రిటెన్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, ఇంజనీరింగ్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 5
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** నవంబరు 19న
- **రిటెన్ టెస్ట్ కేంద్రాలు:** ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై
- **రిటెన్ టెస్ట్ తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.iitk.ac.in/ime/vlm

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికిగాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రి-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

బీస్ట్ మోడ్ ఆన్



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సి16' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉందీ చిత్రం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా, రామ్‌చరణ్ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. "బీస్ట్ మోడ్ ఆన్. ఆర్‌సీ 16 లోడింగ్" అని పేర్కొన్నారు.

ఓనమ్ పర్వదినం సందర్భంగా 'కూలీ' సినిమా సెట్స్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టెప్పులేశారు. ఆయన నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాలోని 'మానసిలాయో' పాటకు స్టెప్పులేసి ఆయన చిత్రబృందంలో జోష్ తెచ్చారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే.








వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి హీరో సాయిదుర్గ తేజ్ విరాళంగా ప్రకటించిన రూ. పది లక్షలు, హీరో విష్వక్‌సేన్ రూ పది లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 25 లక్షలు, హాస్యనటుడు ఆలీ దంపతులు రూ. 3లక్షల చెక్కులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి అందజేశారు.

తిన్నడి స్నేహితుడు



విష్ణు మంచు నటిస్తున్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం వస్తున్న అప్‌డేట్లు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సోమవారం తిన్నడికి విధేయుడు, స్నేహితుడు అయిన టిక్కీని పరిచయం చేశారు. టిక్కీ మరెవరో కాదు.. విష్ణు స్వారీ చేసే గుర్రం. టిక్కీతో ఉన్న విష్ణు పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విష్ణు లుక్ ఆకట్టుకుంటోంది. డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ఈ భారీ చిత్రం విడుదల కానుంది.

నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు



నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ సోమవారం వివాహబంధంలోకి అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు అదితి. 'నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు.. నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్దు' అనే క్యాప్షన్‌ను ఆమె జత చేశారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని వీరి వివాహం జరిగిందని అంటున్నారు కానీ అక్కడి ఆలయంలో మాత్రం ఆ ఛాయలేవీ కనిపించలేదు. అక్కడ ఏ వివాహం కూడా జరగలేదని ఆలయ పూజారులు తెలియజేస్తున్నారు. మరెక్కడైనా ఆ వివాహం జరిగిందే మోననే భావన వ్యక్తమవుతోంది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరి రాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనుమరాలు, ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని 2012లో విడిపోయారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీరంగాపూర్

ఇన్ ప్రోగ్రెస్

జైలుకి వెళ్లిన గొర్రె



సుహాస్ హీరోగా నటించిన యూనిక్ ఎంటర్‌టైనర్ 'గొర్రె పురాణం' ఈ నెల 20న విడుదల కానుంది. పురాణం బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో ఉండడం ఏందీ.. ఆడికెల్లి తప్పించుకోవడం ఏంది? ఇదంతా మీకు వింతగా ఉంది కదూ' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె ఓ గ్రామంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రలు పోషించారు.

మహిళల రక్షణ కోసం



ప్రవీణ్ కె.వి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహిష'. యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు కొండా విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. మహిళల రక్షణ కోసం చేసిన చిత్రమిది" అని చెప్పారు. "ధర్మాన్ని ఎలా కాపాడాలో ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి" దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా..



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ చెప్పారు. ఈ సినిమా కోసం చంద్రహాస్ బాగా కష్టపడ్డాడనీ, అతనికి మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని దర్శకుడు శ్రీనివాస్ మహత్ చెప్పారు. అన్ని ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రకథ ఎన్నుకున్నామనీ, తన కుమారుడి మొదటి సినిమాను సకుటుంబంగా ప్రేక్షకులు చూడాలనుకున్నామనీ ప్రభాకర్ చెప్పారు మరో రెండు సినిమాలు ఉన్నా మొదట 'రామ్‌నగర్ బన్నీ'నే విడుదల చేస్తున్నామని తెలిపారు.

సండే గర్ల్ ఫ్రెండ్



కామ్నా శర్మ, సుమన్, అలీ ప్రధాన పాత్రలు పోషించే 'సండే గర్ల్ ఫ్రెండ్' షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ కామ్నాపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నటి ఇంద్రజ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అలీ తొలి క్లాప్ ఇచ్చారు. సుమన్ స్క్రిప్ట్ అందజేశారు. లవ్, మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు గడ్డం వెంకటరమణారెడ్డి చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందనీ, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామనీ ఆయన తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్ నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ శేషు దర్శకుడు. కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథ ఇదనీ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందనీ దర్శకుడు చెప్పారు. లీలా గౌతమ్ వర్మ ఈ సినిమాకు నిర్మాత. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, మణిచందన, మధుమణి ఇతర ముఖ్య తారాగణం.

బాలీవుడ్‌లో హీరోలు.. దక్షిణాదిలో విలన్లు

తెలుగు సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు పరభాషా విలన్లను ఎంచుకోవటం మేకర్స్‌కు ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. అయితే ఆ పరభాషా విలన్ల స్థానంలో ఇప్పుడు ఒకే ఇండస్ట్రీకి చెందిన నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. బాలీవుడ్‌లో హీరోలుగా ఉన్న ఎంతో మంది నటులు ఇప్పుడు దక్షిణాది సినిమాల్లో విలన్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. అలా దక్షిణాదిలో విలన్లుగా మారిన వారెవరో ఓ లుక్కేద్దాం.







సైఫ్ అలీఖాన్


బాలీవుడ్‌లో మంచి హిట్ ట్రాక్ ఉన్న కథానాయకుల్లో సైఫ్ అలీఖాన్ ఒకరు. లవర్ బాయ్ నుంచి యాక్షన్ రోల్స్ వరకు ఎన్నో పాత్రల్లో నటించి మెప్పించిన ఆయన.. ప్రస్తుతం ప్రతినాయకుడిగా మారారు. ఇప్పటికే ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన పౌరాణిక చిత్రం 'ఆది పురుష్' చిత్రంలో రావణుడి పాత్రను పోషించారు సైఫ్. ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర'లో 'భైర' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన 'భైర' గ్లింప్స్, ట్రైలర్‌తో సినిమాలో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో సినీ ప్రియులకు మేకర్స్ హింటిచ్చారు.

ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లోనే మోస్ట్ రొమాంటిక్ హీరోల్లో ఇమ్రాన్ హష్మీ ఒకరు. సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలకు సిద్ధమయ్యారు. సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓ.జీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్)లో ఆయన ఓమి భాయ్ అనే పాత్రలో కనిపిస్తున్నారు. ఇమ్రాన్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన పోస్టర్‌లో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

సంజయ్ దత్

దక్షిణాదికి బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ హీరోగానూ.. విలన్‌గానూ ఇప్పటికే సుపరిచితం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా నటించిన 'కేజీఎఫ్' సిరీస్‌లో 'అధీరా' పాత్రలో కరడుగట్టిన విలన్‌గా ఆయన కనిపించారు. గతేడాది లోకేశ్ కనగరాజ్, తమిళ నటుడు విజయ్ కలయికలో వచ్చిన 'లియో'లోను ఆయన పోషించిన పాత్ర ప్రతినాయక ఛాయలున్నదే. ఈ మధ్యే రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోనూ 'బిగ్ బుల్'గా ఆయన అదరగొట్టారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ 'రాజా సాబ్'లోనూ ఆయన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ జీవితాన్ని మలుపు తిప్పే ఘోస్ట్ పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. అయితే ఇది పాజిటివా, నెగెటివా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇక ఇప్పటికే వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ', 'వివేకం' 'లూసీఫర్'లో.. అర్జున్ రాంపాల్ 'భగవంత్ కేసరి'లో.. అక్షయ్‌కుమార్ '2.0' చిత్రాలలో విలన్ పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.





బాబీ డియోల్

ప్రతినాయకుడి అవతారమెత్తిన మరో బాలీవుడ్ కథానాయకుడు బాబీ డియోల్. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణ్‌బీర్‌తో తలపడ్డారు ఆయన. 'యానిమల్'లో కనిపించింది కాసేపు అయినా.. తన నటనతో ప్రేక్షకులకు విలన్ అంటే వీడేరా అనే ఫీల్‌ను కలిగించారు బాబీ. ఆయన ప్రస్తుతం దక్షిణాదిలో విలన్‌గా వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తమిళ నటుడు సూర్య నటిస్తున్న 'కంగువ'లో భీకరమైన పోరాట యోధుడిగా ఆయన కనిపించనున్నారు. అలాగే, కే.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే109' చిత్రంలోనూ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'లోనూ బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇందులో ఆయన మొఘల్ ఎంపెరర్ ఔరంగజేబ్ పాత్రను పోషించడం విశేషం. అలాగే విజయ్ నటిస్తున్న నూతన చిత్రంలోనూ ఆయన ప్రతినాయకుడి పాత్రను పోషించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'విజయ్ 69'.



27 నుంచి రెండు షాపింగ్ పండుగలు

ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులకు మరో పది రోజుల్లో రెండు షాపింగ్ పండుగలు అందుబాటులోకి రానున్నాయి. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేశీయ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ "బిగ్ బిలియన్ డేస్", అంతర్జాతీయ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ "గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్" సెప్టెంబరు 27వ తేదీ నుంచి ప్రారంభించనున్నాయి.

బిగ్ బిలియన్ డేస్: ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ 2024 సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు జరుగుతుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, వీఐపీ సభ్యులకు ఒక రోజు ముందే అంటే 26వ తేదీ నుంచే ఇది అందుబాటులోకి వస్తుంది. ఇది బిగ్ బిలియన్ డేస్ 11వ ఎడిషన్ అని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తి తెలిపారు. 20 పైగా నగరాల్లోని 2 లక్షల ఎస్‌కేయూల ద్వారా ఆర్డర్ ఇచ్చిన రోజునే వస్తువును కస్టమర్‌కు డెలివరీ చేయాలని ఫ్లిప్‌కార్ట్ భావిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, వీఐపీ లాయల్టీ ప్రోగ్రామ్ కస్టమర్లకు టాప్ బ్రాండ్లపై ప్రత్యేక డీల్స్ అందుబాటులో ఉంటాయి. అలాగే సాధారణ కస్టమర్లకు కూడా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, అంతర్జాతీయ ఫ్యాషన్, సౌందర్య సాధనాల బ్రాండ్ల పై అత్యుత్తమ డీల్స్ అందుబాటులో ఉంటాయి. షాప్సీ ద్వారా తొలిసారి కొనుగోళ్లు చేసే వారికి వివిధ ఉత్పత్తులపై ప్రత్యేక పొదుపు అవకాశం ఉంటుంది.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్: 27వ తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి రానున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ కూడా ప్రైమ్ సభ్యులకు ఒక రోజు ముందుగానే అందుబాటులోకి వస్తుంది. కస్టమర్లకు గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 విస్తృత శ్రేణిలో ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతుందని అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ సౌరబ్ శ్రీ వాస్తవ చెప్పారు. పలు ఉత్పత్తులపై ఆకర్షణీయమైన డీల్స్ అందించడంతో పాటు వేగంగా డెలివరీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే ఈ సందర్భంగా అనేక కొత్త ఉత్పత్తుల విడుదలను కూడా అమెజాన్ ప్రోత్సహిస్తోంది.

ప్రపంచ మేటి కంపెనీల్లో హెచ్‌సీఎల్ టెక్

న్యూఢిల్లీ: టైమ్ పత్రిక నిర్వహించిన ప్రపంచ ఉత్తమ కంపెనీలు, 2024 జాబితాలో భారత ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ స్థానం సంపాదించింది. భారత్ కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న కంపెనీల్లో నంబర్-1గా నిలిచింది. వృత్తిపరమైనసేవల జాబితాలోనూ ప్రపంచంలో 10వ స్థానం సంపాదించింది. ప్రముఖ కంపెనీగా, టాప్ ఎంప్లాయర్‌గా ఈ గుర్తింపు తమ స్థాయిని మరింత పెంచిందని హెచ్‌సీఎల్ టెక్ ఒక ప్రకటనలో తెలిపింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ బ్లాక్‌బస్టర్ లిస్టింగ్

- తొలిరోజే షేరు 136% వృద్ధితో అప్పర్ సర్క్యూట్‌కు చేరిక
- రూ.1.37 లక్షల కోట్లు దాటిన మార్కెట్ విలువ
- ఇన్వెస్టర్లకు ఒక లాట్‌పై రూ.20,330 లాభం



ముంబై: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.70తో పోలిస్తే, రెట్టింపునకు పైగా లాభంతో లిస్టయింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 114.28 శాతం ప్రీమియంతో రూ.150 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 135.7 శాతం ఎగబాకి అప్పర్ సర్క్యూట్ రూ.164.99 వద్ద స్థిరపడింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి, కంపెనీ మార్కెట్ సంపద రూ.1,37,406.09 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో 608.99 లక్షల కంపెనీ షేర్లు ట్రేడయ్యాయి. ఈ నెల 11తో ముగిసిన రూ.6,560 కోట్ల బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ మెగా ఐపీఓకు సైతం ఏకంగా 63.60 రెట్ల బిడ్లు లభించాయి.

ఇన్వెస్టర్లకు బంపర్ లాభాలు

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓలో షేర్లు లభించిన ఇన్వెస్టర్లకు మొదటి రోజే లాభాల పంటపడింది. ఈ ఇష్యూలో ఒక లాట్ ద్వారా 214 షేర్లు ఆఫర్ చేశారు. షేరు ధర రూ.70 ప్రకారం లాట్ (214) షేర్ల కొనుగోలు విలువ రూ.14,980. ఆ రకంగా ఈ ఇష్యూలో ఒక లాట్ షేర్లు లభించిన ఇన్వెస్టర్ పెట్టుబడి విలువ తొలిరోజే రూ.20,330 లాభంతో మొత్తం రూ.35,310కి చేరుకుంది.

నం.1 హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా అవతరణ

స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌తో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.1.37 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో దేశంలో అత్యంత విలువైన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా అవతరించింది. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) రూ.49,477 కోట్ల మార్కెట్ క్యాప్‌తో రెండో స్థానంలో ఉండగా.. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.37,434 కోట్లు), పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.27,581 కోట్లు), ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.20,045 కోట్లు), ఆప్టస్ వేల్యూ హౌసింగ్ ఫైనాన్స్ ఇండియా (రూ.16,598 కోట్లు), ఆవాస్ ఫైనాన్షియర్స్ (రూ.14,278 కోట్లు), కెన్‌ఫిన్ హోమ్స్ (రూ.11,983 కోట్లు), సమ్మాన్ క్యాపిటల్ (రూ.11,773 కోట్లు), హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా(రూ.10,602 కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

క్రాస్ లిమిటెడ్ లిస్టింగ్ ఓకే

వాహన విడిభాగాల తయారీ సంస్థ క్రాస్ లిమిటెడ్ సైతం సోమవారం షేర్లను మార్కెట్లో లిస్ట్ చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఐపీఓ ధర రూ.240 వద్దనే లిస్ట్ అయినప్పటికీ, తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 8.13 శాతం లాభంతో రూ.259.50 వద్ద ముగిసింది.



మహీంద్రా సరికొత్త ఎల్‌సీవీ 'వీరో'

ప్రారంభ ధర రూ.7.99 లక్షలు

రూ.900 కోట్లతో యూపీపీ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) మార్కెట్లోకి సరికొత్త తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సీవీ) 'వీరో' తీసుకువచ్చింది. 3.5 టన్నుల లోపు విభాగంలో ఈ వాహనం సరికొత్త ప్రమాణాలు నెలకొల్పనుందని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా వెల్లడించారు. మహీంద్రా కొత్తగా అభివృద్ధి చేసిన అర్బన్ ప్రాస్పర్ ప్లాట్‌ఫామ్‌పై (యూపీపీ) వీరోను డిజైన్ చేసినట్లు ఆయన చెప్పారు. డీజిల్, సీఎన్‌జీ వేరియంట్ ఆప్షన్స్‌తో అందుబాటులో ఉండనున్న వీరో ప్రారంభ ధర రూ.7.99 లక్షలు. 1,600 కేజీల పేలోడ్ సామర్థ్యంతో కూడిన వీరో లీటర్ డీజిల్‌కు 18.4 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా కేజీ సీఎన్‌జీకి 19.2 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని విజయ్ పేర్కొన్నారు. 3.5 టన్నుల లోపు విభాగంలో కంపెనీ స్థానాన్ని వీరో మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ విభాగంలో ఎవరు అందించనటువంటి ఫీచర్లు, టెక్నాలజీని వీరో వాహనంలో పొందుపరిచినట్లు ఆయన చెప్పారు. మారుతున్న పరిస్థితులు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఈ వాహనాన్ని డిజైన్ చేసినట్లు తెలిపారు. ఈ విభాగంలో తొలిసారిగా డ్రైవర్ సైడ్ ఎయిర్‌బ్యాగ్, రివర్స్ పార్కింగ్ కెమెరా, 10 అంగుళాల టచ్‌స్క్రీన్, పవర్ విండోస్‌ను కొత్త వీరోలో ఉన్నాయన్నారు.

త్వరలో ఎలక్ట్రిక్ వీరో: ప్రస్తుతం డీజిల్, సీఎన్‌జీ వేరియంట్లలో మాత్రమే వీరో అందుబాటులో ఉంటుందని, సాధ్యమైనంత త్వరగా ఎలక్ట్రిక్ వీరో ను తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినికాంత్ వెల్లడించారు. దేశంలో తొలిసారిగా యూపీపీ పేరుతో మల్టీ ఎనర్జీ మాడ్యులర్ కమర్షియల్ వాహన (సీవీ) ప్లాట్‌ఫామ్‌ను మహీంద్రా అభివృద్ధి చేసిందని, దీని ద్వారా 1 నుంచి 2 టన్నులకు పైబడి పేలోడ్స్ సామర్థ్యాలతో కూడిన మరిన్ని వాహనాలను తీసుకువచ్చే వీలుందన్నారు. ఈ కొత్త ప్లాట్‌ఫామ్ కోసం రూ.900 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా వీరో.. వీ2, వీ4, వీ6 వేరియంట్లలో అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో వీ2 ధర రూ.7.99 లక్షలు, వీ4 రూ.8.99 లక్షలు, వీ6 ధర రూ.9.56 లక్షలుగా ఉంది.

బోనస్ ఇష్యూ ప్రక్రియ మరింత వేగంగా..

న్యూఢిల్లీ: బోనస్ షేర్ల జారీ, ట్రేడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు సెబీ సోమవారం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై రికార్డు తేదీ తర్వాత 2 రోజుల (టీ+2) నుంచే ఇన్వెస్టర్లు బోనస్ షేర్ల ట్రేడింగ్ నిర్వహించవచ్చు. ఇది అక్టోబరు 1 నుంచి ఇది అమలులోకి రానుందని సెబీ తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం బోనస్ ఇష్యూలో షేర్ల క్రెడిట్, వాటి ట్రేడింగ్‌కు సంబంధించి నిర్దేశిత టైమ్‌లైన్ లేదు. దాంతో కంపెనీలు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్ల జారీతోపాటు ఆ షేర్లను ట్రేడింగ్‌కు అందుబాటులోకి తెచ్చేందుకు రికార్డు తేదీ తర్వాత 2 నుంచి 7 రోజుల వరకు సమయం తీసుకుంటున్నాయి.

బెంజ్ సరికొత్త ఈవీ

ధర రూ.1.41 కోట్లు



న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) శ్రేణిని మరింత విస్తరించింది. దేశీయంగా తయారుచేసిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'ఈక్యూఎస్ 580 4మ్యాటిక్'ను సోమవారం విడుదల చేసింది. కేవలం ఒకే వేరియంట్‌లో లభించే ఈ కారు ధర రూ.1.41 కోట్లు. ఈ కారు బ్యాటరీ ప్యాక్‌పై 10 ఏళ్ల వారంటీ కల్పిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. కారు గంటకు సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 4.7 సెకండ్లలో అందుకోగలదని, గరిష్ఠంగా గంటకు 210 కి.మీ వేగంతో ప్రయాణించగలదని బెంజ్ తెలిపింది. అంతేకాదు, బ్యాటరీ పూర్తి చార్జింగ్‌తో 809 కి.మీ వరకు ప్రయాణించగలదట. 200 కిలోవాట్ డీసీ ఫాస్ట్ చార్జర్‌తో కేవలం 31 నిమిషాల్లో 10 నుంచి 80 శాతం చార్జింగ్ అవుతుందని, ఇంట్లో 7.4 కిలోవాట్ ఏసీ చార్జర్‌తో చార్జ్ చేయడానికి మాత్రం 18.5 గంటలు పడుతుందని కంపెనీ స్పష్టం చేసింది.

కొత్త గరిష్ఠాలకు సూచీలు


ముంబై: ఈక్విటీ మార్కెట్ సూచీలు సోమవారం సరికొత్త గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ ఒకదశలో 293.4 పాయింట్లు పెరిగి 83,184.34 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 97.84 పాయింట్ల వృద్ధితో 82,988.78 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ సైతం ఒకదశలో 89.2 పాయింట్లు ఎగబాకి 25,445.70 వద్ద కొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 27.25 పాయింట్ల లాభంతో 25,383.75 వద్ద క్లోజైంది.

- ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకునేందుకు ఈనెల 19న కంపెనీ బోర్డు భేటీ కానుందని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తెలిపింది. అయితే, సమీకరించనున్న నిధుల విలువను మాత్రం వెల్లడించలేదు.
- మహారాష్ట్రకు 6,600 మెగావాట్ల థర్మల్, పునరుత్పాదక ఇంధన సరఫరా చేసేందుకు దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈలో అదానీ పవర్ షేరు ధర 5.12 శాతం ఎగబాకి రూ.666 వద్ద ముగియగా.. అదానీ గ్రీన్ ఎనర్జీ స్టాక్ 7.67 శాతం లాభంతో రూ.1,925 వద్ద స్థిరపడింది.
- బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను ఎత్తివేయడంతో ఈ విభాగ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. కోహినూర్ ఫుడ్స్ 20 శాతం, ఎల్‌టీ ఫుడ్స్ 6.70 శాతం, కేఆర్‌బీఎల్ 5.87 శాతం పుంజుకున్నాయి.
- ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓకు అనూహ్య స్పందన లభించింది. ఇష్యూ తొలిరోజే 5.79 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్ ఆఫర్‌కు సైతం మొదటి రోజు 2.86 రెట్ల బిడ్లు లభించాయి.
- వెస్టర్న్ క్యారియర్స్ (ఇండియా) లిమిటెడ్ ఐపీఓకు రెండో రోజు నాటికి 4.83 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది.ఐపీఓలో భాగంగా కంపెనీ1.20 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,050 ▲	68,800 ▲	98,000 ▲
ముంబై	73,490 ▲	67,320 ▲	88,310 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	115
కరీంనగర్	100	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	115
కర్నూలు	100	నెల్లూరు	115
విశాఖపట్నం	101	నెల్లూరు	115
గోదావరి	113	అనంతపురం	115



తిరుగులేని భారత్

ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సేన

- సెమీస్‌లో కొరియా చిత్తు
- టైటిల్‌కోసం చైనాతో అమీతుమీ నేడు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

మ 3.30 నుంచి

హులున్‌బుయిర్ (చైనా): అద్భుత ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో ముందుండి నడిపించగా..అన్ని విభాగాల్లో అదరగొట్టిన భారత్ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకొనేందుకు అడుగు దూరంలో నిలిచింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 4-1తో కొరియాను చిత్తు చేసింది. ఉత్తమ్ సింగ్ (13వ నిమిషం), హర్మన్‌ప్రీత్ (19, 45), జర్మన్‌ప్రీత్ సింగ్ (32) భారత్ తరఫున గోల్స్ సాధించారు. యాంగ్ జిహాన్ (33వ) కొరియాకు ఏకైక గోల్ అందించాడు.

పాక్‌పై చైనా గెలుపు

మంగళవారం జరిగే ఫైనల్లో ఆతిథ్య చైనా జట్టుతో హర్మన్‌సింగ్ సేన తలపడనుంది. అంతకుముందు షూటౌట్‌కు దారి తీసిన మరో సెమీఫైనల్లో చైనా 2-0తో మాజీ చాంపియన్ పాకిస్థాన్‌కు షాకిచ్చింది. నిర్ణీత సమయం ముగిసే సరికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. లీగ్ దశలో చైనాతో పోరులో మనోళ్లు 3-0తో విజయం సాధించారు.

ఆదినుంచే..

కొరియాతో మ్యాచ్‌లో భారత్ ఆరంభంనుంచే ఎదురు దాడికి దిగింది. దాంతో చేష్టలుడిగిన ప్రత్యర్థి ఆత్మరక్షణకే పరిమితమైంది. కొరియా గోల్‌పోస్ట్‌పై పదేపదే దాడి చేసిన భారత్ 13వ నిమిషంలో ఫలితం రాబట్టింది. అరైజీత్ సింగ్ నుంచి అందుకొన్న పాస్‌ను ఉత్తమ్ పొరపాటుకు తావులేకుండా గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో భారత్‌కు 1-0 ఆధిక్యం లభించింది. రెండో క్వార్టర్ ఆరంభంలోనే కొరియాకు వరుసగా రెండు పెనాల్టీకార్నర్లు దక్కినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. మరోవైపు ఈ క్వార్టర్ నాలుగో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ తనదైన శైలిలో గోల్‌గా మలిచాడు. ఈసారి టోర్నీలో భారత సారథికిది ఆరో గోల్ కావడం విశేషం. ప్రథమార్ధం తర్వాతా ఏమాత్రం జోరు తగ్గని భారత్ మూడో క్వార్టర్ రెండో నిమిషంలోనే సూపర్ గోల్ సాధించింది. సుమీత్ అందించిన అమోఘమైన స్కూప్‌ను సర్కిల్ వెలుపల లెఫ్ట్‌ఫ్లాంక్‌లో అందుకున్న జర్మన్‌ప్రీత్ ప్రత్యర్థి డిఫెండర్లు నివ్వెరపరుస్తూ గోల్‌లోకి పంపాడు. మరికొద్దిసేపటికే కొరియాకు పెనాల్టీ కార్నర్ లభించగా యాంగ్ జిహాన్ గోల్‌గా మలిచాడు. అయినా వెనక్కు తగ్గని భారత్ దాడుల ఉధృతిని ఏమాత్రం తగ్గించకుండా ఆడింది. ఈక్రమంలో క్వార్టర్ ముగిసే సమయంలో మరో పెనాల్టీ కార్నర్ దక్కింది. ఎప్పటిలాగే హర్మన్ దానిని అలవోకగా గోల్ పోస్ట్‌లోకి కొట్టాడు. ఆట మరో ఎనిమిది నివిషాల్లో ముగుస్తుందనగా.. కీపర్ కర్కేరా ప్రత్యర్థి రెండు గోల్స్ అవకాశాలను వమ్ము చేశాడు.

సచిన్ రికార్డుకు చేరువలో రోహిత్

బంగ్లాతో సిరీస్‌లో రోహిత్ శర్మను అనేక రికార్డులు ఊరిస్తున్నాయి. బంగ్లాపై మూడు ఫార్మాట్లలో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్లలో కోహ్లీ 1577 రన్స్‌తో టాప్‌లో ఉండగా.. సచిన్ టెండూల్కర్ (1316 పరుగులు) రెండో స్థానంలో నిలిచాడు. రోహిత్ (1296 రన్స్) మరో 21 పరుగులు సాధిస్తే మాస్టర్ రికార్డును అధిగమించే అవకాశం ఉంది.

కెరీర్‌లో 50 శతకాల మైలురాయికి రోహిత్ మరో రెండు సెంచరీల దూరంలో ఉన్నాడు. సచిన్ (100), కోహ్లీ (80) భారత ఆటగాళ్లలో టాప్-2లో ఉన్నారు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్ (90) రికార్డును బద్దలు కొట్టడానికి రోహిత్ (84) ఇంకా 7 సిక్స్‌ల దూరంలో ఉన్నాడు. ఓవరాల్‌గా బెన్ స్టోక్స్ (131), న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్ (107), ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ గిల్‌క్రిస్ట్ (100) టాప్-3లో ఉండగా.. హిట్‌మ్యాన్ 11వ స్థానంలో నిలిచాడు.

భారత్, బంగ్లా సిరీస్ షెడ్యూల్

తొలి టెస్ట్	అక్టోబరు19 -23	చెన్నై
రెండో టెస్ట్	27-అక్టోబరు 1	కాన్పూర్
తొలి టీ20	అక్టోబరు 6	గ్వాలియర్
రెండో టీ20	అక్టోబరు 9	ఢిల్లీ
మూడో టీ20	అక్టోబరు 12	హైదరాబాద్

జోరుగా.. హుషారుగా!

నెట్స్‌లో శ్రమించిన టీమిండియా



ప్రాక్టీస్‌లో రోహిత్ జడేజా

కోహ్లీ, రోహిత్ సాధన ● జైస్వాల్‌కు బుమ్రా పరీక్ష

చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్ నేపథ్యంలో భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది. ఎంపిక చేసిన 16 మంది టీమిండియా సభ్యులు సోమవారం జరిగిన శిక్షణ శిబిరంలో చెమటోడ్చారు. గతవారమే ఇక్కడకు చేరుకొన్న రోహిత్ సేనకు ఇది మూడో ప్రాక్టీస్ సెషన్. బంగ్లాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి తొలి మ్యాచ్ జరగనుంది. తొలి విడతలో కోహ్లీతోపాటు యశస్వి జైస్వాల్ పక్కపక్క నెట్స్‌లో సాధన చేశారు. వీరిద్దరూ బుమ్రా, అశ్విన్‌ను ఎదుర్కొన్నారు. అయితే, జైస్వాల్‌ను మాత్రం తన పేస్, స్వింగ్‌తో తీవ్రంగా పరీక్షించిన బుమ్రా.. రెండుసార్లు వికెట్లను గిరాటేశాడు. స్థానిక బౌలర్లను ఎదుర్కోవడంలో కూడా యశస్వి తడబడ్డాడు. ఆ తర్వాత రోహిత్ శర్మ, గిల్, సర్ఫరాజ్ ప్రాక్టీస్ చేశారు. బంగ్లా స్లో బౌలర్లను దృష్టిలో ఉంచుకొని రోహిత్ ఎక్కువగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. జడేజా, రిషభ్ పంత్‌తోపాటు సిరాజ్ కూడా స్థానిక బౌలర్ల బౌలింగ్‌లో సాధన చేశారు. భారత్ మరో రెండు నెట్ సెషన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. చెపాక్ వికెట్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలించనున్న నేపథ్యంలో తుది జట్టులో జడేజా, అశ్విన్, కుల్దీప్‌లకు చోటు దక్కే చాన్సులుండగా.. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఇదే జరిగితే అక్షర్ పటేల్‌కు తుది జట్టులో చోటు కష్టమే.! ఇక, బ్యాటింగ్ విషయానికొస్తే రెండేళ్ల తర్వాత పంత్ టెస్టుల్లోకి రీఎంట్రీ ఖాయంగా కనిపిస్తుండడంతో.. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకొన్న వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశాలున్నాయి. కాగా, చెన్నై వేడి వాతావరణంలో జట్టు ప్రాక్టీస్ చేసిన తీరుపై ఫీల్డింగ్ కోచ్ దిలీప్ సంతృప్తి వ్యక్తం చేశాడు. ఆటగాళ్లను రెండు గ్రూప్‌లుగా చేసి క్యాచింగ్ ప్రాక్టీస్ పోటీని నిర్వహించినట్టు తెలిపాడు. ఇందులో తక్కువ తప్పులు చేసిన కోహ్లీ టీమ్ గెలిచిందని చెప్పాడు.

బంగ్లా కూడా..

ఆదివారం ఇక్కడకు చేరుకొన్న బంగ్లా తొలి నెట్ సెషన్‌లో పాల్గొంది. బ్యాటర్లు సాధన చేస్తున్న వీడియోను బంగ్లా క్రికెట్ బోర్డు నెట్‌లో పోస్టు చేసింది. బ్యాటర్లు లిట్టన్ దాస్, హసన్ జాయ్, జకీర్ హసన్, షద్మన్ ఇస్లాం తమ ఫుట్‌వర్క్‌ను మెరుగుపరచుకొంటూనే విభిన్న రకాల షాట్లను ప్రాక్టీస్ చేశారు. పేసర్ నహీద్ రాణాతోపాటు స్పిన్నర్లు కూడా బ్యాటర్లను ఇబ్బందిపెట్టడానికి ప్రయత్నించారు. ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడుతున్న షకీబల్ మంగళవారం జట్టులో చేరే అవకాశం ఉంది.



తేలిగ్గా తీసుకొంటే..!

● హెచ్చరించిన గవాస్కర్

బంగ్లాను ఏమాత్రం తేలిగ్గా తీసుకొన్నా పరాభవం తప్పదని టీమిండియాను మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేసిన బంగ్లా.. మరో సంచలనం కోసం తీవ్రంగా పోరాడే అవకాశం ఉందని చెప్పాడు. రెండు టెస్టుల్లోనూ పాక్‌ను ఓడించి తన సత్తా ఏమిటో బంగ్లా ప్రపంచానికి తెలియజేసింది. కొన్నేళ్ల కిందట ఆదేశ పర్యటనకు వెళ్లిన మనల్ని దాదాపుగా ఓడించినంత పనిచేసింది. ఆ జట్టులో సీనియర్లతోపాటు కుర్రాళ్లు అదరగొడుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆధిపత్యం ఎలా చెలాయించాలో వారు వేగంగా నేర్చుకొంటున్నారని గవాస్కర్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ చేరుకోవాలంటే స్వదేశంలో జరిగే ప్రతీ టెస్ట్ భారత్‌కు ఎంతో కీలకమని చెప్పాడు.

భారత జట్ల డబుల్ హ్యాట్రిక్

వరుసగా ఆరో విజయం ● చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు జోరు కొనసాగిస్తున్నాయి. వరుసగా ఆరో రౌండ్‌లోనూ విజయంతో డబుల్ హ్యాట్రిక్ సాధించాయి. సోమవారం జరిగిన ఈ రౌండ్‌లో పురుషుల జట్టు 3-1తో హంగేరీపై గెలుపొందింది. మహిళల జట్టు 2.5-1.5తో ఆర్మీనియాపై నెగ్గింది. పురుషుల జట్టులో..తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి-సనన్‌ని, విదిత్ గుజ్‌రాతీ-బెంజమిన్‌ని ఓడించారు. ప్రజ్ఞానంద-పీటర్ లెకో, గుకేష్-రిచర్డ్ గేమ్‌లు డ్రా అయ్యాయి. మహిళల్లో..దివ్య దేశ్‌ముఖ్-ఎలీనాపై గెలుపొందింది. తెలుగు జీఎం హారిక, వైశాలీ, తానియా తమ గేమ్‌లను ఫలితం లేకుండా ముగించారు. ఆరు రౌండ్ల తర్వాత రెండు జట్లు చెరో 12 పాయింట్లతో కొనసాగుతున్నాయి.





టాప్-5లో అర్జున్, గుకేష్

వరల్డ్ చెస్ లైవ్ రేటింగ్స్‌లో ఇద్దరు భారత క్రీడాకారులు అర్జున్ ఇరిగేసి 4వ (2788.1 రేటింగ్), గుకేష్ (2775.9) ఐదో ర్యాంకులో నిలిచారు. ఇలా ఇద్దరు ఆటగాళ్లు లైవ్ రేటింగ్స్‌లో టాప్-5లో నిలవడం భారత చెస్ చరిత్రలో తొలిసారి కావడం విశేషం. ఇక.. కార్ల్‌సన్, కరువానా, హికారు నకమురా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం

● హెచ్‌సీఏ జిల్లా అనుబంధ సంఘాల ఆందోళన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 ఎంపిక పోటీల్లో ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా అన్యాయం జరుగుతోందని జిల్లా క్రికెట్ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గ్రామీణ క్రికెటర్ల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకోకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల క్రికెటర్లకు లబ్ధి చేకూరేలా అండర్- 19 జట్లను ఎంపిక చేశారని నిరసన వ్యక్తం చేశాయి. అజీజ్‌నగర్‌లో జరుగుతున్న అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఆగంరావుతో పాటు ఇతర జిల్లా క్రికెట్ సంఘాల ప్రతినిధులు అడ్డుకుని, తమ నిరసన తెలిపారు.

అంతజరిగినా.. ఆరోజు రవిశాస్త్రి పార్టీ ఇచ్చాడు



అశ్విన్

చెన్నై: నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అయితే అందులో భాగంగా జరిగిన తొలి టెస్టులో మాత్రం కేవలం 36 పరుగులకే కుప్పకూలింది. ఈ ఫార్మాట్‌లో భారత్‌కిదే అత్యల్ప స్కోరు. ఆ సమయంలో అప్పటి కోచ్ రవిశాస్త్రి తమలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన తీరుపై స్పిన్నర్ అశ్విన్ చెప్పుకొచ్చాడు. 'అడిలైడ్ టెస్టులో మేం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందినా ఆ తర్వాత ఇన్నింగ్స్‌లో 36 రన్స్‌కే ఆలౌటయ్యాం. డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయాం. కానీ అదే రోజు సాయంత్రం రవిశాస్త్రి మాకు డిన్నర్ ఇవ్వడంతో పాటు సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశాడు. అందులో తను పాత హిందీ పాటలు పాడగా.. మేం కూడా అనుసరించి మనసులను తేలిక చేసుకున్నాం. ఆ తర్వాత కసిగా ఆడి మెల్‌బోర్న్‌లో గెలిచాం' అని అశ్విన్ వివరించాడు.

రేవంత్‌రెడ్డిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

- నాపై దాడి జరిగితే సీఎందే బాధ్యత
- నా కాళ్లు పట్టుకుంటే ఆయనను పీసీసీ ప్రెసిడెంట్ చేశా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమస్యలపై మాట్లాడుతున్నందుకే తనపై దాడులు చేస్తున్నారని, ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపించామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి అన్నారు. సీఎం వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని, దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనను హత్య చేయించాలని ఎందుకు అనుకుంటున్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై ఏదైనా దాడి జరిగితే సీఎం బాధ్యత వహించాలన్నారు. తమ జోలికి వస్తే వీపు చింతపండు చేస్తామంటున్న రేవంత్ వీపును కొడంగల్‌లో గుర్నాథ్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ప్రజలు చింతపండు చేయలేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్‌ను చేసింది తానేనని, ఆయన తన ఇంటికి వచ్చి కాళ్లు పట్టుకుని పీసీసీ ప్రెసిడెంట్ చేయాలని అడిగారని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే.. ఇప్పుడు ఆయన్ను గద్దెదించే వరకు పోరాటం సాగిస్తానన్నారు. ఇటీవల తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రె‌స్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని, పార్టీ మారిన ఎమ్మెల్యేలు అభద్రతాభావంతో ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై త్వరలో డీజీపీ, హోంశాఖ కార్యదర్శి, గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. న్యాయం జరగకపోతే రాష్ట్రపతిని కలిసి తెలంగాణలో పరిస్థితులను వివరిస్తామని వారు వెల్లడించారు.

మోదీ పాలన కార్పొరేట్ల కోసమే: నారాయణ

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధాని అయ్యి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న మోదీ.. కేవలం కార్పొరేట్ సంస్థల కోసమే పని చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. గౌహతిలోని అసోం స్టేట్ కౌన్సిల్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బడావ్యాపారవేత్తలకు మోదీ రూ.లక్షల కోట్లు దోచిపెడుతున్నారని, అణగారిన వర్గాల ప్రజల కోసం ఏమీ చేయడంలేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు తిరస్కరించారని టీడీపీ, జేడీయూ మద్దతుతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆయన అన్నారు.

21న సీతారాం ఏచూరి సంస్మరణ సభ

- ఒకే వేదిక మీదకు సీఎం రేవంత్, కేటీఆర్!

సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేనితో పాటు పలువురు నాయకులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.

డప్పు కొట్టకుంటే సామాజిక బహిష్కరణ చేస్తారా?

- పెత్తందారులపై అట్రాసిటీ కేసులు పెట్టి అరెస్టు చేయాలి
- జై భీమ్ సేన ఫైర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు

నల్లకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడ గ్రామంలో ఉన్నత చదువులు చదివిన దళిత యువకులు చంద్రం, అర్జున్‌లు తమ కులవృత్తి అయిన డప్పు కొట్టడాన్ని ఆపుతామన్నందుకు.. ఆ గ్రామ పెత్తందారులు వారిని సామాజిక బహిష్కరణ చేయడం దుర్మార్గమైన చర్య అని జై భీమ్ సేన ఫైర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి. బల్వంత్‌రావు పేర్కొన్నారు. డప్పులు కొట్టబోమన్నందుకు ఈ నెల 14న దళితులను సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందారులపై క్రిమినల్, అట్రాసిటీ కేసులు పెట్టి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులతో తాము ఉద్యోగాలు చేస్తున్నామని, కులవృత్తి మానేస్తామని అన్నందుకు పంచాయతీ పెట్టి సామాజిక బహిష్కరణ చేయడం దారుణమని అన్నారు. ఈ విషయంపై మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హైకోర్టు సుమోటోగా స్వీకరించాలని ఆయన కోరారు.

అవాంఛనీయ ఘటన జరిగితే బీఆర్ఎస్‌కే నష్టం: వీహెచ్

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోవడానికి కృషి చేసిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని, అలాంటి నేత విగ్రహాన్ని కూలగొడతామంటూ బీఆర్ఎస్ నేతలు అనడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే అది బీఆర్ఎస్‌కే నష్టాన్ని కలిగిస్తుందని తెలుసుకోవాలన్నారు. ఇలాంటి మాటలు, ఆలోచనల వల్ల ఆ పార్టీ ప్రతిష్ఠ తగ్గిపోతుందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకుంటే ప్రజలే సమాధానం చెబుతారని సోమవారం గాంధీభవన్‌లో ఆయన హెచ్చరించారు.

జమిలి ఎన్నికలు బీజేపీ కుట్ర: అద్దంకి దయాకర్

జమిలి ఎన్నికలనేవి ప్రతిపక్షాలు, ప్రజలు, ప్రాంతీయ పార్టీలపై బీజేపీ చేస్తున్న కుట్ర అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆరోపించారు. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్న బీజేపీ.. జమిలి ఎన్నికలను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, కులగణన వంటి అంశాల జోలికి పోకుండా నాలుగోసారి ఎలా అధికారంలోకి రావాలన్న దానిపైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందని సోమవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

విలీన లక్ష్యాలు నెరవేరలేదు: కోదండరాం

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న హైదరాబాద్ విలీన దినం జరుపుకోవడమంటే ప్రజాస్వామ్యం కోసం ప్రజలు చేసిన పోరాట సంప్రదాయాన్ని కొనసాగించడమేనని టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం చెప్పారు. ప్రజలు కోరుకున్నది ప్రజాస్వామిక పాలన, ప్రజాస్వామిక సమాజమన్నారు. అయితే విలీనంతో ఆ లక్ష్యాలు సంపూర్ణంగా నెరవేరలేదని తెలిపారు. ఆ లక్ష్యాల సంపూర్ణ సాధనకు కృషి చేయాల్సిన అవసరాన్ని విలీన దినం గుర్తు చేస్తున్నదని వివరించారు.

పటేల్.. నికార్సయిన కాంగ్రెస్ బిడ్డ: సామేలు

కాంగ్రెస్, కమ్యూనిస్టుల పోరాటం.. అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో సెప్టెంబరు 17న నిజాంపాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సర్దార్ పటేల్.. నికార్సయిన కాంగ్రెస్ బిడ్డ అని, ఆయనతో బీజేపీకి ఏం సంబంధమని నిలదీశారు.

భద్రాద్రి రామాలయ ప్రధానార్చకుడిపై
లైంగిక వేధింపుల కేసు

- తాడేపల్లిగూడెం పోలీసులకు ఆయన కోడలి ఫిర్యాదు

భద్రాచలం, సెప్టెంబరు 16: తన మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ.. భద్రాద్రి రామాలయ ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులుపై ఆయన కోడలు ఏపీలోని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఆగస్టు 14న నమోదైన ఈ కేసు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. 2019లో ఆమెకు సీతారామానుజాచార్యులు కుమారుడు వెంకట సీతారామ్‌తో వివాహం జరిగింది. అనంతరం పలు సందర్భాల్లో మామ సీతారామానుజాచార్యులు తనను లైంగికంగా వేధించారని.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన కోడలు ఆరోపించారు. మామగారిని నిలదీస్తే.. "నా కుమారుడు దత్తపుత్రుడు. నాకు నా పోలికలతో ఒక బాబు కావాలి" అని చెప్పారని.. ఆయన గురించి పలుమార్లు అత్తకు, భర్తకు చెప్పినా పట్టించుకోకపోగా తననే తిట్టి, గదిలో బంధించి చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నారు. పెళ్లయిన ఆర్నెల్ల తర్వాత నుంచి.. రూ.10 లక్షల కట్నం తేవాలంటూ అత్త, ముగ్గురు ఆడపడుచులు, రెండో ఆడపడుచు భర్త, మూడో ఆడపడుచు భర్త తనను వేధిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వీరందరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమోచన దినోత్సవంపై భయమెందుకు?

- ఎందుకు అధికారికంగా నిర్వహించడంలేదు?: బండి సంజయ్
- రేవంత్ రెడ్డి.. దమ్ములేని ముఖ్యమంత్రి: డీకే అరుణ


కరీంనగర్‌లో ట్రాక్టర్ నడుపుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్/కరీంనగర్ టౌన్/షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి భయమెందుకు?. ఎవరికి భయపడి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదు?" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఎందుకు నిర్వహిస్తున్నారని నిలదీశారు. ప్రజాపాలన పేరుతో తెలంగాణ చరిత్రనే కనుమరుగుచేస్తున్నారని మండిపడ్డారు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారని అందుకే తాము తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు కావడంలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. ఎంఐఎం పార్టీకి భయపడి, ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్స వాన్ని నిర్వహించకుండా ప్రజలను వంచిస్తున్నాయని ధ్వజమెత్తారు. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనంపై రాష్ట్రప్రభుత్వం గణేష్ ఉత్సవ కమిటీతో చర్చించి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి.. దమ్ములేని ముఖ్యమంత్రి అని, ముస్లిం ఓటు బ్యాంకు కోసమే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడం లేదని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే పయనిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, అమలు పరుస్తున్న విధానాలకు ఎక్కడా కూడా పొంతన లేదని ఆమె అన్నారు.

ట్రాక్టర్ నడిపిన బండి సంజయ్

నిత్యం రాజకీయ కార్యక్రమాలతో బిజీగా గడిపే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ గణేష్ నిమజ్జనం సందర్భంగా ఉత్సాహంగా గడిపారు. ఆయన ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. సోమవారం నిమజ్జనం సందర్భంగా సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి వినాయకుడికి పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడిని ట్రాక్టర్‌పైకి చేర్చారు. ఆ ట్రాక్టర్‌ను స్వయంగా నడుపుతూ మెయిన్‌రోడ్డు వరకు తీసుకొచ్చారు.

జానీ మాస్టర్‌పై లైంగిక దాడి కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. అయితే.. నేరం జరిగిన ప్రాంతం తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును నార్సింగ్ ఠాణాకు బదిలీ చేశారు. నార్సింగ్ పోలీసులు లైంగిక దాడి, వేధింపులు, రక్తగాయాలయ్యేలా దాడి చేయడం వంటి సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2017లో ఓ కాంటెస్ట్‌లో పాల్గొనే అవకాశం వచ్చిన బాధితురాలు.. హైదరాబాద్‌కు వచ్చారు. 2019 నుంచి జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ముంబైలో షూటింగ్ సమయంలో అక్కడ హోటల్ గదిలో తనపై జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడ్డట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎక్కడైనా చెబితే ఉద్యోగంలోంచి తీసేస్తానని, సినిమాల్లో ఎక్కడా పని దొరకకుండా చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. దాంతో తాను మిన్నకుండిపోవడాన్ని అవకాశంగా తీసుకుని, తరచూ షూటింగ్ ప్రదేశాల్లో వేధించేవాడని.. వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని వివరించారు. ఒప్పుకోకుంటే తన జుట్టు పట్టుకుని దాడి చేసేవాడని.. ఓ సందర్భంలో అద్దంతో నా ముఖంపై కొట్టాడని వాపోయారు. మాట వినకపోతే.. షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందు అవమానపరిచేవాడని, అసభ్యంగా తాకేవాడని తెలిపారు. మతం మారి, తనను పెళ్లి చేసుకోవాలని హింసించేవాడని చెప్పారు.



ఇంటికి వచ్చి వేధించేవాడు

జానీ మాస్టర్ వేధింపులు పెరగడంతో.. తాను సొంతంగా పనిచేయడం ప్రారంభించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపారు. దీంతో జానీ మాస్టర్ ఓ రోజు తన భార్యతో కలిసి ఇంటికి వచ్చినట్లు చెప్పారు. వారిద్దరూ ఇంట్లోకి బలవంతంగా చొరబడ్డారని, జానీ మాస్టర్ భార్య తనపై చేయి చేసుకున్నారని వివరించారు. ఓ సారి రాత్రి ఇంటికి వచ్చి, తలుపు తట్టాడని, తాను స్పందించకపోవడంతో.. బయట పార్క్ చేసి ఉన్న తన స్కూటీని ధ్వంసం చేశాడని తెలిపారు. తాను షూటింగ్‌లో ఉన్న ప్రాంతానికి వచ్చి, గొడవపడేవాడని, పెళ్లి చేసుకుంటానని, మతం మారాలని అందరి ముందు వేధించేవాడని వెల్లడించారు. "ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నాపై దాడికి యత్నించారు. గుర్తుతెలియని పార్సిల్ పంపి భయభ్రాంతులకు గురిచేశారు. ఇండస్ట్రీలో నేను ఒప్పుకొన్న పనులను కూడా చేయకుండా జానీ మాస్టర్ వేధింపులకు గురిచేస్తున్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోగలరు" అని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జనసేన సీరియస్ యాక్షన్

జానీ మాస్టర్ పవన్‌కల్యాణ్ వీరాభిమాని. ఇటీవలి అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే, జానీ మాస్టర్‌పై అత్యాచారం కేసు నమోదవ్వడంతో.. జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ చీఫ్ వేములపాటి అజయ్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. "జానీ మాస్టర్‌పై నమోదు అయిన కేసును జనసేన పార్టీ సీరియస్‌గా తీసుకుంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని షేక్ జానీ భాషను ఆదేశించాం. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది" అని సోమవారం విడుదల చేసిన ఓ ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేశారు.

ఫిల్మ్ చాంబర్ సీరియస్

జానీ మాస్టర్‌పై తెలుగు ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర ప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. "జానీ మాస్టర్‌పై ఫిర్యాదు మా పరిశీలనలోకి వచ్చింది. ఆయనపై పోష్ 2013 చట్టం ప్రకారం విచారణ కొనసాగుతుంది. ఈ విషయంలో బాధితురాలి గోప్యతను కాపాడాలని మీడియాను అభ్యర్థిస్తున్నాము" అని ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు.

ఇప్పటికీ మార్పు లేదు: తాప్సీ పన్ను

మహిళలకు సమాజంలో ఎదురవుతున్న సమస్యలపై తీసిన బాలీవుడ్ చిత్రం 'పింక్'. ఈ సినిమా విడుదలై సోమవారానికి ఎనిమిదేళ్లు. ఇదే రోజున జానీ మాస్టర్‌పై అత్యాచారం కేసు నమోదు కావడం గమనార్హం..! ఈ చిత్రంలో నటించిన తాప్సీ పన్ను సోషల్ మీడియాలో సినిమా సంగతులను గుర్తుచేసుకున్నారు. "ఈ సినిమా భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతటి గుర్తింపు తెచ్చుకుంటుందని మా చిత్ర బృందం ఊహించలేదు. అయితే, ఈ సినిమా విడుదలై ఎనిమిది సంవత్సరాలు గడిచినా సమాజంలో ఎటువంటి మార్పూ లేదు. ఇప్పటికీ మహిళలకు తగిన భద్రత లేదు. ఈ చిత్రంలో భాగమైనందుకు గర్వంగా ఫీలయ్యే వాళ్లకు అదో బాధ" అని పేర్కొన్నారు.

రాజకీయ జోక్యం, మనీ పవర్‌తోనే..

- నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు
- విద్యాసాగర్ ఫిర్యాదు పూర్తిగా కట్టుకథ
- భూ లావాదేవీలతో నాకు సంబంధమే లేదు
- ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో ముంబై నటి జెత్వానీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: లైంగిక వేధింపుల కేసు నుంచి ఓ బడా పారిశ్రామికవేత్తను కాపాడటానికి ముగ్గురు ఏపీ పోలీసు అధికారులు తనను, తన కుటుంబాన్ని అక్రమంగా అరెస్ట్ చేసి వేధించారని ముంబై నటి కాదంబరి జెత్వానీ మరోసారి ఆరోపించారు. ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనే అని అన్నారు. తనను అరెస్ట్ చేసి తన సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను సీజ్ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. తాజాగా ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో... తనను అక్రమంగా కేసులో అరెస్ట్ చేయించడం వెనుక రాజకీయ జోక్యం, మనీ పవర్ ఉందని జెత్వానీ సంచలన ఆరోపణలు చేశారు. ముంబైలో గత డిసెంబరులో పారిశ్రామికవేత్తపై తాను ఫిర్యాదు చేసిన లైంగిక వేధింపుల కేసు విచారణకు తాను హాజరుకాకుండా ఉండేందుకే ఏపీ పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేశారని చెప్పారు. కోర్టులో కేసు విచారణకు మూడు రోజుల ముందు తనను పోలీసులు అరెస్ట్ చేశారని వివరించారు. ముంబైలో ఫిబ్రవరి 5-9 మధ్య కేసు విచారణ జరగాల్సి ఉందని, తనను హాజరు కాకుండా చేస్తే కేసు మూసివేస్తారనే ఉద్దేశంతో అక్రమ కేసులో తనను ఇరికించారని తెలిపారు. భూ లావాదేవీ వ్యవహారానికి సంబంధించి తనపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ కేసు పెట్టారని, ఇది పూర్తిగా కట్టుకథ అని చెప్పారు. తాను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లలేదని, ఎలాంటి భూ లావాదేవీలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తనపై అక్రమ కేసు బనాయించి, ఈ స్థాయిలో వేధించడం వెనుక కచ్చితంగా రాజకీయ జోక్యం, మనీ పవర్ ఉందన్నారు. తనపై ఫిర్యాదు చేసిన కుక్కల విద్యాసాగర్‌పై 2015 నాటికి 18 లేదా అంతకంటే ఎక్కువ కేసులు ఉన్నాయని వివరించారు. తనపై కేసు పెట్టిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసాగర్ ఉన్న పార్టీ (వైసీపీ) అధికారంలో ఉందని, రాజకీయ బలంతో ప్రభావితం చేశారని ఆమె ఆరోపించారు.

9 నెలల్లో విద్యా వ్యవస్థ పతనం

- సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దుర్భరం
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అగ్ర నాయకుడు తన్నీరు హరీశ్‌రావు సోమవారం బహిరంగ లేఖ రాశారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. "మీ 9నెలల పాలనలో విద్యావ్యవస్థ పతనానికి చేరుకొంది. సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దుర్భరంగా మారింది. కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండు చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలపాల్సి వస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 715 మందికిపైగా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కాగా, 40పైగా మంది ప్రాణాలు కోల్పోయారు. టీచర్లు లేక కొన్నిచోట్ల బడులు మూతబడితే.. మరోవైపు ప్రభుత్వ బడులమీద విశ్వాసం సన్నగిల్లి డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతోంది. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు 1864 ఉంటే, 30మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9,447ఉన్నాయి. మీ ప్రభుత్వ లెక్కలే ఈ వాస్తవాలు చెబుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో మూతబడిన 1900 పాఠశాలలను తిరిగి ప్రారంభించాలి. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ హాస్టళ్ల అవుట్ సోర్సింగ్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే ఇవ్వాలి. పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వసతి గృహాల అద్దెలు చెల్లించాలి. ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు గురుకుల పాఠశాల విద్యార్థులకు రావాల్సిన రూ. 62 (కాస్మోటిక్ రూ.50, హెయిర్ కటింగ్ రూ.12) ఇప్పటి వరకు అందలేదు. కాలేజీ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రతినెల అందాల్సిన రూ.500 పాకెట్‌మనీ ఇవ్వలేదు. ఎస్సీ గురుకుల విద్యార్థులకు నాలుగు జతల స్కూల్ యూనిఫామ్‌లు అందలేదు. వసతి గృహాల నిర్వహణకు ప్రతినెలా ఇచ్చే రూ.10వేలు వెంటనే విడుదల చేయాలి" అని హరీష్ రావు కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న మరికొన్ని సమస్యలను ఆయన ఈ లేఖలో ప్రస్తావించారు.

సోనియా మెప్పు కోసమే రాజీవ్ విగ్రహం: ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటుకు సంబంధంలేని వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం ఎదుట పెట్టడం శోచనీయమని, సోనియాగాంధీ మెప్పుకోసమే సీఎం రేవంత్‌రెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు సోమ భరత్‌కుమార్, సి.రాకేష్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు తెలంగాణ సెక్రటేరియట్, మరోవైపు అమరుల జ్యోతి మధ్యలో తెలంగాణతల్లి విగ్రహాన్ని పెట్టాలని 2023లోనే కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆ స్థలంలోనే అసందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆత్మకున్న బంధాన్ని తెంచేశారని ఆరోపించారు. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చుంటున్న సీఎం.. నెక్లెస్ రోడ్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు ప్రజలను ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణతల్లి గౌరవం పెరిగేలా చర్యలు ఉంటాయని ఆయన చెప్పారు.

20 ఏళ్ల భూరికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచాలి

- భూరికార్డుల నిర్వహణలో పారదర్శకతతోనే పెట్టుబడులు
- సులభతర వాణిజ్యం కోసం కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక విడుదల
- భూదస్త్రాల నిర్వహణకు 15 సూచనలు



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సులభతర వాణిజ్యానికి వీలుగా భూములకు సంబంధించిన ఫైళ్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని.. తద్వారా పారిశ్రామిక ప్రగతికి అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది. భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి 20ఏళ్ల రికార్డులను ఆన్‌లైన్‌లో పెట్టాలని పేర్కొంది. 2024 సంవత్సరానికి సంబంధించి కేంద్ర పరిశ్రమల శాఖ విడుదల చేసిన 'వ్యాపార సంస్కరణల ప్రణాళిక'లో మొత్తం 344 సూచనలు ఉండగా.. అందులో భూరికార్డుల నిర్వహణకు సంబంధించినవే 15 సిఫారసులున్నాయి. వాటిని అమలుచేయాలని ధరణి కమిటీ.. ఇటీవల ప్రభుత్వానికి ఇచ్చిన ముసాయిదా నివేదికలోనూ సిఫారసు చేసింది. ల్యాండ్ బ్యాంక్ వివరాలు, సర్వే నంబర్ల వారీ ఖాళీ భూముల జాబితాలు, కోర్టుల్లో ఉండే భూ వివాదాల వివరాలను, ల్యాండ్ బ్యాంకు కింద ప్రభుత్వం చూపే భూముల మ్యాపులు, రిజిస్ట్రేషన్ వివరాలు ఇలా అన్నీ వివరాలను ఆన్‌లైన్‌లో పెడితే పెట్టుబడిదారులను ఆకర్షించవచ్చనేది కేంద్రం ఆలోచన. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని.. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకుని అమలు దిశగా చొరవ చూపాలని కేంద్రం సూచించింది.

ఇవీ సూచనలు..

భూములకు సంబంధించిన అన్ని ఫైళ్లనూ డిజిటైజ్ చేయాలి. సేల్ డీడ్స్, ఆస్తుల వివరాలు, లీజు అగ్రిమెంట్లకు సంబంధించి అన్ని రికార్డులనూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఒక సర్వే నంబరులోని భూమికి సంబంధించి రెండు దశాబ్దాల లావాదేవీల వివరాలను డ్యాష్‌బోర్డులో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలి. సబ్ డివిజన్స్, భూ వివాదాలకు సంబంధించిన విషయాలను, నిషేధిత భూముల వివరాలను పెట్టుబడిదారులకు తెలిసేలా చేయాలి. సర్వే నంబర్ల వారీగా వివరాలు, డ్యాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచాలి. ఆర్వోఆర్‌కి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టాలి. ఆస్తుల జాబితాలను.. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్ను వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. ఆస్తి పన్ను చెల్లించే వ్యక్తుల వివరాలనూ పొందుపరచాలి. పన్ను చెల్లించే భూముల సర్వే నంబర్లు, వాటికి కేటాయించిన యునిక్ ఐడెంటిటీ నంబర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, ఎవరూ సమాచారం కోసం, ఫైళ్ల కోసం కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే పని అయ్యేలా చూడాలని కోరింది. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఆస్తికీ సంబంధించిన ప్లాట్ నంబర్లు, యునిక్ ఐడీలను, గ్రామాల్లో ఉండే భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, పట్టణ ప్రాంతాల్లో భూముల వివరాలను ఆన్‌లైన్ చేయాలి. పంచాయతీలు, మునిసిపాలిటీలలో ఆస్తి పన్నులకు సంబంధించి ఆన్‌లైన్‌లోనే తమ ఆస్తి పన్ను ఎంతో లెక్కించుకునేలాగా, చెల్లింపులు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. గ్రామాలు, మునిసిపాలిటీలలో ఉండే భూముల మ్యాపులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. వీటికి సంబంధించిన తాజా సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. భూముల ఈసీ, ఆర్వోఆర్ అప్‌డేటెడ్ పత్రాలు, ఆస్తి పన్ను బకాయిల వివరాలు, రెవెన్యూ కోర్టులో ఉండే భూ సంబంధిత కేసుల వివరాలు, పెండింగ్ కేసుల స్టేటస్, సివిల్ కోర్టుల్లో ఉండే కేసుల వివరాలు, ఆ కేసుల్లో ఉండే వ్యక్తులు, సంస్థల వివరాలను పూర్తి పారదర్శకంగా ప్రజలకు తెలిసేలా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. తాగునీటి వనరులు, విద్యుత్తు వంటి వివరాలు, ఇలా అన్నీ ఒకే క్లిక్ ద్వారా వెబ్‌సైట్‌లో తెలుసుకునేలా భూ సంస్కరణలు చేపట్టాలి. భూమి రిజిస్ట్రేషన్ వివరాలు, రిజిస్ట్రేషన్ ఎప్పుడు జరిగింది, స్టాంప్ డ్యూటీ చెల్లింపులు, రిజిస్ట్రేషన్‌కు వచ్చిన దరఖాస్తుల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో పెట్టాలి. మ్యుటేషన్‌కు సంబంధించి.. పేరు మార్చితే ఆ వివరాలను, విద్యుత్తు, నీటి బిల్లుల్లో పేర్లు మార్చితే ఆ వివరాలు అందుబాటులో ఉంచాలి. ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదులు చేసుకునే అవకాశాన్నీ కల్పించాలని కేంద్రం తన సిఫారసుల్లో పేర్కొంది.

2075 కోట్లతో ఉస్మా'నయా' ఆస్పత్రి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మొత్తం 30.28 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనాలను నిర్మిస్తారు. ప్రస్తుతం ఉస్మానియాలో 21 వైద్య విభాగాలు ఉండగా, మరో ఆరు సూపర్ స్పెషాలిటీ విభాగాలను కొత ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. అవి.. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, పాలియేటివ్ హెల్త్, రుమటాలజీ, జీరియాట్రిక్ మెడిసిన్. ప్రతి సూపర్ స్పెషాలిటీ విభాగానికి ఒక ఆపరేషన్ థియేటర్‌ను నెలకొల్పనున్నారు.

సెంటరాఫ్ ఎక్సలెన్సీగా ఉస్మానియా

ఉస్మానియా కొత్త భవనాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా రూపొందించనున్నారు. అత్యంత విశాలంగా, పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండేలా.. రోగుల గదుల్లోకి గాలి, వెలుతురూ ధారాళంగా వచ్చేలా.. ఆస్పత్రికి నాలుగు వైపుల నుంచి రహదారులు ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం ప్రముఖ డిజైనర్లను రంగంలోకి దింపారు. కొత్త ఆస్పత్రిలో జాతీయ అంతర్జాతీయ స్థాయి సెమినార్లు జరిగేలా తీర్చిదిద్దుతారు. అలాగే పరిశోధనలు జరుగుతాయి. నిమ్స్ మాదిరిగా అంతర్జాతీయ పరిశోధనలకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రపంచంలో ఉన్న ఉన్నతశ్రేణి వైద్య సంస్థలతోనూ ఒప్పందం చేసుకుంటారు. అంతర్జాతీయ వైద్యాన్ని కూడా ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే అవయవ మార్పిడికి సంబంధించిన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు.

1919లో నిజాం కట్టించిన ఆస్పత్రి

హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రిని 1919లో చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిర్మించారు. ఇండోసార్సెనిక్ శైలిలో నిర్మించిన ఈ భవనంలో 1096 పడకలున్నాయి. రోజూ సగటున 2500 మంది అవుట్ పేషంట్స్ వస్తారు. 180 నుంచి 200 మంది దాకా.. ఇన్‌పేషెంట్లుగా చేరుతారు. నెలకు సగటున 2-3 కాలేయ, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. 30 దాకా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. మొత్తం 21 విభాగాలుండగా.. 12 ఆపరేషన్ థియేటర్లు (వాటిలో 35 టేబుల్స్) ఉన్నాయి.

ఏపీలో గ్రామసభలకు
ప్రపంచ రికార్డు

వరల్డ్ రికార్డ్స్ యూనియన్ నుంచి ధ్రువపత్రం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 100 రోజుల లోపు సరికొత్త రికార్డును సృష్టించారు. ఆగస్టు 23న స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. రూ.4500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు తీర్మానాలు చేశారు. ఒకేరోజు ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సభలు నిర్వహించడం అతిపెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తూ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ తమ రికార్డుల్లో నమోదు చేసింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పవన్ కల్యాణ్ నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. రికార్డు ధ్రువపత్రాన్ని, మెడల్‌ను వరల్డ్ రికార్డ్స్ మేనేజర్ క్రిస్టఫర్ టేలర్ క్రాఫ్ట్ పవన్‌కల్యాణ్‌కు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే అమల్లో ఉన్న రాష్ట్రాల్లో అధ్యయనం

- పంజాబ్,హరియాణా,తమిళనాడులో ఉపసంఘం పర్యటన
- న్యాయపరమైన అంశాలపై నిపుణుల సలహాలు
- ఆటంకాలు లేకుండా పకడ్బందీగా ముందుకెళ్లేలా చర్యలు
- మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 16, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంపై అధ్యయనం చేసేందుకు.. ఇప్పటికే వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో పర్యటించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. పంజాబ్, హరియాణా, తమిళనాడు రాష్ట్రాల్లో త్వరలోనే ఉపసంఘం పర్యటించనుంది. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సోమవారమిక్కడి జలసౌధలో సమావేశమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనరసింహ, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పంచాయతీ రాజ్ శాఖామంత్రి సీతక్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై కమిటీ చర్చించింది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలని, దీని అమలు విషయంలో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలపై నిపుణులతో సలహాలు తీసుకోవాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం వ్యక్తిగతంగాను, అదేవిధంగా సమష్టిగానూ నిపుణులు, ఇతరుల అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించామన్నారు. పంజాబ్, హరియాణా, తమిళనాడు రాష్ట్రాల పర్యటనకు త్వరలోనే వెళ్తామన్నారు.

త్వరలో 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ

- పనులకు శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రి గడ్కరీ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



నల్లగొండ, సెప్టెంబరు 16: హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణకు రూ.2వేల కోట్లతో చేపట్టనున్న పనులకు త్వరలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేయనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్లగొండను రాష్ట్రంలో మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.450 కోట్లతో నల్లగొండ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ వంటి పనులు జరుగుతున్నాయన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు హౌసింగ్ బోర్డుకు చెందిన 50ఎకరాల స్థలాన్ని సేకరించినట్లు చెప్పారు. మరో 25 ఎకరాల్లో రూ.80కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.



సీఎం రేవంత్‌ను కలిసి చెక్కును అందజేస్తున్న గల్లా అరుణ

సీఎం సహాయనిధికి చిరంజీవి విరాళం

- రూ. కోటి ఇచ్చిన మాజీ మంత్రి గల్లా అరుణ
- చెరో రూ. 10 లక్షలిచ్చిన సాయిదుర్గా తేజ్, విశ్వక్‌సేన్



సీఎం రేవంత్‌ను కలిసి చెక్కును అందజేస్తున్న చిరంజీవి

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు ప్రముఖులు తమ వంతుగా సాయం అందించారు. సోమవారం మెగాస్టార్ చిరంజీవితో పాటు ఆయన తనయుడు రామ్‌చరణ్ రూ.కోటి విరాళంగా ప్రకటించారు. అందుకు సంబంధించిన చెక్కులను జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి చిరంజీవి అందజేశారు. అమర్‌రాజా గ్రూప్స్ తరఫున మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటిని ప్రకటించి సంబంధిత చెక్కును సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. అదే విధంగా తెలుగు సినీ ఇండస్ట్రీకి చెందిన నటులు సాయిదుర్గా తేజ రూ.10లక్షలు, విశ్వక్‌సేన్ రూ.10లక్షలను రేవంత్‌కు అందించగా.. విశ్వక్‌సేన్ వెంట వరంగల్ ఎంపీ కడియం కావ్య ఉన్నారు. ఇక ప్రముఖ హాస్య నటుడు అలీ రూ.3లక్షలు, గరుడపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25లక్షలు, మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి రూ.25లక్షలు, డైటీషియన్ వినీల రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించి చెక్కులను సీఎంకు అందించారు. కాగా, మొత్తంగా సోమవారం సీఎంఆర్ఎఫ్‌కు రూ.2.83 కోట్ల విరాళాలు అందాయి.

పరేడ్ గ్రౌండ్స్‌లో నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

- హాజరుకానున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా హైదరాబాద్ సంస్థాన విమోచన దినోత్సవం నేడు జరుగనుంది. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. రక్షణశాఖ, పారామిలిటరీ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా హాజరుకానున్నారు. ఉదయం 7.30 గంటల నుంచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. కాగా, ఉదయం 7 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

జర్నలిస్టు సూర్యప్రకాశ్‌కు అండగా సీఎం రేవంత్

- వైద్య ఖర్చులకు రూ.10 లక్షలు మంజూరు
- నేడు చెక్కు అందజేయనున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యానికి గురై ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు కేవీఎస్ఎస్ సూర్యప్రకాశ్‌కు సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. వైద్య ఖర్చుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఢిల్లీలో ఓ దినపత్రిక జర్నలిస్టుగా సూర్యప్రకాశ్ కొంతకాలంగా పనిచేస్తున్నారు. అయితే ఆయన మెదడులో రక్తం గడ్డకట్టడంతో తీవ్ర అనారోగ్యం పాలై మూడ్రోజుల క్రితం మ్యాక్స్ ఆస్పత్రిలో చేరారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న సీఎం రేవంత్ తక్షణమే స్పందించారు. సూర్యప్రకాశ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం ఢిల్లీలో సూర్యప్రకాశ్ కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

గాడిదలకేం తెలుసు?

(మొదటిపేజీ తరువాయి)

పొలిమేరల వరకు తరిమికొడదాం' అని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెడదామనుకున్నామని అంటున్నారని, మరి పదేళ్ల పాటు పాలనలో ఉండి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అందుకే తాము రాష్ట్రానికే గుండెకాయ వంటి సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిన, సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. " ఇది రాజకీయ వేదిక కాదు. కానీ, జరుగుతున్న పరిణామాలు, కొంత మంది మాట్లాడుతున్న మాటలను దృష్టిలో పెట్టుకుని, త్యాగమంటే ఏమిటో రాబోయే తరాలకు, ఈ రోజు చిల్లరమల్లరగా మాట్లాడుతున్నవారికి గుర్తు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాపై ఉంది. అడ్డగోలుగా వేల కోట్ల ఆస్తులు కూడబెట్టినవారికి గాంధీల కుటుంబ త్యాగాలు ఏం తెలుసు?" అని ప్రశ్నించారు. "ఈ రోజు ట్విటర్ పిట్ట అమెరికా వెళ్లి కంప్యూటర్ చదువుకున్నా అంటున్నడు. ఆ కంప్యూటర్‌ను ఈ దేశానికి పరిచయం చేసిందే రాజీవ్‌గాంధీ. ఆ కంప్యూటర్ లేకపోతే ఏ గుంటూరులోనో ఇడ్లీ, వడ అమ్ముకుంటూ తిరిగేటోడివి. సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో చాయ్, సమోసా అమ్ముకుంటూ ఉండేటోడివి. రాజీవ్‌గాంధీ కంప్యూటర్‌ను పరిచయం చేయడం వల్లే నీ బతుక్కి ఒక కంప్యూటర్, ఒక ట్విటర్ అకౌంట్ ఉన్నాయి. ఒక ఐటీ మంత్రివి అయ్యావు. లేకపోతే ఐటీ శాఖనే ఉండేది కాదు. దేశ సమగ్రతను కాపాడిన అంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం ముందు పెడితే, ఎందుకు పెట్టారని అడుగుతావా? అధికారం పోయినా.. మదం దిగలేదు" అని కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. "గాంధీలది కుటుంబ పాలన అంటున్నారు. కార్యకర్తలారా ఆ సన్నాసులకు చెప్పండి.. రాజీవ్‌గాంధీ చనిపోయిన తర్వాత దాదాపు 15 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. సోనియాగాంధీ ఏ పదవీ తీసుకోలేదు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నా.. సోనియా, రాహుల్ ఏ పదవులూ తీసుకోలేదు. పదవి, ప్రాణ త్యాగమంటే వాళ్లని చూడాలి. స్వాతంత్ర్య పోరాటమంటే ఆ కుటుంబాన్ని చూడాలి. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణ త్యాగాలు చేసి, దళిత, గిరిజన జాతులను ఆదుకున్నారు. సోనియా, రాహుల్ గాంధీ పదవీ త్యాగం చేసి పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి మేధావులను ప్రధానమంత్రులుగా పరిచయం చేశారు. మరి ఈ సన్నాసుల సంగతి ఏంది? అయ్య ముఖ్యమంత్రి, కొడుకు ఐటీ మంత్రి, అల్లుడు సాగునీటి పారుదల శాఖ మంత్రి, బిడ్డ ఎంపీ, సడ్డకుడి కొడుకు రాజ్యసభ సభ్యుడు. దుర్మార్గులారా రాష్ట్రాన్ని దోచుకు తిని, పదవులను పంచుకుని, వందలాది ఎకరాల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. మీరు గాంధీ కుటుంబం గురించి మాట్లాడుతారా? ఈ గాడిదలకు తెలుసా గాంధీల కుటుంబం గురించి? ఆనాడు చాకలి ఐలమ్మ ఒక మాట చెప్పారు. గడీల్లో గడ్డి మొలవాల్సిందేనని.. సాయుధ రైతాంగ పోరాటంతో అది జరిగింది. ఈ రోజు చెబుతున్న బిడ్డా.. మీ ఫాంహౌస్‌ల్లో జిల్లేళ్లు మొలిపిస్తా. మీరు అడ్డగోలుగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రేవంత్‌రెడ్డి ఊరుకోరు" అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



రాజీవ్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, వీహెచ్

పదేళ్లలో ఎందుకు పెట్టలేదు?

"ఇక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని అనుకున్నాడంట. నేను ఆ దిక్కుమాలినోడిని అడుగుతున్న. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టడానికి పదేళ్ల పడుతుందా? రూ.లక్ష కోట్లు దిగమింగి కాళేశ్వరాన్ని కట్టినవ్. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టకుండా పదేళ్లలో ఏ గాడిద పళ్లు తోమినవ్? ఆ సన్నాసి సొంత విగ్రహాన్ని పెట్టుకుందామని ఈ స్థలాన్ని రిజర్వ్ చేసి పెట్టుకున్నడు. ఆ పక్కన బుద్ధుడు, ఈ పక్కన బుద్ధి లేనోడి విగ్రహాన్ని పెట్టుకోవాలని వారి ఆలోచన. సచివాలయం ముందు దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ విగ్రహాన్ని పెట్టడం సముచితం కాదా అని తెలంగాణవాదులందరినీ అడుగుతున్నా?" అని రేవంత్ అన్నారు. "వాస్తవానికి ఆ గాడిదలే రాజీవ్ విగ్రహాన్ని పెట్టాలి. కానీ, మనం పెట్టిన విగ్రహాన్ని తొలగిస్తామంటున్నారు. ఎవడ్రా తొలగించేది? ఎవడొస్తడో నేను చూస్తా. పదేళ్ల తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం లోపలే పెట్టాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణ తల్లుల కడుపు కోతను దృష్టిలో పెట్టుకుని, ఒక తల్లిగా ఆలోచించిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం డిసెంబరు 9. తెలంగాణ ప్రకటన వచ్చిందీ అదే రోజు. అందుకే అదే రోజున లక్షలాది మంది తెలంగాణ బిడ్డల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం. మా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆదేశాలిస్తున్నా.. డిసెంబరు 9 నాటికి తెలంగాణ తల్లి విగ్రహం అక్కడ ఉండాలి. ప్రపంచమంతా అబ్బురపడేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నది మా ప్రతిన. రాజీవ్ విగ్రహం సాక్షిగా, సోనియా వారసులుగా ప్రజలకు మేం మాట ఇస్తున్నాం" అని రేవంత్ ప్రకటించారు.

ఇంతటి దుర్మార్గుడు, నీచుడు భూమ్మీద ఉంటాడా?

"ఇక్కడే కొండా లక్ష్మణ్ బాపూజీ కేసీఆర్‌కు పార్టీ పెట్టుకోమని ఇల్లు ఇచ్చిండు. అది కూలిపోతే, నిలువ నీడ లేకపోతే, కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే.. కనీసం ఆఖరి చూపులకు పోలేదు. ఇంతకంటే దుర్మార్గుడు, నీచుడు భూమ్మీద ఎవడైనా ఉంటాడా?" అని కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "అలాంటి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌కు పెట్టాం. మహిళా యూనివర్సిటీకి వీర నారి చాకలి ఐలమ్మ పేరు పెట్టినం. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టుకుంటున్నం. పదేళ్లలో ఇలాంటి గొప్ప వ్యక్తుల పేర్లు పెడతామంటే వద్దన్నారా? అన్నింటికీ నువ్వు, నీ కుటుంబమే కనబడాలి. తెలంగాణ మొత్తాన్ని దిగమింగాలన్న ఆలోచన మీ కుటుంబానిది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బండకేసి కొడతారని వాళ్లు ఊహించలేదు. ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ఫాంహౌస్‌లో ఆయనకు షాక్ ట్రీట్‌మెంట్స్ జరుగుతున్నాయి. కొంత మంది చిల్లరమల్లరగాళ్లతో మన గురించి మాట్లాడిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలారా జాగ్రత్తగా ఉండండి" అని రేవంత్ అన్నారు.



పంచాయతీలకు నేరుగా నిధులిచ్చింది రాజీవ్

"దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, సమూలమైన మార్పులు రావాలని భావించి ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించింది రాజీవ్ కాదా? అని ఈ సన్నాసులు, సోయి లేనోళ్లను అడగదల్చుకున్నా. ఢిల్లీ నుంచి గ్రామ పంచాయతీలకే నేరుగా నిధులు వెళ్లేలా రాజ్యాంగ సవరణలు చేసింది రాజీవ్ కాదా? మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత ఆయనది కాదా? అని ఈ సన్నాసులకు గుర్తు చేయదల్చుకున్నా. ఐదేళ్లు ఒక మహిళకు మంత్రి పదవి కూడా ఇవ్వని సన్నాసులకు మహిళా గౌరవం ఎలా తెలుస్తుంది?" అని రేవంత్ అన్నారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: కోమటిరెడ్డి

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై అడ్డగోలుగా మాట్లాడిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ దేశ ఐక్యత కోసం ప్రాణాలు అర్పించారన్నారు. అలాంటి కుటుంబం గురించి పనికిరానివాళ్లు, తెలంగాణ కోసం దొంగ నాటకాలు వేసిన వారు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ మానసిక పరిస్థితిపై అనుమానంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో ఇబ్బందులుండొద్దు.. అధికారులకు సీఎం ఆదేశం

గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులు, అధికారులను ఆదేశించారు. సోమవారం నిమజ్జన ఏర్పాట్లు, పర్యవేక్షణపై కమాండ్‌కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. నగరంలో 733 సీసీ కెమెరాలతో నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సీఎంకు చెప్పారు. ట్యాంకు బండ్‌తో పాటు ప్రధాన మండపాలు, చెరువుల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సీఎం సూచించారు.

రాజీవ్ విగ్రహం పెట్టి తెలంగాణ అస్తిత్వం తాకట్టు

- సీఎం చర్యకు నిరసనగా.. నేడు తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలతో అభిషేకం
- మేం వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సినచోట కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయం, తెలంగాణ అమర జ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ విగ్రహం పెట్టడం తగదని, ఇది మన అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తాను చేసిన తప్పును వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కేవలం ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణ ఆత్మను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలా? ఢిల్లీ బాసులా...? అంటే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీ బాసులకే జీ హుజూర్ అంటారన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో ఏర్పాటు చేయడాన్నే వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ చర్య తెలంగాణలోని ప్రతి ఒక్కరి మనసును గాయపర్చేలా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని, సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు తరలిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

పోలీసు వాహనాలకు ఇం'ధనం' కొరత!

నెలల తరబడి పేరుకుపోతున్న బిల్లులు.. రామగుండంలో రూ.2కోట్లపైనే బకాయిలు

- కరీంనగర్ పరిధిలో రూ.కోటిపైనే పెండింగ్
- చేతులెత్తేస్తున్న బంకుల యాజమాన్యాలు
- పెట్రోల్, డీజిల్.. అప్పివ్వమని స్పష్టీకరణ
- సొంత డబ్బుతో పోలీసుల సర్దుబాటు

మా కమిషనరేట్ పరిధిలో కార్లు, ద్విచక్ర వాహనాలు కలిపి 400కుపైగా ఉంటాయి. ఆ వాహనాలకు పెట్రోల్, డీజిల్ సర్దుబాటు చేయడం కష్టంగా మారింది. వెంట పడితే గానీ ఎప్పుడో ఒకసారి నెల బిల్లు క్లియర్ అవుతోంది. బంకుల్లో పెట్రోల్, డీజిల్ తీసుకోవాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.. ఇదీ ఓ కమిషనరేట్ ఎంటీవో ఆవేదన

మాకు ఇచ్చే డీజిల్... డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల్లో సమావేశాలకు హాజరయ్యేందుకు, ఖైదీల్ని రిమాండ్‌కు పంపేందుకే సరిపోతుంది. ఇక మిగిలే అరకొర డీజిల్‌తోనే పెట్రోలింగ్‌ను నెట్టుకు రావాల్సి వస్తోంది. బిల్లులు పేరుకుపోతే కొన్ని సార్లు బంకు వాళ్లను సముదాయించేందుకు ఎంతో కొంత సొంత డబ్బు చెల్లించి బిల్లులు వచ్చాక సర్దుబాటు చేయాల్సి వస్తోంది.. ఓ జిల్లాలో ఎస్సై పరిస్థితి.

.. ఇలా ఒకటీ, రెండూ కాదు... రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ వాహనాలను పెట్రోల్, డీజిల్ కొరత పట్టి పీడిస్తోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా... జిల్లాల్లో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. బిల్లుల భారం తడిసి మోపెడు కావడంతో కొన్ని జిల్లాల్లో బంకు యజమానులు పోలీస్ వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోసేందుకు ససేమిరా అంటున్నారు. మంచిర్యాల జిల్లా గోదావరిఖనిలో పెట్రోల్ బంకు యాజమాన్య సంఘం పోలీస్ వాహనాలకు పెట్రోల్, డీజిల్ ఉద్దెర ఇవ్వరాదని తీర్మానించిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో అక్కడి పోలీసుల వాహనాలకు పక్కనే ఉన్న మంచిర్యాలలో ఇంధనం నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లో పోలీస్ వాహనాలకు డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న పోలీస్ బంకులో పెట్రోల్, డీజిల్ సమకూరుస్తుంటారు. ఆయా వాహనాలకు కేటాయించిన కోటా మేరకు అక్కడ ఇంధనం పోస్తారు. కొన్ని పరిస్థితుల్లో అదనపు కోటా కేటాయించిన వాహనాలకు అదనపు కోటా ఇస్తారు. కానీ జిల్లాల్లో పరిస్థితి అలా ఉండదు. ప్రైవేటు బంకుల్లో పెట్రోల్, డీజిల్ తీసుకుని బిల్లులు చెల్లిస్తుంటారు. ఈ బిల్లులు సకాలంలో రాకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, రామగుండం, సిరిసిల్ల, జగిత్యాల తదితర ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితులు



ఉన్నాయి. ఒక్క కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోనే రూ.కోటి వరకు పెట్రోల్, డీజిల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రామగుండం కమిషనరేట్‌కు 8 నెలలుగా ఇంధన బిల్లుల చెల్లించకపోడంతో రూ.2 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సాధారణంగా ప్రతి పోలీస్ యూనిట్‌లో పీఎస్‌లు, వాహనాల సంఖ్య, అవి తిరిగే దూరాన్ని బట్టి బడ్జెట్ కేటాయిస్తుంటారు. సాధారణంగా కార్లకు 120-150 లీటర్ల డీజిల్, ద్విచక్ర వాహనానికి 30-35 లీటర్ల పెట్రోల్ ప్రతి నెలా ఇస్తుంటారు. కొన్ని కమినరేట్ల పరిధిలో అదనపు కోటా కింద మరి కొన్ని లీటర్ల పెట్రోల్, డీజిల్ లభిస్తుంది. మూడు నెలలకు ఒకసారి నిధులు విడుదల చేయాల్సి ఉన్నా.. క్రమబద్ధంగా జరగడం లేదు. సాధారణంగా జిల్లాల పరిధిలో డీఎస్పీలు, ఎస్పీల కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు సీఐలు, ఎస్సైలు వెళ్లాల్సి ఉంటుంది. వచ్చిన కోటాలో సగం వరకు సమావేశాలకు హాజరయ్యేందుకే సరిపోతుంది. ఇది కాకుండా వివిధ కేసుల్లో అరెస్ట్ అయ్యే నిందితుల్ని కోర్టులో హాజరు పరిచి అటు నుంచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించాల్సి ఉంటుంది. కోటాలో వచ్చే డీజిల్.. సమావేశాలు, రిమాండ్లకే సరిపోతుందని, మిగిలిన కొద్ది మొత్తాన్ని స్టేషన్ అవసరాలు, పెట్రోలింగ్‌కు సరిపెట్టుకోవాల్సి వస్తోందని పోలీసులు వాపోతున్నారు. ఆ బకాయిలు కూడా పేరుకుపోవడంతో డీజిల్ నింపేందుకు బంకు యజమానులు ససేమిరా అంటున్నారు. దీంతో ఎస్సైలు తమ సొంత డబ్బును ఎంతో కొంత సర్దుబాటు చేస్తూ.. నెట్టుకొస్తున్నారు. హైదరాబాద్ పరిధిలో వాహన కోటా, అదనపు కోటా ఇంధనం పూర్తి అయిన తర్వాత పీఎస్ పరిధిలోని ప్రైవేటు పెట్రోల్ బంకుల్ని పోలీసులు ఆశ్రయిస్తున్నారు. ఒక్కో బంకు నుంచి అవకాశాన్ని బట్టి 10, 15 లీటర్ల వరకు తీసుకుని సర్దుబాటు చేసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

3వేల కోట్లు.. 10వేల ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. రూ.3,000 కోట్ల పెట్టుబడులతో మూడు కంపెనీలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలంలోని జినోమ్‌వ్యాలీలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. లారస్ ల్యాబ్స్‌కు చెందిన పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. లారస్ ల్యాబ్స్.. కేఆర్‌కేఏ సంస్థలో కలిసి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించింది. తయారీ కేంద్రంతోపాటు కొత్త ఆర్ అండ్ డీ కేంద్రానికి లారస్ వచ్చే నాలుగేళ్లలో రూ.2,250 కోట్ల పెట్టుబడి పెట్టనుందని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా దాదాపు 2,800 మంది నిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. ప్రపంచంలో తొలి ఐఎఫ్‌సీ-ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫైడ్ లైఫ్ సైన్సెస్ కేంద్రం '3జీవీ'ని మంత్రి ప్రారంభించారు. ఆర్ఎక్స్ ప్రొపెలెంట్ కంపెనీ రూ.105 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దాదాపు 1.5 లక్షల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్న ఈ కేంద్రంలో 1,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే బయోపోలిస్ అనే సంస్థ రూ.700 కోట్లతో పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని వసతులతో కూడిన పరిశోధనా క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ప్రయోగాలు, ఆర్ అండ్ డి సెంటర్లు, అంకుర సంస్థలకు ఇది ఉపయోగపడనుంది. దీని వల్ల దాదాపు 6,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులతో 10వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు



లభించనున్నాయి. జీనోమ్ వ్యాలీలో ఫేస్-2 కింద 300 ఎకరాల్లో చేపట్టనున్న కొత్త ప్రాజెక్టు ఇంటర్‌నేషనల్ లైఫ్ సైన్స్ స్పేర్(హెచ్ఐఎల్ఎస్) బ్లూప్రింట్, లోగో తుర్కపల్లి జినోమ్‌వ్యాలీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. నూతన ఆవిష్కరణకు సంబంధించిన సానుకూల వాతావరణాన్ని తాము కల్పిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకుని దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించి ఇచ్చిన హామీ మేరకు పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కేంద్రీకృత రసాయన శుద్ధి ప్లాంటు, రోడ్ల విస్తరణ, పచ్చదనం పెంపొందించడం లాంటి సదుపాయాలతో జీనోమ్ వ్యాలీని ఒక ఆకర్షణీయ ఉత్పాదన, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. అనంతరం 30మంది పలు పరిశ్రమల యజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని భవిష్యత్తును రూపొందించడానికి ఆవిష్కరణ, అవకాశాలపై చర్చించారు. వీరిలో భారత్ బయోటెక్, సింజెన్, బయోలాజికల్ ఈ, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం

- బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతర్, యూఏఈ, సౌదీలో పనిచేసేవారికి వర్తించేలా ఉత్తర్వులు జారీ
- గల్ఫ్ కార్మికుల సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించింది. గల్ఫ్‌లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనుంది. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులకు ఇది వర్తించనుంది. ఆయా దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల సమస్యలపై అధ్యయనానికి ఒక సలహా కమిటీని కూడా ఏర్పాటుచేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గల్ఫ్ బాధితుల సమస్యలను వినేందుకు.. వారికోసం ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయనుంది. అంతేకాకుండా గల్ఫ్ కార్మికుల పిల్లలకు రాష్ట్రంలోని గురుకులాల్లో సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనుంది. గల్ఫ్ కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రయోజనం కల్పించే ఈ నాలుగు అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం జీవో నం.205 జారీచేశారు. గల్ఫ్‌లో పనిచేస్తూ 7.12.2023 నుంచి.. అంటే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గల్ఫ్‌లో మరణించిన తెలంగాణ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏ కారణంతో చనిపోయినా సరే.. వారి కుటుంబాలకు ఈ పరిహారాన్ని అందిస్తారు. ఇక.. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సలహా కమిటీ.. గల్ఫ్ కార్మికుల సమస్యలపైన, వారి సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై అధ్యయనం చేసి ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రగతి భవన్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణికి అనుబంధంగా గల్ఫ్ బాధితుల సమస్యపై ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణిని నిర్వహిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సాధారణ పరిపాలన శాఖ, ప్రణాళిక శాఖ, సంక్షేమ పాఠశాలల వ్యవహారం చూసే వివిధ విభాగాలు వీటిపై తదుపరి చర్యలు తీసుకుని, నిర్దిష్ట కాలంలో అమలుచేయాలని ఉత్తర్వుల్లో నిర్దేశించారు.గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు పరిహారం కోసం కొన్ని నెలలుగా ప్రయత్నాలుచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పొద్దుగాల ఈ తాగుడేంది?

» పూట గడవటం ఎలా? మీ కుటుంబం ఏం కావాలి?

» మందుబాబులకు రాజగోపాల్‌రెడ్డి మందలింపు

మునుగోడు, సెప్టెంబరు 16: 'పొద్దుగాల తాగుడు షురూ చేస్తే ఎలా? పూట గడవటం ఎలా... కుటుంబం ఏం కావాలి?' అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పలువురు మద్యం ప్రియులను మందలించారు. 'గ్రామాల్లో అసలే పేద కుటుంబాలు.. రోజంతా పనిచేస్తేనే కుటుంబం గడిచేది కష్టం... కనీసం మధ్యాహ్నం కాకముందే మద్యం తాగుతున్న మీకు పూట గడవటం ఎట్లా.. కుటుంబ సభ్యులు ఏం కావాలి' అని ప్రశ్నించారు. మద్యం దుకాణాల పర్మిట్ రూముల్లో ఉదయం 11 గంటలకే మద్యం తాగుతున్న వారికి ఎమ్మెల్యే ఇలా క్లాస్ తీసుకున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వివిధ దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను పరిశీలించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తున్నారా? షాపుల్లో నకిలీ మద్యం అమ్ముతున్నారా? అని నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. పర్మిట్ రూములను తనిఖీ చేస్తున్న క్రమంలో ఉదయం 11గంటలకే పలువురు మద్యం తాగుతూ కనిపించారు. దీంతో వారిని తీవ్రంగా మందలించి అక్కడి నుంచి పంపించివేశారు. పర్మిట్ రూంలను ఉదయం తెరవడం పట్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సాయంత్రం మాత్రమే తెరవాలని సూచించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇందుకు ప్రజలు తమకు సహకరించాలని కోరారు. బెల్టు షాపులను పూర్తిగా ఎత్తివేసిన మండల పరిధిలోని గుండ్లోరిగూడెం గ్రామ కమిటీ సభ్యులను సన్మానించారు.


మునుగోడులోని వైన్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మూత్రం పోశాడని రూ.30 వేల జరిమానా

» బహిరంగ మూత్ర విసర్జన చేస్తే కేసులు..ప్రజలకు సంగారెడ్డి శిక్షణ కలెక్టర్ హెచ్చరిక

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 16: మద్యం మత్తులో ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహ ప్రాంగణంలో మూత్ర విసర్జన చేయడమే కాక, ఇదేమిటని ప్రశ్నించిన శిక్షణ కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగిన ఓ డీలర్‌కు రూ.30 వేల జరిమానా పడింది. సంగారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహంలో శిక్షణ కలెక్టర్ మనోజ్ నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల తర్వాత పట్టణానికి చెందిన ఓ రేషన్ డీలర్ మద్యం మత్తులో కారులో అక్కడికి వచ్చి విశ్రాంతి గృహ ప్రాంగణంలో మూత్ర విసర్జన చేశాడు. ఇది గమనించిన శిక్షణ కలెక్టర్ మనోజ్ అతడిని వారించి.. ఇదేం పని? విశ్రాంతి ప్రాంగణం పాడైపోతుంది కదా? అని ప్రశ్నించారు. దీనికి ఆ డీలర్ 'నా ఇష్టం.. అడగడానికి నీవెవరు?' అంటూ వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన శిక్షణ కలెక్టర్.. మున్సిపల్ అధికారులను పిలిపించి, అతనికి రూ.30 వేలు జరిమానా విధించి, అతడి కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో ఎవరైనా, ఎక్కడైనా బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తే జరిమానాలు తప్పవని, అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని శిక్షణ కలెక్టర్ మనోజ్ హెచ్చరించారు.

పుట్టిన రోజే చివరి రోజైంది..!

» కెనడాలో హైదరాబాద్ యువకుడి మృతి

» సరస్సులో ఈత కొట్టేందుకు దిగి మునక..


స్నేహితులతో ప్రణీత్ సెల్ఫీ

సరూర్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజే ఆ యువకుడికి ఆఖరి రోజైంది.. కెనడాలో హైదరాబాదీ దురదృష్టవశాత్తు నీట మునిగి మరణించాడు. పుట్టినరోజున సంతోషంగా గడిపేందుకు స్నేహితులతో బయటికెళ్లిన అతడు.. సరస్సులో ఈత కొట్టేందుకు దిగి మునిపోయి మృతి చెందాడు. దీంతో యువకుడి స్వస్థలం మీర్‌పేటలోని అయోధ్యనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. అడుప రవి-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు.. ప్రస్తుతం వారిద్దరూ కెనడాలోనే ఉన్నారు. చిన్న కుమారుడు ప్రణీత్ (26) పీజీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. అయితే ఆదివారం అతడి పుట్టినరోజు కావడంతో శనివారం రాత్రే తన అన్న, మరో నలుగురు స్నేహితులతో కలిసి టొరంటోలోని లేక్ క్లియర్‌కు వెళ్లాడు. రాత్రి అక్కడే బసచేసిన వారు.. ఉదయాన్నే సరస్సులో ఈత కొట్టేందుకు దిగారు. ఈ నేపథ్యంలోనే ప్రణీత్ సరస్సు లోపలికెళ్లడంతో నీట మునిగి ఊపిరాడక మృత్యువాతపడ్డాడు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారమివ్వగా గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ విషాద వార్త తెలిసి అయోధ్యనగర్‌లో ప్రణీత్ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

25న హైదరాబాద్‌లో కుల గణన మార్చ్: జాజుల

పంజాగుట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణనపై 48 గంటల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు నుంచి ఇందిరా పార్కు వరకు లక్షలాది మందితో ఈ నెల 25న చలో హైదరాబాద్ పేరుతో కులగణన మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కులగణన మార్చ్, మహా ర్యాలీ పోస్టర్‌ను బీసీ కుల సంఘాల నేతలతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.


వందేభారత్ రైలు బోగీలో గవర్నర్, కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

'వందేభారత్'కు స్వాగతం

» నాగపూర్ నుంచి సికింద్రాబాద్ చేరిన రైలు

» పాల్గొన్న గవర్నర్, కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రారంభించిన నాగపూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైలు శనివారం అర్ధరాత్రి సికింద్రాబాద్ చేరింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. రైల్వేల అభివృద్ధికి ప్రధాని మోదీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని గవర్నర్ అన్నారు. ఢిల్లీ తర్వాత ఎక్కువగా వందేభారత్‌లు తెలంగాణకు కేటాయించడం గర్వకారణంగా ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు రాబోతున్నాయన్నారు. రూ.700 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో ఆధునికీకరిస్తున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వచ్చే ఏడాది, రూ.430కోట్లతో నిర్మించిన చర్లపల్లి టెర్మినల్ త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నాగపూర్‌లో ఉంటున్న తెలంగాణ ప్రజలు రైలు ప్రయాణాలకే ప్రాధాన్యం ఇస్తారని, మహారాష్ట్ర, తెలంగాణ ఐటీ ఉద్యోగులకు వందేభారత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వందేభారత్‌లకు రాష్ట్ర ప్రజల నుంచి అసాధారణ స్పందన ఉందని రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

చార్జీలు ప్రకటన

బర్కత్‌పుర: ప్రధాని మోదీ జెండా ఊపి సోమవారం ప్రారంభించిన నాగ్‌పూర్- సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ చార్జీలను రైల్వే అధికారులు ప్రకటించారు. 19 నుంచి ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్న సంగతి తెలిసిందే. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు సాధారణ ఎక్స్‌ప్రెస్‌లలో (3ఏసీ/ఏసీ చైర్‌కార్) టికెట్ ధర రూ. 955 నుంచి రూ. 965 వరకు ఉండగా, వందేభారత్ ఏసీ చైర్‌కార్ టికెట్ ధర 1350గా నిర్ణయించారు. భోజనం/స్నాక్స్ కోరుకునే వారు రూ. 150 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్నీ.. ఫ్రీజ్ చేయొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఫలితం లేకపోవడంతో.. షఫియుల్లా హైకోర్టును ఆశ్రయించారు. రూ.2.48 లక్షలను మాత్రమే ఫ్రీజ్ చేసి, బ్యాంకు ఖాతాను పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశించడంతో సాంత్వన పొందాడు. హైదరాబాద్ నగరంలోనూ ఈ తరహా బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయిన బాధితులు ఉన్నారు. పెట్రోల్ బంకులు, టీకొట్లు, బడ్డీకొట్లు, పచారీకొట్లు.. ఇలా చిరు వ్యాపారులకు రూ.100 లోపు బదిలీ అయిన నగదుకు సైబర్ నేరాలతో సంబంధాలుంటే.. మొత్తంగా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ఖాతాలు ఫ్రీజ్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇలాంటి బాధితులకు మద్రాసు హైకోర్టు తీర్పు ఉపశమనం ఇవ్వనుంది. మద్రాసు హైకోర్టు తీర్పు నేపథ్యంలో చట్టాల సవరణ జరగాల్సి ఉంటుందని సైబర్ నేరాల నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల అభిప్రాయపడ్డారు. అయితే.. సైబర్ నేరాలు జరిగినప్పుడు.. కేటుగాళ్లు నగదు బదిలీ చేసే బ్యాంకు ఖాతాలన్నీ ఆటోమ్యాటిక్‌గా ఫ్రీజ్ అయ్యేలా ప్రస్తుతం వ్యవస్థ కొనసాగుతుందని సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివమారుతి తెలిపారు. మద్రాసు కోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రక్రియను బ్యాంకర్లు మాన్యువల్‌గా చేయాల్సి ఉంటుందని, ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

లడ్డూ లాంటి హోదా!

వేలం పాటలో పోటాపోటీ.. సెంటిమెంటు కన్నా సమాజంలో పరపతి పెరుగుతుందనే భావనే ఎక్కువ

» పాటలో రియల్టర్లు, వ్యాపారుల హవా

» కాలనీ, అపార్ట్‌మెంట్లలోకీ వేలం సంస్కృతి

» బాలాపూర్‌లో మొదలైన సంప్రదాయం

» అప్పట్లో రూ.450.. ఇప్పుడు లక్షల్లో కామన్

ఉండ్రాలయ్య అండదండలు దండిగా ఉండాలన్నా.. తొండమెత్తి దీవించాలన్నా బొజ్జ గణపతికి 11 రోజుల పాటు పూజలు చేస్తే సరిపోతుందా? లంబోదరుడి చేతుల్లోని లడ్డూను కూడా దక్కించుకోవాలి! పార్వతీ సుతుడితో పాటు పూజలందుకున్న ఆ లడ్డూ కోసం వేలంలో ఎంతవరకైనా వెళ్లి పాడాలి! ఆ లడ్డూ దక్కితేనే ఏకదంతుడు అనేక వరాలు కుమ్మరిస్తాడు.. ఆ ఏడాదంతా అన్నీ శుభాలే జరుగుతాయి! ఈ సెంటిమెంటు అనే ఘాటు భక్తుల్లో రానురాను పెరుగుతోంది.





హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో.. 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని బాలాపూర్ గణేశ్ మండపం వద్ద సరదాగా మొదలైన లడ్డూ వేలం పాట ఇప్పుడో ట్రెండ్! అప్పట్లో.. బాలాపూర్‌లో లడ్డూ రూ.450 పలికితే అదో అద్భుతం! నిరుడు అదే మండపం వద్ద లడ్డూ రూ.27 లక్షలు పలికింది. ఇక్కడే కాదు.. నగరంలో చాలాచోట్ల లడ్డూ వేలం రూ.లక్షల్లో పలుకుతోందిప్పుడు! ఈ వేలం సంస్కృతి కాలనీల్లోనే కాదు.. అపార్ట్‌మెంట్ల పరిధిలో పెడుతున్న మండపాలకూ పాకింది. వేలం పాట లక్షల్లో ఉంటున్న చాలా చోట్ల రియల్టర్లు, బడా వ్యాపారులు రేసులో ముందుంటున్నారు. ఇప్పుడు లడ్డూ కోసం సామాన్య ప్రజలూ పోటీపడుతున్నారు. అవసరమైతే అప్పు చేస్తున్నారు. అంటే.. గణేశ్ లడ్డూ దొరకడం ఓ సెంటిమెంట్‌కు విఌంచి! లడ్డూ దక్కించుకుంటే అందరూ గుర్తిస్తారు. సమాజంలో హోదా, పరపతి రాత్రికి రాత్రే పెరుగుతుందన్నమాట. రాజకీయ ప్రయోజనాలు, కంపెనీల ప్రచారం తదితర కారణాల కోసం కూడా కొందరు లడ్డూ వేలంలో పాల్గొంటున్నారు. లడ్డూను వేలంలో సొంతం చేసుకుంటే పరపతి పెరుగుతుందంటున్నారు రావు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి. మూసాపేటలో ఉండే ఈయన తొలిసారిగా గణేశ్ లడ్డూను వేలం పాటలో గెలుచుకున్న తర్వాతే వ్యాపారంలోకి ప్రవేశించానని, కాలనీలో జనం తనను గుర్తు పడుతున్నారని, అదే తనకు వ్యాపారంలో విజయం సాధించేందుకు తోడ్పడిందని చెబుతున్నారు. ఇక.. ఫలానా మండపం వద్ద లడ్డూ దక్కించుకుంటే మరింత శుభదాయకం అనే భావనా భక్తుల్లో పాకిపోయింది. హైదరాబాద్‌లో వినాయక ఉత్సవాలు అనగానే తొలుత గుర్తొచ్చేది ఖైరతాబాద్ గణేషుడే కావొచ్చు.. కానీ లడ్డూ వేలం అంటే స్ఫురణకొచ్చేది బాలాపూర్ గణపతే. అక్కడ లడ్డూ దక్కించుకునేందుకు ఐదారేళ్లు పోటీపడ్డవారూ ఉన్నారు. ఈసారి.. నార్సింగ్ మైహోం అవతార్‌లోని గణేశ్ లడ్డూ రూ.7.51 లక్షలు, గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ లడ్డూ రూ.7.50 లక్షలు పలికింది. సాధారణంగా లడ్డూ కిలో నుంచి 21 కేజీల వరకూ ఉంటాయి. లక్షల్లో పలుకుతాయి.

పొలంలో చల్లితే దిగుబడి ఎక్కువ

వేలం పాటలో గెలుచుకున్న లడ్డూను వ్యాపారులైతే అయితే వ్యాపార చేస్తున్న చోట ఉంచితే బిజినెస్ బాగా సాగుతుందని.. రైతులైతే పొలంలో చల్లితే పంటల దిగుబడి బాగా వస్తుందని నమ్ముతున్నారు. ఇక.. లడ్డూ వేలం ద్వారా వచ్చిన సొమ్మును చాలాచోట్ల వచ్చే ఏడాది వేడుకల కోసం ఖర్చు పెడుతున్నారు. బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి నిర్వాహకులు మాత్రం గత కొన్నేళ్లుగా లడ్డూ వేలం ద్వారా వచ్చిన సొమ్మును వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణకు అందిస్తున్నామని చెబుతున్నారు. స్థానికంగా కొన్ని దేవాలయాల నిర్మాణాలకు, పునరుద్ధరణకూ వినియోగించినట్లు చెప్పారు. కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లోనైతే ఆ వచ్చిన డబ్బును అనాథ, వృద్ధాశ్రమాలకు విరాళంగా అందిస్తున్నారు. మై హోం విహంగలో లడ్డూ వేలం ఈసారి రూ.5.3 లక్షలు పలికింది. ఈ మొత్తాన్ని అనాథాశ్రమంలో పిల్లల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

విఘ్ననాయకుడికి వీడ్కోలు నేడు

గ్రేటర్ హైదరాబాద్‌లో 73 ప్రాంతాల్లో నిమజ్జనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో కొలువైన మహా గణపతి నుంచి.. గల్లీల్లోని గణనాథుల వరకు మంగళవారం నిమజ్జనానికి కదలనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హుస్సేన్ సాగర్‌తో పాటు సరూర్‌నగర్, కాప్రా తదితర ప్రాంతాల్లోని పెద్ద, చిన్న చెరువులు, పోర్టబుల్ పాండ్స్‌తో కలిపి 73 ప్రాంతాల్లో నిమజ్జనం చేయనున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ, ఇతర పనులకు 160 గణేష్ యాక్షన్ టీంలను జీహెచ్ఎంసీ రంగంలోకి దింపింది. వివిధ విభాగాలకు చెందిన 15 వేల మంది సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 35 వేల మందిపైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలోనే 3 వేల మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పోలీస్ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్తు లైన్లు అడ్డు రాకుండా, సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా టీజీఎస్‌పీడీసీఎల్ సిబ్బందిని రంగంలోకి దింపింది. ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వద్ద 8, పెద్ద చెరువుల వద్ద మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో మరుగుదొడ్లు, వాటర్ క్యాంప్‌లు, వైద్య శిబిరాలు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ తీరం వరకు 18 కి.మీ. మేర ప్రధాన శోభాయాత్ర సాగనుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి గణనాథుల ఊరేగింపు జరిగే మార్గాలు 300 కి.మీ. పైగా ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు 3, 4 కి.మీలకు ఒకటి చొప్పున గణేష్ యాక్షన్ టీంలు ఉంటాయి. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, సంజీవయ్య పార్కు, బేబీ పాండ్‌ల వద్ద 38 క్రేన్లు ఉన్నాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. నిమజ్జన ప్రక్రియకు ఆటంకం లేకుండా సాగర్ తీరం చుట్టూ పోలీసులు బారికేడ్లు పెట్టారు. అదనంగా 733 సీసీ కెమెరాలు బిగించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యేక ఐటీ బృందం శోభాయాత్రను పర్యవేక్షించనుంది. నిమజ్జన ఊరేగింపులో రంగురంగుల పేపర్లు చల్లొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కోరారు.

సంస్కృతాంధ్ర పండితుడు.. అమరేశం రాజేశ్వరశర్మ కన్నుమూత

నన్నెచోడుని కవిత్వంపై ప్రామాణిక పరిశోధన

ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షుడిగా సేవలు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సంస్కృతాంధ్ర పండితుడు, విశ్రాంత ఆచార్యుడు, విమర్శకుడు అమరేశం రాజేశ్వరశర్మ (95) కన్నుమూశారు. వారం కిందట అస్వస్థతకు గురైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. రాజేశ్వర శర్మ స్వస్థలం కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామం. వేములవాడ, నిజామాబాద్, సీతారాంబాగ్, విజయనగరం, కొవ్వూరు తదితర సంస్కృత కళాశాలల్లో వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 'నన్నెచోడుని కవిత్వం-కుమార సంభవం'పై ఆయన పీహెచ్‌డీ పరిశోధనను అత్యంత ప్రామాణిక విమర్శనా గ్రంథంగా పండితులు చెబుతారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 1951లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన రాజేశ్వరశర్మ.. వివేకవర్ధిని కళాశాల అధ్యాపకుడిగా, ఓయూ అనుబంధ కళాశాలల తెలుగు ఆచార్యుడిగా, తెలుగు శాఖ అధిపతిగా, కాకతీయ విశ్వవిద్యాలయం డీన్‌గా 1989 వరకు సేవలందించారు. యూజీసీ ఎమిరెటస్ ప్రొఫెసర్‌గా రెండేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవలి వరకు కూడా రాజమండ్రి, విజయనగరం సంస్కృత కళాశాలల్లో వ్యాకరణాన్ని బోధించారని రాజేశ్వరశర్మ శిష్యుడు, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం గుర్తుచేసుకున్నారు. భాషా శాస్త్రాల్లో సాధికారత కలిగిన రాజేశ్వరశర్మ ఓయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చదివారు. ఆయన రచనలు 'ఆంధ్ర లక్షణ దీపిక', 'నన్నెచోడుని కవిత్వం', 'వేదం వేంకట రాయశాస్త్రి రూపక సమాలోచనం', 'అహోబిల పండితీయాంధ్ర వివరణము', 'ఆంధ్ర వ్యాకరణ వికాసం', తదితర సాహిత్య విమర్శ, వ్యాకరణ శాస్త్ర గ్రంథాలతో పాటు ఆత్మకథ 'ఆత్మ నివేదనం' పుస్తకాలుగా వెలువడ్డాయి. బాలల కోసం 'చరిత్ర పుటలు' పేరుతో కొన్ని నాటికలు రాశారు. 'పోతన భాగవత పంచశతి నీరాజనం', 'శారదా మంజీరము' తదితర పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. రాజేశ్వరశర్మ సాహిత్య కృషికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో సత్కరించింది. కామారెడ్డి, ప్రాచ్య విద్యా పరిషత్తు స్థాపక కార్యదర్శిగా, వరంగల్‌లో పోతన భాగవత పంచశతి మహోత్సవ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఓయూ తెలుగు శాఖ ఆచార్యులు, బోధకులతో పాటు పలువురు కవులు, రచయితలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం అంబర్‌పేట శ్మశానవాటికలో రాజేశ్వరశర్మ అంత్యక్రియలు నిర్వహించారు.

మరమ్మతులకు నిధులేవి?

» రోడ్లు, భవనాల శాఖకు నిధుల కొరత

» రాష్ట్ర వ్యాప్తంగా 2,555 కి.మీ మేర దెబ్బతిన్న ఆర్ అండ్ బీ రోడ్లు

» తాత్కాలిక, పూర్తిస్థాయి మరమ్మతులకు అయ్యే ఖర్చు రూ.2,565 కోట్లు

» కాంట్రాక్టర్లకు1,190 కోట్ల బకాయిలు

» పాచ్ వర్కుల బిల్లులూ చెల్లించనివైనం



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారులు, భవనాల శాఖకు నిధుల కొరత ఏర్పడింది. పాత బకాయిలు పెండింగ్‌లో ఉండడం, కొత్తగా మళ్లీ వేల కోట్ల రూపాయలతో తాత్కాలిక, పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహించాల్సి రావడంతో ఆయా పనుల నిర్వహణకు నిధులు ఎలా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పనుల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. పాత బకాయిలు పెండింగ్‌లో ఉండడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఇటీవల కురిసిన వానలు, వరదలతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ పరిధిలో 2,555 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయని క్షేత్రస్థాయి పరిశీలనలో శాఖ గుర్తించింది. వీటి తాత్కాలిక, పూర్తిస్థాయి మరమ్మతులకు కలిపి రూ.2,565 కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు బిక్కమొహం వేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రహదారులు, వంతెనలు, బ్రిడ్జిలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో కేంద్రం ద్వారా విపత్తుల సాయం కింద అందే నిధులతో రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. కానీ దెబ్బతిన్న రోడ్లను గుర్తించి వాటి పనులు మొదలు పెట్టి 65-70శాతం పూర్తయిన తరువాతే కేంద్రం నుంచి వచ్చే సాయంలోని నిధులు శాఖకు అందుతాయని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

పాత బకాయిలు సుమారు రూ.1,190 కోట్లు ఉండడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వీటిలో నాన్-ప్లాన్ పనులకు సంబంధించి రూ.768కోట్లు, ప్లాన్ వర్కులవి రూ.422 కోట్లు బకాయిలున్నాయి. ఇవీ కాక ఈ మధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడా దెబ్బతిన్నట్లు గుర్తించిన చిన్న, చిన్న పనులకు సంబంధించి రూ.60 కోట్ల బిల్లులు కూడా రాలేదని, దీంతో పనులు ఎలా నిర్వహించగలమని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. పాచ్‌వర్కులు చేసిన కాంట్రాక్టర్లు దాదాపు 150-200 మంది ఉంటారని, వారందరికీ రూ.కోటిలోపే చెల్లింపులు చేయాల్సి ఉందని సమాచారం. ఈ బకాయిలుకు టోకెన్లు కూడా సిద్ధమైనా బిల్లులు మంజూరు కాలేదు.

ఎమ్మెల్యేల వేడుకోలు!

నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలకు సంబంధించిన చిన్న చిన్న పనులైనా చేయాలంటూ ఆయా ఎమ్మెల్యేల నుంచి కాంట్రాక్టర్లకు విజ్ఞప్తులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పాత బిల్లులు వస్తే కానీ చిన్న పనులైనా, కొత్త పనులైనా చేయగలమని, బిల్లులు రాకపోతే తాము మాత్రం పనులను ఎలా చేయగలమని ఎమ్మెల్యేల దగ్గర కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కాగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే అంశం, బకాయిలు వివరాలను తెలుపుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి ఇటీవల లేఖ రాసినట్టు తెలిసింది.

ఇక మూసీపై దృష్టి!

» త్వరలోనే షెడ్లు, గోదాముల కూల్చివేతలు..

» ఎంఆర్‌డీసీఎల్‌కు సహకరించనున్న హైడ్రా

» ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే నివాసాల తొలగింపు

» ఎఫ్‌టీఎల్, బఫర్‌లో 12 వేలపైగా కబ్జాలు

» నదికి ఇరువైపులా పూర్తయిన సర్వే



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి మానస పుత్రిక మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టును త్వరలోనే పట్టాలెక్కించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను త్వరలోనే తొలగించనున్నారు. దీనిపై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్ఎఫ్‌డీసీఎల్) సన్నాహాలు చేస్తోంది. ఈ తొలగింపులో సర్వం కోల్పోయే కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సంబంధిత కుటుంబాల జాబితాను కొద్ది రోజుల్లో ప్రకటించనున్నారు. ఇళ్లు ఇచ్చాకనే నిర్మాణాల తొలగింపు ప్రారంభించనున్నారు. ఇందుకు హైడ్రా సహకారం తీసుకోనున్నట్లు తెలిసింది. ఇక మూసీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని షెడ్లు, గోదాంల కూల్చివేతనూ చేపట్టనున్నారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టు పనులు ప్రారంభమవాలంటే ముందుగా అక్రమణలన్నీ తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం 3 నెలలుగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల రెవెన్యూ, సర్వే, ఎంఆర్‌డీసీఎల్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నుంచి తూర్పున కొర్రెముల వద్ద ఉన్న ఔటర్ వరకు సర్వేను పూర్తి చేశారు. నార్సింగ్ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు దాదాపు 25 కిలోమీటర్ల మేర ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 12 వేలకు పైగా అక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో హైదరాబాద్ జిల్లాలోని ఆసిఫ్‌నగర్, అంబర్‌పేట, బహదూర్‌పురా, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్‌ల పరిధిలో పెద్దఎత్తున అక్రమణలు ఉన్నట్లుగా తేల్చారు. బహదూర్‌పురా, సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలో అధికంగా నిర్మాణాలు ఉన్నాయి. చాలావరకు మూసీ నదిలోనే కాలనీలు సైతం ఏర్పడ్డాయి. 30, 40, 60 గజాల్లోనే ఇళ్లు కట్టుకున్నారు. మధ్యలో 10 అడుగుల దారి కూడా లేకుండా నిర్మించుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండల పరిధి రామంతాపూర్, బగాయత్ తదితర ప్రాంతాల్లో ఏకంగా కాలనీలే వచ్చేశాయి. ఆక్రమణలన్నీ తొలగించే బాధ్యతను హైడ్రాకు అప్పగించనున్నట్లు తెలిసింది. అయితే, మూసీ వెంట వివిధ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా పలు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి సంతృప్తి పరిచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొందరు గోదాములు, షెడ్‌లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే వీటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 17 సెప్టెంబరు 2024

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి
క్యాట్



ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: 2025 జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో
పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు



హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రీ-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి

విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే నిరుపేద ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో చదువుకోవాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు అక్టోబరు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జీఆర్ఈ/జీమ్యాట్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే ఈ పథకానికి అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల కంటే తక్కువ ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: telanganaepass.cgg.gov.in/



ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు: 819

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(కిచెన్ సర్వీసెస్)

ఖాళీలు: 819(యూఆర్-458, ఎస్సీ-48, ఎస్టీ-70, ఓబీసీ-162, ఈడబ్ల్యూఎస్-81). పురుషులకు 697, మహిళలకు 122 ఖాళీలు ఉన్నాయి.

శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు 165 సెం.మీ., మహిళల ఎత్తు 155 సెం.మీ. పురుషుల ఛాతీ 75 సెం.మీ. నుంచి 80 సెం.మీ. మధ్య ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.21,700- రూ.69,100

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

'టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్'లో ఖాళీలు

ఖాళీలు: 22

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్...కింద పేర్కొన్న గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-సి పోస్టులు

1. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **1 పోస్టు**
2. టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
3. సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **6 పోస్టులు**
4. సీనియర్ టెక్నీషియన్: **1 పోస్టు**
5. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **2 పోస్టులు**
6. టెక్నీషియన్: **1 పోస్టు**

అర్హత: పదో తరగతి, ఇంటర్మీడియట్ పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

ఫీజు: రూ.500. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులకు రూ.300. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15

వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in/

ఐఐఎం జమ్మూలో ఆపరేటర్లు

ఖాళీలు: 16

జమ్మూ కశ్మీర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ జమ్మూ(ఐఐఎం- జమ్మూ)లో.... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఆపరేటర్: **7 పోస్టులు**
2. ఐటీ టెక్నీషియన్: **2 పోస్టులు**
3. ఐటీ ఇంజనీర్: **1 పోస్టు**
4. నెట్‌వర్క్ ఇంజనీర్: **1 పోస్టు**
5. అకౌంట్ అసిస్టెంట్: 2 పోస్టులు
6. ఎగ్జిక్యూటివ్: **2 పోస్టులు**
7. ఆడియో- వీడియో టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: ఏసీ/రిఫ్రిజిరేషన్, చిల్లర్/బాయిలర్, ఎస్‌టీపీసీ, రివర్స్ ఆస్మాసిస్/డబ్ల్యూటీపీ, ఫైర్ అలారమ్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆడియో-వీడియో టెక్నీషియన్ పోస్టుకు 38 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఎక్స్ సర్వీస్‌మెన్/మహిళా అభ్యర్థులకు రూ.590; ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.295.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా' చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 25

వెబ్‌సైట్: www.becil.com



పవర్‌గ్రిడ్‌లో ఆఫీసర్ ట్రెయినీ

ఖాళీలు: 9

ఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పవర్‌గ్రిడ్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. క్లాట్ స్కోరు తప్పనిసరి.

జీతం: నెలకు రూ.40,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, బిహేవియరల్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ, క్లాట్ స్కోరు తదితరాల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: నవంబరు 7

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 27

వెబ్‌సైట్: https://www.powergrid.in/

ఎన్ఐఈలో కన్సల్టెంట్స్

ఖాళీలు: 7

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎపిడిమియోలజీ...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: సైంటిఫిక్(మెడికల్/నాన్ మెడికల్), టెక్నికల్(మెడికల్/నాన్ మెడికల్)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు కన్సల్టెంట్(మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.లక్ష, టెక్నికల్(మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.36,400.

వయోపరిమితి: 70 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా

పని ప్రదేశం: ఐసీఎంఆర్ - ఎన్ఐఈ, చెన్నై

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: https://www.nic.gov.in/

ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

ఖాళీలు: 6

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా


చివరి తేదీ: సెప్టెంబరు 23 **వెబ్‌సైట్:** https://www.nib.gov.in/

7 తేడాలను కనిపెట్టండి






దారి కనుక్కోండి






సరైన నీడను గుర్తించండి



గడుల ఆధారంగా బొమ్మ గీయండి



డైలీ సుడోకు - 411

		9				5		
	2		8		3		1	
				2	5	3	7	
		8						2
	7						6	
6						4		
	5	7	4	1				
	1		9		7		8	
		6				1		

సుడోకు - 410 సమాధానం

5	7	4	3	9	8	2	6	1
3	9	1	7	6	2	5	4	8
2	8	6	1	4	5	7	9	3
7	3	2	6	5	1	9	8	4
1	6	9	8	2	4	3	7	5
8	4	5	9	3	7	1	2	6
4	2	3	5	7	6	8	1	9
6	5	8	2	1	9	4	3	7
9	1	7	4	8	3	6	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.